374

374
2-57 తి

వెన్నెచోడుని కవిత్వము

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి
రెండువేలరూప్యముల బహుమతి నందినది



S.NO: 2266
Ac.NO. 80898

వేదము వేంకటరాయశాస్త్రి

TL
035,1;8
35459
160415

374
2-59.

S.NO: 2266
AE.NO: 20898



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి సభలో కవిసమ్రాట్ వేంకటరాయశాస్త్రిగారికి
శ్రీ డా. రాధాకృష్ణన్ గారు 10-1-'59 నాడు బహుమతి నొసంగుట

నన్నెచోడుని కవిత్వము

వేదము వేంకటరాయశాస్త్రి (M.A.) ప్రణీతము

హైదరాబాదు

ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమీవారి 1958 సంవత్సర బహుమతినందినది

OFFICE OF THE REGISTRAR OF BOOKS
JUN 1959
MADRAS



వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్,

4, మల్లికేశ్వరస్వామిగుడిసందు, లింగిసెట్టివీథి,

మదరాసు - 1.

1959

All Rights Reserved

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

1959 - ప్రథమముద్రణము - 1000 ప్రతులు.

160415

TL
035,1;8
3JN59



వేదము వేంకటరాయశాస్త్రి, M. A.

మనవిమాటలు

ఈవిమర్శను రచించు నుద్దేశము నాకు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారి ప్రకటనను చూచినవెంటనే కలుగలేదు. ఆతలంపే లేదు. పైగా చలనచిత్రకారులతో కొంత సహవాసముకుదిరి వారితో నేనును చలించుచుంటిని. మాయమ్మకు ఇది బొత్తిగా సరిపడకుండినది; 'బాబా! నీవు చేయఁదగినపనేనా ఇది?' అని ఒకదినము నన్ను నెమ్మదిగా చూచుచు చెప్పినది. ఆమాటలు నా హృదయమును గాడిపాఱినవి. సాభిప్రాయ వాక్యముగా తోఁచినది. 'నేను' చేయఁదగిన దేది? ఏదో గొప్పదే ఉన్నది! తర్వాత కొలఁది నెలలలో 'నెత్తురుపోటు' వలన అమ్మకు అస్వాస్థ్యము మేర్పడి మందులకు తిరుగక 1958 మే 7 తారీఖున అమ్మ గతించినది. తత్క్షణమే ఆదుఃఖమును మఱచుటకు, చలనచిత్రకార మొగము మఱి చూడక, ఇంటిలోనున్న తెనుఁగు గ్రంథములను చదువుటలో మునిఁగిపోయితిని. క్రమముగా నూతనభావము లుదయించి ఆంధ్రవాఙ్మయచరిత్రలో కవిత్రయయుగచరిత్రాంశముల కాలానుక్రమణి కను మార్పవలయునని తోఁచినది. ఈభావములను వెల్లడిచేయుచుంటిని. మిత్రులు వెంటనే నన్నెచోడునిపై నన్ను వ్రాయుమని ప్రేరింపసాగిరి. ఇంతలో ఆగస్టునెలయు పోయినది. నవంబరు 15-వ తారీఖులోగా వ్రాతప్రతియో ముద్రితప్రతియో సాహిత్యఅకాడమీవారికి పంపవలెను. ఇదంతయు మూఁడునెలలలో పూర్తియై తీరవలెను. తత్క్షణమే సెప్టెంబరునెల ప్రారంభకాలమున ప్రారంభించి వడివడిగా, పరీక్షాహాలులో ప్రశ్నలకు జవాబువ్రాయువిధమున, చిరకాలపఠనముచే తత్పూర్వమే సిద్ధముగా హృదయములోనుండిన విషయములను, ఏకాగ్రతతో వ్రాసి, పూర్తిచేసి, మిత్రులకు పెద్దలకుచూపి, వారి యంగీకారముతో, రెండు నకళ్లువ్రాసి ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమీవారికి సకాలమున చేర్చి

తని. భగవంతునిదయచేత బహుమతి వచ్చినది. నే నల్పమతినైనను ఈ బహుమతికి పాత్రమగుటకు కారణము మా యమ్మమాటలును ఆయమ తనుపు చాలించుటచే కలిగిన హృదయావేదనయు గాన నన్నావహించి నాకు ఇట్టిశక్తిని ప్రసాదించి నాచే నీ రచనచేయించిన అమ్మకు, జీవితకాల ములో నిరంతరము నాకు హితోపదేశముచేయుచు నన్ను దిద్ది తీర్చు చుండిన అమ్మకు, సరస్వతమ్మకు, ఈ సారస్వతుని యీసారస్వతము జ్ఞాపక చిహ్నము. ఎవరి వియోగము మఱువ లేనని తలంచితినో వారినే మఱువ రాని పరిస్థితి యేర్పడినది. నారచనల నన్నిటిని చదివి యానందించుచు సర్దుబాట్లు పెంచుచుండిన యమ్మ దీనిని చదివి యానందించుటకు లేదు. ఇది అమ్మకు పరోక్షవినయము. అమ్మమాటలే కారణముగా రచిత మైన నామాటలు అమ్మకే సమర్పించుట—'రవికి దీపమున నర్చలిచ్చుపగిది.'

'జనసీ జన్మభూమిశ్చ' అన్నట్లు రెండవది జన్మభూమి. అదే ఆంధ్ర ప్రదేశము. అచ్చటి సాహిత్యఅకాడమీవారి మన్ననకు పాత్రమైన ప్రాకృతి సుకృతి. వారికి కృతజ్ఞుడను.

చంద్రికా ముద్రణాలయాధికారి శ్రీ పమ్మి పొన్నయ్యశెట్టిగారు మాగ్రంథముల ముద్రాపకులు. ఈరచన చక్కగా ముద్రితమగుటకు వారు మామూలుకన్న నెక్కుడు శ్రద్ధవహించినందులకు వారికి నా వందనములు.

ఇందు చదువరుల కనుకూలమగునని ఒకపాటి కాలానుక్రమణి కను నానుడులను చేర్చితిని.

1-5-59
మదరాసు

వేదము వేంకటరాయశాస్త్రి.



అమ్మకు

వేదము సరస్వతమ్మకు



విషయసూచిక

ప్రకరణము.	పుట.
అవతారిక.	1
౧ - కవినామాదులు	4
తల్లిదండ్రులు	4
ఒరయూర్పురవరాధీశ్వర	5
చేంకణాదిత్యులు	7
జంగమ మల్లికార్జునుఁడు	9
౨ - కాలనిర్ణయసాధనములు	14
భాషాతత్త్వనిదర్శనము	15
ప్రబంధశైలి	17
3 - నన్నెచోడుని పీఠిక	18
తిక్కనలోలేని పద్ధతి	19
౪ - అంకితముచేయు పద్ధతి - దాని చరిత్ర - షష్ట్యంతములు	20
పాల్కురికి సోమనాథుని పద్ధతి	21
కేతన షష్ట్యంతములు	23
శాసనములు - స్తోత్రనామావళి	25
కేతన మొదటిషష్ట్యంతరచయిత	27
మనుమసిద్ధి మరణము	27
దశకుమారచరిత్ర రచనాకాలము	29
కేతనది వేంగినాఁడు	29
షష్ట్యంతములు - తిక్కనచేసిన సంస్కరణము	31

ప్రకరణము.	పుట.
కన్నడములో షష్ట్యంతరచన లేదు	33
ఆంధ్రులది ప్రత్యేకసంప్రదాయము	36
శ్రీపాదవారి యభిప్రాయము సాధువే	36
౫ - సప్తసంతానములు - వానిచరిత్ర	37
రాజరాజనరేంద్రునితర్వాత తెనుఁగుకవిత	37
సప్తసంతానములను మొదట పేరొక్కన్నవాఁడు మంచన, కేయూరబాహుచరితలో	39
శాసనములలో సప్తసంతానములు	39
ధర్మవివాహ మొకసంతానమా	41
తెలంగాణములో సప్తసంతానములు	43
గుంటూరులో ,,	45
నన్నిచోడుని సప్తసంతానములు పూర్తి	47
నల్లిల్లు=అగ్రహారము=ధర్మవివాహము	48
నల్లశబ్దార్థనిర్ణయము	49
వాఙ్మయములో సప్తసంతానములు	50
అంకితముల గ్రహించునుత్సాహము	51
కుపతుల దూషణము	52
కవిత కన్యయగుట	53
కృతి ఉత్తమసంతానము	54
౬ - అష్టాదశవర్ణనలు - వానిచరిత్ర	56
పాల్కురికి సోమనాథవిద్యానాథులు	57
ఆంధ్రులభావముల క్రమపరిణామము	
ఆంధ్రుల ప్రత్యేకత	59

ప్రకరణము.	పుట.
ప్రబంధరచనకు నన్నెచోడుఁడు మార్గదర్శకుఁడు కాఁడు	62
౭ - కృతిప్రారంభకర్తవ్యములు	63
పద్యముల పెరుగుదల	64
కుకవినిందాదులు	65
ప్రాకృతకావ్యముల పద్ధతి	66
ఆంధ్రమందలి ప్రత్యేకత - కన్నడపద్ధతికి భిన్నము	67
నన్నెచోడుఁడు మంచనకుతర్కాతివాఁడు	69
౮ - తెనుఁగులో చిత్రబంధకవిత్వములు -	70
పూర్వకవులలో లేదు	71
జక్కనతాత పెద్దయ మొదటివాఁడు	72
శాసనములలో ఈశ్వరభట్టోపాధ్యాయుఁడు	76
జక్కననాటి కవిత	77
లక్షణ, సంప్రదాయభేదములు	79
చోడుఁడు 1259 - 1323 నడిమివాఁడా!	80
౯ - నన్నెచోడుని కాలనిర్ణయము (1300?)	81
పై యెనిమిది ప్రకరణము సారాంశము	81
సకలనీతిసమ్మత రచనాకాలము	82
బద్దెనచోళుని బిరుదు - 'నన్నిచోడనరేంద్రా' యని	83
సుమతిశతక రచన	85
అథర్వణచ్ఛందస్సు	87
క్రీ. శ. 1275 శాసనములో నొక నానెదేవమహారాజు	89
తురుష్కుల దండయాత్ర	91
కొన్ని అన్యదేశ్యములు, బాఁకు, కైపు, తరవారి	92

ప్రకరణము.		పుట.
	అల్లాయుద్దీనుంగూర్చిన పద్యము	95
	ఈతనికాలము సుమారు 1300	96
కావ్యవిమర్శ		
౧౦ - కవిప్రతిజ్ఞ - దేశిమార్గకవితలు - జానుతెనుఁగు		101
	ప్రాచీనాలంకారికులు	101
	కావ్యము అనుభవించి ఆనందింపఁదగినది	102
	దేశిమార్గములు - పండయ్య	104
	,, - రన్నకవి	106
	మార్గకవితానిరసనము	107
	ఇతఁడు ఉభయకవికాఁడు	108
	జానుతెనుఁగు - దేశి, కేతన	109
	కర్ణాటకుల వలసలు	111
	నన్నయది పూర్వపద్ధతి	113
౧౧ - ప్రబంధపక్కి - గ్రంథనిర్మాణము		115
	ఆంధ్రుల సంస్కృతి	115
(1) ప్రబంధ క్రమపరిణామము,		117
	శృంగారనైషధ శృంగారశాకుంతలములు.	118
	వారివారి అష్టాదశవర్ణనలవరుస	121
ఆశ్వాసముల కథాక్రమము—దూత్యము		123
(2) గ్రంథనిర్మాణము—ఆశ్వాసములు		125
	అడ్డుపటలము	132
(3) ఇతని వర్ణనలు—ఇతరుల పోలికలు		135
	అష్టాదశవర్ణనల వివరము - 1 పురము	135
	2 సముద్రము - 3 కొండ - 4 ఋతువులు	136
	5 చంద్రుఁడు	137

ప్రకరణము.		పుట.
	6 సూర్యోదయము	138
	7 ఉద్యానము - దోహదక్రియలు	139
	8 సలిలక్రీడ	141
	9 మధుపానము	142
	10 రతోత్సవము	143
	11 విప్రలంభవర్ణన	145
	12 వివాహము, 13 కుమారోదయము	146
	14 మంత్ర 15 దూత్యములు	147
	16 ప్రయాణము	148
	17 యుద్ధ, 18 నాయకాభ్యుదయములు	149
౧౨ -	కుమారసంభవకథ - దాని యాకరములు—కవియుద్దేశము	151
	కథ కొంత పౌరాణికము	152
	ఉద్భట కాళిదాసులు	153
	క్రొత్తదక్షయజ్ఞకథ	155
	దాక్షాయణికై హిమవంతుని తపము	156
	మేనకకు దౌహృదము	157
	పార్వతి బాల్యక్రీడలు—భక్తి	158
	'రతి నిరతిశయభక్తి'	159
	శిరాపరాధమొనరించినవారు	160
	ద్రావిడాచారము తలంబ్రాలు లేదు	161
	గ్రంథము భక్తిస్థాపనకొఱకు	163
౧౩ -	అష్టాదశేతరవర్ణనలు	164
	పార్వతి శైశవక్రీడ—బొమ్మలపెండ్లి	165

ప్రకరణము.		పుట.
౧	నాయికాయావనప్రాదుర్భావము	166
	మునిపల్లె	167
	వనవర్ణన - కన్నడసాదృశ్యము	169
	హారునిపుర ప్రవేశము	170
	దారిద్ర్యవిద్రావణ స్తవము	171
	రాజనీతి	172
	దౌహృదము	173
౧౪ -	ఇతఁడు చేయని వర్ణనలు	174
	చంద్రికావిహారవర్ణన, దండకము	174
	పుష్పావచయమునకు రగడ	175
	నాయికాపరిదేవనము	177
	మేలుకొలుపులు	178
౧౫ -	వస్తుకవిత	179
	అనఁగా ప్రబంధకవిత్వమే	181
	కుమారసంభవము మిశ్రప్రబంధము	182
౧౬. -	పద్యరచనావిధానము	183
	శబ్దాలంకారములు	185
	వృత్త్యనుప్రాసము	187
	శబ్దసంస్పృష్టి	189
	ఆముక్తమాల్యదతోసామ్యము	191
	అర్థాలంకారములు	193
	భావములు	194
	నవరసములు	199

ప్రకరణము.	పుట.
౧౭ - కవనమహిమ, పాకాదులు	205
కవనచమత్కృతి	207
ఇమిడిక, బిగువు	209
చేమకూర పాకరుచులు	210
శ్రీరామేశ గవీశ్వరాదులు	213
సందర్భోచితవృత్తములు	214
ఉపసంహారము	216
అనుబంధము (అ) ఇందలి నానుడులు	1
,, (ఆ) ఒకపాటి కాలానుక్రమణిక	3
ఇందుదాహరింపబడిన పద్యములు శ్లోకములు	11

ఇందుదాహృతగ్రంథములు

అథర్వణచ్ఛందము
అప్పకవీయము
అభినవగుప్తుఁడు (సం)
ఆంధ్రకవితరంగిణి (శేషయ్య)
ఆంధ్రభాగవతము (పోతన)
ఆంధ్రభాషాభూషణము (కేతన)
ఆంధ్రబిల్హణీయము (సింగరార్య)
ఆంధ్రవిక్రమోర్వశీయనాటకము-
(వేదము వేంకటరాయశాస్త్రి)
ఆంధ్రసాహిత్యదర్పణము (,,)
ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.
ఆంధ్రమహాభారతము - (నన్నయ)
,, (తిక్కన)
ఆంధ్రవాఙ్మయచరిత్ర - (వంగూరి
సుబ్బారావు, ద్వి. ముద్ర.)
ఆనందవర్ధనుఁడు (సంస్కృ)
ఆగ్నేయపురాణము (సంస్కృ)
ఆముక్తమాల్యద (శ్రీకృష్ణదేవరాయలు)
,, (సంజీవనీవ్యాఖ్య-వేదము)
ఉత్తరహరివంశము (నాచనసోమ)
కళింగత్తుప్పరణి (తమిళ)
కవిజనాశ్రయము (భీమకవి) జయంతి
వారి పీఠిక.
కవిరాజమనోరంజనము.
కావ్యాలంకారచూడామణి.
కావ్యాలంకారసంగ్రహము (నరసభూ)
కాశీఖండము (శ్రీనాథుఁడు)

కుమారసంభవము (కాళిదాసు)
,, (నన్నెచోడ-కవిగారి
ముద్రణము-1910. I భా.
,, ద్వి. భా. కవిగారిది.
జ్యోతిష్మతీముద్రణ 1914.
,, (యూనివర్సిటీ)
,, (వావిళ్ల-రెండుముద్ర
ణములును)
,, (వ్రాతప్రతి-నేలటూరి
వేంకటరమణయ్యగారిది)
కుమారసంభవవిమర్శ - శ్రీపాద లక్ష్మీ
పతికాస్త్రిగారిది.
కువలయాశ్వచరిత్రము (సవరము)
కేయూరబాహుచరిత్ర (మంచన)
గదాయుద్ధము (కన్నడ - రన్నకవి)
గౌడవహో (గౌడవధ, ప్రాకృతము,
వాక్పతిరాజకవి)
చాముండరాయపురాణం (కన్నడ)
ఛందోంబుధి (కన్నడ - నాగవర్మ)
జైమినిభారతము (పిల్లలమఱ్ఱి పినవీరన)
తిక్కనసోమయాజివిజయము (వేదము
వేంకటరాయశాస్త్రి)
తిరువాయ్మొళి (శ్రీ) (తమిళ)
త్రికాండశేషము (సం. నిఘంటు)
దశకుమారచరిత్రము (ఆంధ్రీ-కేతన)
నన్నెచోడకవిచరిత్ర (దేవరపల్లి వేంకట
కృష్ణారెడ్డి)
నిర్వచనోత్తరరామాయణము (తిక్కన)
నీతితారావళి (మడికి సింగన)

నీతిశాస్త్రముక్తావళి (బద్దెన)
నృసింహపురాణము (ఎఱ్ఱాప్రెగడ)
నేమినాథపురాణం (కన్నడకర్ణపార్య)
పండితారాధ్యచరిత్ర (పాల్కురికి)
పంపభారతము (కన్నడ పంపకవి)
పద్మపురాణము, మడికి సింగన.
ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలా
సము - పూండ్లవారి పీఠిక.
పాల్కురికిసోమనాథుఁడెప్పటివాఁడు
(నేలటూరి వెంకటరమణయ్య)
ప్రతాపరుద్రీయము (సం. విద్యానా
థుఁడు)
పారిజాతాపహరణము (ముక్కుతిమ్మన)
పుష్పదంతపురాణము (కన్నడగుణవర్మ)
బసవపురాణము (పాల్కురికి సోమ)
బ్రౌణ్యము (మిశ్రభాషానిఘంటువు)
భరతనాట్యశాస్త్రము (సం)
భానుమతీపరిణయము (రెం. రంగరాజు)
భీమవుఁడు (సం)
భోస్కరరామాయణము.
మనుచరిత్రము - స్వారోచిష.
మమటుఁడు (సం)
మార్కండేయపురాణము (మారన)
ముకుందవిలాసము.
ముద్రామాత్యము.
మేదిని (నిఘంటువు. సం.)
రంగనాథరామాయణము.
రఘువంశము (సం. కాళిదాసు)
రుద్రటుఁడు (సం)
రేచనఛందస్సు.
వసుచరిత్రము.
వసుచరిత్రరచనావిమర్శ (వఝుల)
విజయవిలాసము (చేమకూర)
విక్రమార్కచరిత్రము (జక్కన)
శకుంతలాపరిణయము (శృంగారశాకుం
తలము, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు)
శబ్దరత్నాకరము (నిఘంటువు)
శాంతిపురాణము (కన్నడపొన్నమయ్య)
శిశుపాలవధ (సం. మాఘ)
శివతత్త్వసారము.
శివపురాణము (సం)
శృంగారనైషధము (శ్రీనాథుఁడు)
సకలనీతిసమ్మతము.
సాహిత్యదర్పణము (సం)
సుమతిశతకము (బద్దెన)
స్కాందపురాణము (సం)
హరివంశము (ఎఱ్ఱాప్రెగడ)
హరనైషధము.
హోరావళి (నిఘంటువు)
హేమచంద్రుఁడు (సం)

శాసనములు

South Indian Inscriptions (S. I. I.) Vols, iv, vi, x.
Annual Reports of Epigraphy (A R E)
Inscriptions of the Nellore District (N. D. I)
Journal of Andhra History and Culture (J. A. H. & C)
Hyderabad Archaeological Series No 13.
History of the Reddy Kingdoms - Sri Mallampalli Soma-
Sekhara Sarma.
Introduction to Sahitya Darpana - Prof Kane.
TAMIL LEXICON.

నన్నెచోడుని కవిత్వము

అవతారిక

ఆంధ్రవాఙ్మయమునందు నన్నెచోడమహాకవి కవిత్వ మహత్త్వమునుగూర్చి పండితులకు ఎట్టి భిన్నాభిప్రాయములు లేకపోయినను ఈతని కాలమునుగూర్చి మాత్రము నలువదియేండ్లక్రింద ప్రారంభమైన వివాదము ఇంతవఱకును ఒక కుదురునకు వచ్చినట్లు కానరాదు. ఎవరికి తోచినది వారు వ్రాయుచున్నారు. ఒకొక్కరికిని ఏదో క్రొత్తవిషయము దొరకుచునేయున్నది. నన్నయకు పూర్వుడను వాదము మొదలు తిక్కనాదులకు చాలతర్వాతివాడను వాదమువఱకు దేశమందు పర్వియున్నది. ఈవిధముగా ఎటుసాగదీసిన నటుసాగుటకును ఎన్నివిధములుగా మెలిఁబెట్టిన అన్నిమెలికెలు పడుటకును తగినట్టి వింతకావ్యమును వ్రాసిన యీకవిశిఖామణింగూర్చి వాఙ్మయవిమర్శన మున్నంతకాలము పరిశోధన జరుగుచుండునేమో! చారిత్రకదృష్టితోను భాషావిమర్శక వాఙ్మయవిమర్శక దృష్టితోను గ్రంథాంతర భాషాంతర సంప్రదాయ సంవాదాదికములతోను, అక్షరమక్షరము పరిశోధించి విమర్శకులు వ్రాసియున్నారు. అట్లుండియు ఈయభిప్రాయభేదము లేర్పడుట వింత! నన్నయకుముందు వాడనుటకు ధైర్యముచాలక, తిక్కనకు తర్వాతివాడనుటకు తెగువలేక, సాధుమార్గముగా 'అన్యులమనముల్ నొప్పింపక తానొవ్వక' యుండురీతిని 'తప్పించుక' కొందఱు నన్నయ తిక్కనల నడిమివాడితఁడని తీర్మానించుకొనిరి; తమకనుకూలముగా శివకవుల శరణుచొచ్చిరి. వీరివాదముకూడ యుక్తియుక్తముగానే కనఁబడును. కాని ఇందఱు పండితులును తాము విమర్శించునప్పుడు ఒకవిషయమును విస్మరించుచున్నారు; నన్నెచోడుని ప్రాచీనతను తమహృదయములలో నిశ్చయమొనరించుకొని అతఁడర్వాచీనుఁడుగా నుండఁడను నమ్మకముతోనే తమ విమర్శలకు లేదా పరిశోధనలకు గడంగుచున్నారు. కాదా అట్లు తమ పరిశోధనలను తమ నిశ్చితాభిప్రాయముల కనుకూలముగా త్రిప్పుచున్నారా యని యనిపించుచున్నవి వారి రచనలు. గ్రంథమును

చక్కఁగా విమర్శించి తుదిని నిర్ణయమునకు వచ్చుట గదా సాధు మార్గము. మఱి—

నన్నెచోడకవి కాలమిు తెలియదు. కవి గ్రంథములో స్పష్టముగా వ్రాయలేదు. ఒకవిధముగా ఊహించుటకుఁ గూడ అవకాశమియ్యలేదు. ఈకవియొకఁడు ఇటువంటివాఁ డున్నాఁడనికూడ ఏఁబదియేండ్లక్రిందటి వఱకు మన మెఱుఁగము. గ్రంథము క్రీ. శ. 1910 ప్రాంతమున శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారి కృషిచే బయలువడినది. అంతవఱకు నేర్పడిన వాఙ్మయపరిణామాదికములచేతను, మన మెఱిఁగిన కాలమిులచేతను, నిర్ణీతమైన యనుక్రమణికల నడుమ ఈగ్రంథమును - ఇందలి గుణాదిక ములచే - ఎచ్చట స్థాపింపనగును అనునదియే జిజ్ఞాస. దొరకినదానిచే దొర కనిదానిని, తెలిసినదానిచే తెలియనిదానిని కనుఁగొన ప్రయత్నించుటయే చారిత్రకమార్గము. ఏవోకొన్ని ప్రాచీనపదములు, ద్రావిడకర్ణాటకపద్ధ తులు, తర్వాతికవులలో అప్రసిద్ధములైన రచనావిధానములు - వీనిచేత ఈతఁడు ప్రాచీనుఁడని యూహించి, ఇతనిగ్రంథము 'ఆంధ్రసాహిత్య ములో ప్రబంధశాఖకు తోలియుదాహరణమై, పురాణకవిత్వమున ఆంధ్ర భారతమునకు గల గౌరవప్రపత్తులను పొందుచున్నది' అనియు 'ఈ కావ్యారంభమున నీతఁడు ఇష్టదేవతాస్తుతి సుకవిస్తుతి కుకవినిరసనము షష్ట్యంతములు మొదలైన కావ్యసంప్రదాయముల నెన్నిటినో ప్రథమ పర్యాయము ప్రవేశపెట్టెను. తరువాతవచ్చిన ఆంధ్రకవులందఱును, కవి బ్రహ్మ తిక్కనామాత్యుఁడుకూడ, ఈసంప్రదాయమును పాటించుచు వచ్చిరి' అనియు, ఇతనినే తిక్కనాదులు ఒరవడిగా గ్రహించినట్లు విమ ర్శకులు వ్రాయుచున్నారు. "శివకవుల 'జానుతెనుఁగు' ఆదర్శమును ప్రప్రథమమున లోకమునకు ప్రకటించినవాఁ డీమహాకవియే" అని శివ కవులకు కూడ ఈతఁడే మార్గదర్శియనియు రచనలు సాగినవి. అట్లగు నేని ఈతనిపద్ధతి నవలంబించిన తర్వాతికవులుగా తలంపఁబడువా రెవరును ఈతని పేరైన నెత్తలేదు సరిగదా ఈతనిశైలినికూడ అనుక రింపలేదు; ఈతని యపూర్వపదజాలమును ఈతనికే వదలినారే! పైగా

ఇంత చక్కని కవితాసంప్రదాయము సకలావయవసంపూర్ణముగా నభివృద్ధియైయుండ దానిని అట్లె గ్రహింపక తిక్కనాదులు కొద్దికొద్దిగా ప్రారంభించి మెట్టుమెట్టుగా తర్వాత కొన్ని శతాబ్దములకు ఈతనిపద్ధతిని పూర్తిగా నవలంబించిరన్నయెడల ఈతనిమార్గము అనుకరణయోగ్యము కాదనియో, లేక కష్టసాధ్యమనియో, సులువుగా ప్రాచీనుడాతడు సాధించిన మార్గమును సాధించుటకు తిక్కనాదులకే చాలకాలము పట్టె ననియో చెప్పవలసివచ్చును. ఇదంతయు నెట్లున్న దనఁగా-మహాసౌధము చక్కఁగా నిర్మితమైనది ఒకటియుండఁగా దానిని నేలమట్టముగావించి మరల పునాదులతోకూడ అవిధమునసే కట్ట నారంభించిన ట్లున్నది. తిక్కనతోప్రారంభమై క్రమపరిణామము నందినదని మనముతలంచినకృతి ప్రారంభకర్తవ్యాదులు తత్పూర్వమే చక్కనిరూపము నందియుండిన యెడల దానిని పూర్తిగా విస్మరించి తిక్కన మరల మొదటినుండియు ప్రారంభించెనా? నిర్వచనోత్తరరామాయణమునాఁటికి నన్నెచోడుని షష్ఠ్యంతాది సంప్రదాయమును గ్రహింపక తర్వాత భారతమునాఁటికి గ్రహించెనా? వీనికన్నిటికిని ఏవేవో సమాధానములు పండితు లూహించినారు. ఇదంతయు, చాల తలక్రిందులుగా కనఁబడుచున్నది. కావున, కేవలము కవి వాక్యములచేతను, కావ్యస్వరూపమునుబట్టియు, కవిభారితిని పరిశీలించియు, దొరకినశాసనములను యథాస్థితముగా గ్రహించియు కవి ఎప్పటివాఁడుగా నుండునో చక్కఁగా చూచుకొని తరువాతనే తిక్కనాదులే ఈతని ననుసరించిరో లేక ఈతఁడే వారి ననుసరించెనో నిర్ణయించుట మంచిది. ఆంధ్రవాఙ్మయమున నీతనిగ్రంథము ఎచ్చటికి అతుకునో గ్రహించుట యుక్తము.

౧ - ప్రకరణము

కవినామాదులు

ఈకవి తన వంశాదికమును సగరసుతులతో ప్రారంభించి, భగీరథుని పేరొక్కని, రాఘవునిస్మరించి, కరికాలచోడునికడకుతెచ్చి నిల్పి - తనది సూర్యవంశమనియు, అట్టి కరికాలచోడుని వంశమందు తాను జనించిన వాఁడ ననియు, తనపేరు నన్నెచోడజనవిభుండనియు తెలుపుకొన్నాఁడు. తన తల్లిదండ్రులను గుఱించి గొప్పగా చెప్పినాఁడు. శాసనములలో కనఁబడునట్లు కరికాలచోళునినుండి తనవఱకును వంశవృక్షమును మాత్రము తెలుపలేదు. తండ్రి చోడబల్లి, 'పాకనాటియం దిరువదియొక్క వేయిటి కధీశుఁడు.' పైగా 'అరినరపాలమౌళిదళితాంఘ్రియుగుండు.' తల్లి 'శ్రీసతి,' 'చిరతరకీర్తి' 'అగ్రమహిషీతిలకము' 'హైహయాన్వయాంబరశశిరేఖ, గుణభాసిని.' మఱి తా నన్నను—

"కలుపొన్నవిరులఁ బెరుగం
గలుకోడిరవంబు దిశలఁ గయఁగఁజెలఁగఁ
బొలుచునొరయూరి కధిపతి
నలఘుపరాక్రముఁడఁ డేంకణాదిత్యుండఁ.

"పాత్రుఁడ నసదృశ కాశ్యప
గోత్రుఁడ సచ్చరిత నుభయకుల శుద్ధుండఁ
మిత్రాన్వయశేఖరుఁడఁ, బ
విత్రీకృతదేహుఁడను వివిధయజ్ఞములఁ.

వ. ఇట్లు విశిష్టగుణగణాలంకృతుండనై నెగడు నస్మదీయానూన ప్రతిభార్ణవోదీర్ణరుచిరవస్తువిస్తారి తోత్తమ కావ్యవిభూషణంబు"— అనియు

"రవికులశేఖరుండు కవిరాజశిఖామణికావ్యకర్త స
త్కవి భువి నన్నెచోడుఁడఁట.... ..." —

అనియు చెప్పుకొని, తనగురువును కృతిపతియు జంగమమల్లికార్జున యోగీంద్రుఁడని తెలిపినాఁడు.

"అన్యథైవ వితతి నర్చించు కొలుపు తా
డిడి ఫలంబు గొనుట పడయఁగనెడి
సద్వారిష్ఠఫలదు జంగమమల్లికా
ర్జునుని కొలుపు మొసరు మునుఁగఁ గొనుట.
వ. అని సద్భక్తియుక్తి నిశ్చయించి
క. శ్రీపీఠంబున నిడు తన
శ్రీపాదుకలందు వ్రాలి సేవించెదనేఁ
బాపహతిఁ జేసి పుణ్యం
బాపాదింపంగ మల్లికార్జునదేవుఁ.
..." ఇత్యాదిగా "మదీయ గురుచరణారవిందంబు లభినందించి" అని వ్రాసికొన్నాఁడు.

ఈ సామగ్రితో శాసనములను సమన్వయించి పండితులుపలువురు ఈతనికాలమును, ఆంధ్రభాషాపరిణామ నిదర్శనాదికములతో పనిలేకయే, గుర్తింపఁబ్రయత్నించిరి. కరికాలచోళవంశస్థులైన తెలుఁగు చోళులు పలువురు ఆంధ్రదేశమున అటనటను, పాకనాడు కమ్మనాడు ప్రాంతములందును పరిపాలించియుండినవారి శాసనములు దొరకినవి. అందు చోడబల్లి శ్రీసతుల కొమారుఁడును పాకనాడు21000దేశమును పాలించినవాఁడును ఒరయూరికధిపతియు, తొంకణాదిత్యుఁడునునైనవాఁడు నన్నెచోడుఁడు దొరకవలయును. తల్లి శ్రీసతి హైహాయులయింటి ఆడుఁబడుచుగా నుండవలయును. పాకనాటిపాలకుఁడు ఒరయూరి కధిపతిగా నెట్లుండఁగలఁడు? పాకనాడు ఆంధ్రదేశమందలి నెల్లూరుజిల్లాలోని పెన్నకుత్తరభాగము కొంతయు కడపజిల్లాలోని కొంతభాగమును. పెన్నకు దక్షిణమేయైనను నెల్లూరినగరమును ఇందు చేరియున్నది. ఒరయూరన్ననో తిరుచినాపల్లె నగరమున కరమైలు పశ్చిమమున నున్నది. ఇంతదూరము జయించి ఈరాజు పాలించెననుటకు ప్రమాణములులేవు. అట్లుండి

యుండుటకు అవకాశమును లేదు. మఱేమన్న 'ఒరయూరుపురవరా ధీశ్వర' యనునది ఈతెలుఁగుచోళుల బిరుదు, పరంపరాగతము. శాస నములచే నీ సంగతి చక్కఁగా తెలియును.

"స్వస్తి చరణసరోరుహ విహతవిలోచనత్రిలోచనప్రముఖా ఖిల పృథ్వీశ్వర కారిత కావేరీతీర కరికాలకులరత్న ప్రదీప అపరి మితప్రతాప సతతసామంతార్చిత ఒఱయూర్పురవరాధీశ్వర కాశ్యపగోత్ర అతిచతురకామినీజనజయంత తురగరేవంత విత రణవినోదవిక్రమాదిత్య తేంకణాదిత్య రిపువిపులమార్తాండ జగ నొబ్బగండ గర్వితారాతి కుమారకులకుధరకులిశధర శరణాగత వజ్రపంజర కాంచీపురవరాధీశ్వర దాయాదిమండలికదిశాస్వస్తి కీర్తినారాయణ భుజబలవీర తిరుక్కాళత్తిదేవ చోడమహారాజు లకు ధర్మ్మవుగాను ... ..."

ఇది మామూలుగా వీరి శాసనముల ధోరణి. 'ఒరయూరుపురవరా ధీశ్వర' యనునది ఆపురముతో ఎన్నఁడో, ఈకుటుంబమునకు సంబంధ ముండినదని తెలుపు 'ఇంటిపేరు' వంటిది; అయోధ్యతో సంబంధము వీడి పోయిన కొందఱు రాజులయొక్క 'అయోధ్యాపురవరేశ్వర' అను బిరు దమువంటిది. 'తేంకణాదిత్యుఁడు'నునదికూడ బిరుదే. ఈబిరుదు కమ్మ నాటిని పరిపాలించిన 'కొణిదెన' చోళులకుఁగలదు. తేంకణ మనునది అనంతపురముజిల్లాలోని తాడిపత్రి పరిసరప్రాంతము.

"మేరు మహామహీధరద తెంకణభారతవర్షదొళు మనో హారియిదెంబిన నొళ్పకుంతళదేశదపూర్వ్వభాగదొళు సారిమెప్పు (?) దంధ్రధరణీతళ వందదఱెందె తెంకణా ధారిణియల్లి పెన్నపరినాడు నిరంతరబప్పితోఱుగుం.
ఆజనపదక్కె తలెసలె
రాజాశ్రయమెనిసి తాళిపాఱుపురం వి
భ్రాజిసుగు వమరపన్నగ
రాజపెరక్కెణెయొనిప్ప మహిమోన్నతియిం."

[South Indian Inscriptions Vol IV—798 కన్నడశాసనము.]

చేంకణాదిత్యులను చూతము.—కొణిదెన శంకరేశ్వరస్వామి యాలయమునం దొకఱాతి స్తంభముమీఁది శాసనమున నొక పొత్తపి త్రిభువనమల్లచోళునకు చేంకణాత్యుఁడను బిరుదముకలదు. శక 1064, క్రీ. శ. 1142 [S. I. I. Vol VI—628; శాసనపద్యమంజరి 17]

తరువోజ. "శరధిగట్టించి రాక్షసుని జయించి
... ...
పొత్తపికామభూపతికి...
త్రిభువనమల్ల పార్థివో త్తముఁడు.

తరువోజ. "జలనిధి రస వియ త్ప్రశిసంఖ్యదనర
... ... నాదిత్యవంశ
తిలకుండు చేంకణాదిత్యుండూర్జితుండు
త్రిభువనమల్ల ధాత్రీనాథుఁ డుర్వీ."

[జలనిధిరసవియత్ప్రశిసంఖ్యయనఁగా, శకవర్షములు 1064. దీనికి 78 సంఖ్య చేర్చిన క్రీ. శ. 1142 వచ్చును. జలనిధి అనఁగా చతుస్సాగరములు = 4, రస, అనగా షడ్రసములు = 6, వియత్ అనఁగా ఆకాశము=0, శశి అనఁగా జంద్రుఁడు = 1. వరుసత్రిప్పి చదువుకొనవలయును. 4601 త్రిప్పిన 1064. శాసనములలోని అక్షరసాంఖ్యము ఇట్లుండును]

వెంకయచోడమహారాజునకు చెంకణాదిత్యబిరుదము కలదు. (దొంగలసానిశాసనము.)

ఓపిలిసిద్ధనదేవచోడమహారాజు కాకతిగణపతియాజ్ఞచేకమ్మనాటిని ఆఱువేలదేశమును జయించిపరిపాలించినవాఁడు తనరాజధాని కొణిదెన (కొట్యదొన్న)లో శంకరేశ్వరస్వామియాలయములో కాకతి గణపతిదేవ రకు 'ధర్మవుగా' దానములుచేయించి వేయించిన శాసనమున తాను చేంకణచక్రవర్తినని ప్రాయించుకొన్నాఁడు.

'ఓపిలిసిద్ధివల్లభు జయోన్నతుఁ డేంకణచక్రవర్తి నా
జ్ఞాపరిరక్షితాఖిలదిశావలయుఁ ఘను దానకర్ణ లీ

లాపరిపూర్ణరమ్యశుభలక్షణమూర్తి జయంతు నన్నెచో
డాపురుషాతుఁ బేరుకొనఁగాఁజను జోడకులైకభూషణుఁ'

వచనభాగమందు మామూలు తెలుఁగుచోళబిరుదావళి 'స్వస్తిచరణ సరోరుహావిహతవిలోచన.....తేంకణాదిత్య జగన్నొబ్బగండ...'కలదు. [S. I. I. Vol VI—628; శా. ప. మంజరి 58]

తేంకణాదిత్యులు తేంకణమునువదలి ఇతరప్రదేశములకు పోయినను కవులకు తేంకణముమీఁది యభిమానము పోలేదనుటకు నాచన సోమనాథుఁడు సాక్షి. ఉత్తరహరివంశములో, పంచమాశ్వాసమున, చిత్రరేఖ, ఉషకు కలలో కనఁబడిన మనోహరుని చిత్రపటమున వ్రాయు సందర్భమున - 'భూమండలంబవలోకించి భరతఖండంబున' - రాజకుమారులను వెదకిన దేశముల జాపితాలో తేంకణమున్నది—

సీ. పాంచాల పాండ్య బర్బర కిరాతాభీర
కురు విదేహ విదర్భ కుకుర గౌళ
గాంధార మగధ కొంకణ కళింద పులింద
సింధు సౌవీ రాంధ్ర చేది చోళ
సాముద్ర సాల్వ కోసల కళింగ కుళింగ
వత్స సౌరా ష్ట్రాంగ వంగ మత్స్య
శూరసేన సుదేష్ణ సుహ్మ కాశ కరూశ
లాట కర్ణాట మాళవ వరాట
తే. కుంత లావంతి ఘూర్జర కుష్మాక త్రి
గర్త బహుధాన యవన తేంకణ దశార్ణ
పుండ్ర బాహ్లీక ద్రవిడ కాంభోజ హూణ
కేకయ వసాతి కాశీర కేరళములు.

ఇంచలి తేంకణము శ్రీకృష్ణులవారి నాటిదిగాదు. తప్పక నాచనసోమని కాలముదే. కడపమండలములో పెన్నకు సమీపమున పెంచుకలదిన్నె యనుగ్రామము నీతఁడు బుక్కరాయలవలన దానము గ్రహించినవాఁడు. 'పెన్నపరినాడు' తేంకణమని పైశాసనమున తేలినదిగదా. కవి తనదేశమునుకూడ చేర్చుకొన్నాఁడు గావలయు.

ఇట్లీబిరుదములు పోగా పాకనాటిని పాలించినవాడు, చేంకణా దిత్యుడు, చోడబల్లి శ్రీసత్తుల కుమారుడునైన నన్నెచోడుడు 'కవిరాజశిఖామణి' దొరకవలయును. కేవల నన్నిచోడనామధేయులు పలువురు కనబడుచున్నారు. తల్లిపేరులేదుగాని చోడబల్లికుమారుడొక నన్నిచోడదేవుడు పెదచెఱుకూరు శాసనమున కనబడుచున్నాడు. ఈశాసనమున తారీఖులేదుగాని కాకతీయగణపతిచక్రవర్తి ధర్మార్థము చేయబడినదగుటచే నాతని యవసానకాలమందో లేక గతించినతర్వాతనో చెక్కింపబడియుండును. దీనింగూర్చి పండితులివిపరకెంతో చర్చించి ఇందలి మొదటి నన్నిచోడుడు చోడబల్లికుమారుడు నన్నయభట్టునకు ఇంచుమించు నూఱేం డ్లీవలివాడు, అనగా క్రీ. శ. 1140 లేక 1150 ప్రాంతమువాడని నిశ్చయించుకొనిరి. కాని శ్రీసతిపేరిందుకానరాదు. పైగా అనంతర ప్రబంధలక్షణములతోడి యీకావ్యము ఇంత ప్రాచీనమైయుండదు గావునను శాసనములలో స్పష్టత బొత్తిగా లేకపోవుటచేతను శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు శాసనాధారములను దుర్బలములని త్యజించి భాషానిదర్శనములపై నాధారపడిరి. [చూ. కుమారసంభవవిమర్శ, మదరాసు విశ్వవిద్యాలయము వారిది.] దీనింగూర్చి శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు "...ఈతండుచెప్పిన తల్లిదండ్రుల పేళ్లతోడగూడిన యీతనిపేరుగల శాసన మొకటియుఁ గానవచ్చుటలేదు. తండ్రి కొడుకుల పేళ్లుమాత్రము సరిపోవుచున్న శాసనములు క్రీ. శ. 850 మొదలు 1210 వఱకుఁ గనబడుచుండుటచే శాసన నిదర్శనమునుఁ బట్టి నిర్ణయించుట సాధ్యముకాదని వదలివేయవలసివచ్చినది. ..... ఇట్లీకవికాలనిర్ణయమునకు నిష్కృష్టమగు శాసనాధారములు లేకపోవుటచే నాంతరంగిక నిదర్శనములనుబట్టి క్రీ. శ. 940 మొదలు క్రీ. శ. 1300 వరకుగల నడిమికాలమున నీతని యునికి యూహింపవలసివచ్చినది.' అని మదరాసు విశ్వవిద్యాలయ కుమారసంభవ ముద్రణపీఠికలో వ్రాసినారు.

ఇది యిట్లుండ - జంగమ మల్లికార్జునుని అరయుదము. ఈతని గుర్తించుట సాధ్యముగాక యున్నది. ఈయన 'సవ్వరిష్ఠఫలదుఁడు'

ఈతని కొలుపు అన్యకైవవితతుల కొలుపువంటిదికాదు. అవి 'తాడిడి' (తాటిచెట్టునాటి) (ఆతర్వాత ఎన్నఁడో) 'ఫలంబు పడయఁగనెడి.' మఱి మల్లికార్జునుని కొలుపన్ననో 'మొసరు మునుఁగఁ గొనుట' వంటిది. ఎంత భేదము! ఈయన తనపాదుకలను 'శ్రీపీఠమునం' దిడునంతటి మహత్తుఁడు. శ్రీచక్రమును త్రొక్కినవాఁడగునేమో! అట్టి యితఁడు నన్నె చోడదేవునికి గురువు. శిష్యుని సంకీర్తన—

'అమలజ్ఞానసుదీపవర్తిఁగొని, వృద్ధాచారుఁడై, వేదశా
స్త్రములందున్న సదర్థమెల్లఁగొని విద్వత్ప్రీతి గావించువా
ని, మహత్తుండనఁబొల్చు పుణ్యనిధి, వాణీముఖ్యు, సర్వజ్ఞు, జం
గమలింగంబగు మల్లికార్జును సదా కల్యాణుఁ గీర్తించెదన్.'

'అని...సమస్తదేవతాస్వరూపంబైన మదీయగురుచరణారవిందంబు లభినందించి' అని ప్రశంసించినాఁడు. అంతేకాదు, ఆ గురువు 'నిసర్గకవిస్థవనీయ సూక్తియుక్తుఁడు,' 'ప్రభువు.' ఆ 'ప్రభునాజ్ఞ పెంపున' తానీకృతిని 'ప్రతిష్ఠించు'చున్నాఁడు. తాను ఆ మహత్తుని కంకితమిచ్చుట ఎట్లున్నదనఁగా—

"శరధి నీరులు పయోధరములు కొనివచ్చి
కురిసి వారిధియందుఁ గూర్చినట్లు;
చేనఁబండినవిత్తు చేనిక ఫలకాంక్షఁ
బేర్చి గ్రమ్మర వెదవెట్టినట్లు;
రోహణాచలతి కూహించి వరరత్న
సంచయంబున విభూషించునట్లు;
తీర్థాళికరిఁద తీరోదకంబున
నెసకంబుగా నర్ఘ్యమిచ్చినట్లు;
నింగిముట్టియున్న జంగమమల్లయ్య
వరమునందుఁ గనిన వస్తుకవిత
దగిలి వారియంప నెగడింతు రవికి దీ
పమున నర్చలిచ్చు పగిదివోలె"

అట్టి గురువు ఇంకను ఎట్టివాఁడనఁగా 'అవిచలితాత్మయోగ ధరుఁడు,' 'పరమయోగీంద్రుఁడు,' 'షట్తర్కకర్కశుం డగుటం బరవాదిభయంక

రుండు,' 'పరమానంద హృదయుఁడు,' 'వైరాగ్యనిరతుం డగుట సమ్య
గ్జ్ఞానస్వరూపుండు' 'నిఖిలవిద్యాగురుండు' 'పరమస్వరూపుండు' 'పర
హంసస్వరూపుండు' '...బ్రహ్మస్వరూపుండు' 'సంగాసంగవిదూరుఁడు'
'శుభలక్షణలక్షితుఁడు' 'వినుతబ్రహ్మర్షి' 'సుందరాంగుఁడు' 'మారమద
ప్రహారుఁడు.' అన్నిటికిన్ వైఁగా

'భవమరణాంభఃప్రారిత
భవసాగర తరణసేతు పద్ధతిఁ జేతో
భవనిశితకుసుమబాణో
ద్భవరాగవిముక్తుఁ గమలభవకులతిలకున్.'

అని ప్రస్తుతిఁగన్న వాఁడు 'శృంగారభవారి' 'శమితవిషయుఁడు' 'కాంతా
సంయోగవియోగభోగసంత్యక్తుఁడు.' 'భూసురకులాగ్రణి.'

ఇట్టి గొప్పగురువు ఎప్పటివాఁడు?

మల్లి కార్జుననామధేయ శివయోగులు పలువురు. వారిలో మత
ప్రవక్తలు కొందఱు. 'ప్రాచీనులలోఁ బ్రఖ్యాతులగు మల్లి కార్జునులు
మూవురు గలరు. గృహస్థుఁడై...పండితారాధ్యు డొక్కఁడును,.....
శైవాచార గురుపరంపరలో యామ్యదిక్కలాధిపులలో వానప్రస్థా
శ్రమవర్తి యగు యోగి మల్లి కార్జునుఁ డనునతఁ డొక్కఁడు.' అని
మానవల్లి వారు నన్నిచోడకుమారసంభవ ద్వితీయభాగ ముద్రణావతా
రికలో వ్రాయుచు ఈయోగి 'చాలఁ బ్రాచీన గృహస్థుఁ డగుటచే మన
కాలమునకుఁ దగిలివచ్చువాఁడు కాఁడు' అని తెల్పిరి. మఱి 'తపోరాశి
శిష్యుఁడై చోళరాజులచేఁ బూజితుఁడై కాలాముఖమఠస్థాపనమున కాది
కారణమనఁబడిన మల్లి కార్జునమహాముని మూఁడవవాఁడు' అనియు వ్రాసిరి.

రెండవవానిని వారే త్యజించినారు. పండితారాధ్యుఁ డగునా
యనిన ఆతఁడు బ్రహ్మచారికానందున అతనినికూడ వదలవలసినదే. శ్రీ
నిడుదవోలు వేంకటరావుగారు వావిళ్ల వారి న. చో. కుమార., ద్వితీయ
ముద్రణ పీఠికయందు ఈకవి పండితారాధ్యుని శిష్యుఁడుగా నుంపనని
తలంచి వ్రాసినప్పుడు ఈవిషయమును మఱచిపోయినారు. కవియొక్క
వర్ణనలకు పండితారాధ్యుఁడు ఎంతమాత్రము కుదురఁడు, బ్రహ్మచారి

కాఁడు. మానవల్లి వారు ప్రాసినట్లు "కాలాముఖ మహాచార్యులెల్లరు బ్రహ్మచారులు.....కావునఁ గృతిపతి మల్లికార్జునుఁడు కాలాముఖ మతస్థాపకుఁడే యని నా యభిప్రాయము. పండితారాధ్యచరిత్రమున నతని సమస్త శిష్యకోటులలో నన్నెచోళుఁడు రాఁడయ్యె. పాల్కురికి సోముఁడు పండితమల్లయ్య యనియే సవిశేషణముగా చెప్పుచుండును. నన్నెచోళుఁ డెక్కడను మల్లికార్జునునకుఁ బండితశబ్దమును జేర్చిన వాఁడుకాఁడు. పాల్కురికి సోముఁడు పండితారాధ్యునిఁగూర్చి పుత్ర పౌత్ర సంతతి కలవాఁడని వర్ణించెను. బిక్కనవోలి కామినేని యెల్లారెడ్డి కంకితమియఁబడిన బ్రహ్మోత్తరఖండమునఁ గృతికర్త గురుపు లింగనారాధ్యుఁడు పండితారాధ్యుని పుత్ర పౌత్ర సంతతిలోనివాఁ డైనట్లు చెప్పఁబడియె. ఇట్టి కారణములు పెక్కు లూహింపఁగాఁ గృతిపతియగు మల్లికార్జునుఁడు భృంగి యవతారమగు పండితారాధ్యుఁడు కాఁడనియు, శ్రీశైలప్రాంతమునఁ దపస్సుచేయుచు నలంపురమున మఠము కట్టుకొని శైవమతమును నెలకొల్పుచుండినవాఁడనియు తోఁపకమానదు." కృతిపతి కాలాముఖమతస్థాపకుఁడగు నతి ప్రాచినుఁడగుట సందేహమేగాని మిగిలినదంతయు సరిగానేయున్నది. శ్రీవేంకటరావుగారి యభిప్రాయము మాత్రము కుదురదు.

వీనింబట్టి శాసనాధారములచే నన్నెచోడుని గుర్తించుట ఎట్లు కుదురదో అట్లే కృతిపతియైన మల్లికార్జునమునినికూడ గుర్తించుట కష్టమే. అట్లుండియు కొందఱు ఈ క్రింది పద్యమునుండి కొంత సాధింప యత్నించిరి.

చ. 'గురువున కిష్టదైవమునకుం బతికిం గృతి చెప్పి పుణ్యము
వరమును దేజముం బడయవచ్చు జగంబుల నిశ్చయంబు, మ
ద్గురువును నిష్టదైవమును గూర్చనిజేశుఁడు దాన, నాకుఁ గా
కొరనకు నిట్లు సేకుఱుగె యొక్కట లాభము లెన్నియన్నియున్.'

గురువు జంగమ మల్లికార్జునయోగియనియు ఇష్టదైవము శ్రీశైలము నందలి స్వామియనియు ప్రభువు శ్రీగిరిప్రాంతమందలి మల్లపరాజు అనఁగా పశ్చిమ చాళుక్య చక్రవర్తియైన త్రైలోక్యమల్లాహవమల్లభూపాలుఁ

డనియు శ్రీదేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు పైపద్యముచేతను బంధ కవిత్వ చిత్రకవిత్వాదులనుబట్టియు కొన్ని పద్యములయందలి అక్షర సాంఖ్యాది గణితముచేతను తారీఖులూహించి నిర్ణయింపఁ బ్రయత్నించి నారు. వీరు చాలవఱకు నూతనమార్గమునుత్రొక్కి చిత్రకవిత్వ బంధకవి త్వాది విశేషములను వెలికి లాగిరిగాని ఒక్కటి దీనిని బాధించుచున్నది. 'మద్గురువును నిష్టదైవమును గూర్చు నిజేశుఁడుఁ దాన, నాకుఁగా కొరు నకు నిట్లు సేకుఱునె యొక్కటి లాభము లెన్నియన్నియుఁ' అనుటలో మువ్వురను ఒక్కరే అని అర్థమగుచున్నదేగాని మువ్వురు ప్రత్యేక వ్యక్తులని అర్థమగుటలేదు. మువ్వురను మల్లనామకులనియుఁ గాదు. అతఁడే గురువు, అతఁడే ఇష్టదైవము, అతఁడే పతి. కాఁబట్టి అక్షర సాంఖ్యగణనముచేత త్రిలోక్యమల్లునికాలము లెక్కకు కుదిరినను పదార్థ ము వేఱుగానుండుటచే కవియభిప్రాయముప్రకారము అది తారీఖు గాక పట్టి ఘుణాక్షరన్యాయమున నొకసంఖ్య లబ్ధమైనదేమో! శ్రీ రెడ్డి గారివలెనే పలువుర పదార్థ మూహించియుండిరిగాని ఇది వారికి తోఁచలేదని నాభావము. పైఁగా ఈతఁ డర్వాచీనకవి యనుటకు ప్రబల నిదర్శనము లుండుటచేతకూడ ఈతారీఖు ఏర్పడదు. శ్రీ రెడ్డిగారన్న ట్లీయోగి సమకాలికశైవాచార్యుఁడేగాని ఈతనింగూర్చి ఏమియు తెలియవచ్చుటలేదు.

ఈ విమర్శను నేను రచించినతర్వాత, ఇటీవల, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో పైపద్యముంగూర్చిన నాభావమునే దృఢముచేయుచు శ్రీ బండారు తమ్మయ్యగారు పైపదార్థమును గుఱించియు శైవసాంప్ర దాయమునుగుఱించియు, 'నన్నెచోడుని గురుస్తుతి తత్త్వము' అని యొకవ్యాసము ప్రాసియున్నారు. [సంపు. ౪౬, ౪౭, సంచిక. ౬, ౧.] 'ఇట్టి దైవము విద్యాగురుఁడు, ఆధ్యాత్మికగురుఁడు, సత్ప్రభుఁడు, కూర్చునిజేశుఁడు సమస్తము నాతనికిఁ గృతిపతియగు జంగమ మల్లి కార్జునుఁడే.'

మఱి యీకవి కాలనిర్ణయమున కేమిమార్గము? ఈతనిగ్రంథ మే.

అ - ప్ర క ర ణ ము

కాలనిర్ణయ సాధనములు

'కావ్యమందు చరిత్ర తెలుపు భాగములు.....యేవియుఁ గుద
రనినాఁడు కావ్యమునకు మూలమగు గ్రంథము, కవిప్రయోగించిన
భాషారీతి, ఛందోవ్యాకరణాది విశేషములు, ఇతరకవిగృహీత పద్య
భాగభావాదులునుఁ జక్కఁగాఁ బరిశీలించి కవికాల సమున్నయనము
గావింపవలెను.' అని శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు కావ్యవిమర్శకుం
గడంగినారు. [చూ. కుమారసంభవ విమర్శ, పు. 11]

'భాషాతత్త్వవేత్త లిద్దరుతప్ప, తక్కిన చారిత్రకులందరు పెద
చెఱుకూరు శిలాశాసనకవివంశముతో కవికాలమును నిర్ణయించుట కంగీ
కరించియున్నారు' అనియు, 'ఆంధ్రభాషాపరిణామనిదర్శన సమకాలముతో
నన్నిచోడకవికాలము క్రీ. శ. 940 ప్రాంతమని కుమారసంభవ పీఠికలో
శ్రీరామకృష్ణకవిగారును, క్రీ. శ. 1300-'25 ప్రాంతమని కుమారసంభవ
విమర్శలో శ్రీలక్ష్మీపతిశాస్త్రిగారును భిన్నాభిప్రాయముల ప్రకటించి
యున్నారు. పెదచెఱుకూరు శిలాశాసనములో కావ్యకర్త నన్నిచోడుని
తల్లిపేరుగాని, కవిరాజశిఖామణి బిరుదుగాని, గురువు శ్రీజంగమ మల్లి
కార్జునయోగి పేరుగాని లేదని భాషాతత్త్వనిదర్శనకాలవేత్త లాక్షే
పించుట చిత్రము' అని శ్రీదేవరపల్లి వేంకటకృష్ణారెడ్డిగారు వ్రాసినారు.
[నన్నిచోడకవిచరిత్ర. పు. 14]

శాసనాది చారిత్రకాధారములు గట్టి పట్టియనప్పుడు భాషా
తత్త్వనిదర్శనమేగదా ప్రమాణము కాలయును. పెదచెఱుకూరు శాసన
ములో నన్నెచోడ చోడబల్లి నామములును కరికాలాది వంశనామాదిక
లుండినంతమాత్రమున కుదిరిపోయినదా? శ్రీసతిపేరు లేకపోవుట యొక
కొఱతయేగదా. ఆ కవిరాజు అంతగొప్పగా చెప్పుకొన్న ఆతల్లిపేరేల

లోపింపవలయును? పైగా దీనిని సమర్థించుటకు ఉదాహృతమైన నన్నూరుపాడు శాసనములోకూడ శ్రీసతిపేరుగాని కావ్యకర్తృత్వ ప్రశంసగాని కానరాదు గదా? అంతటిరాజు అంతగొప్పకావ్యకర్తయై యుండ దానిని తద్వంశస్థులు ఏల దాచిపెట్టుట? శాసనములు ప్రశస్తి కొఱకునుం గదా. కాబట్టి మనకు భాషాపరిణామమును కావ్యరచనా విధానాదివిమర్శయు ఆవశ్యకములైనవి.

అట్టి ప్రయత్నము చేసినవారిలో శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు ప్రథములు. వీరు గ్రహించిన నిదర్శనములు—

(1) మూలము—నన్నిచోడ కుమారసంభవమునకుఁ గాళిదాసుని దభట కుమారసంభవములు మూలగ్రంథప్రాయములు ఇంక నెన్నో పద్యములు సంస్కృత కన్నడ కాంధ్రగ్రంథములలోని పద్యముల భావముతో సాదృశ్యము గలవి కనఁబడుచున్నవి.—ఎవ రెవరిని అనుకరించిరో గాని సాదృశ్యములుమాత్ర మున్నవి.

(2) రచనావిధానము—ఆశ్వాసాంతచందస్సు, షష్ట్యంతరచన, రసాదులు, సాంఘికవిషయములు, కవిత్వఫక్కి, దేశిమార్గములు, జాను తెనుఁగు, పదపరికరము మొదలైనవి.

వీనినెల్ల పరిశీలించి వారు 'నన్నిచోడుఁడు తిక్కనకు తర్వాతివాఁడని నాకుఁ దోఁచినది.' అని తమ నిర్ణయమును ప్రకటించినారు. దీనిపై శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు [మదరాసు విశ్వవిద్యాలయము వారి ప్రచురణలో] ఇట్లు వ్రాసినారు. '..... అనేకవిధములగు పోలికలు ఇతరకవులతో సమానముగఁ గనఁబడుచుండఁగా, వారు చూపిన పోలికలైనను చోళుని రచననే వా రనుకరించి యుండఁగూడదా యను సందేహమును నిశ్శేషముగాఁ దీర్చునవి కాకపోవుటచే, తిక్కన తర్వాతివాఁడను నర్వాచీనవాదము నంతఁగా మనము పాటింపవలసిన యావశ్యకత కనఁబడదు.'

కాని యిట్లు త్రోసిపుచ్చరాదు. వీరి రచనలో పొందిక లేకపోవుట చేతనో, ఇంకను తఱుచి చెప్పవలసిన విషయములను వాఙ్మయచరిత్ర

దృష్టితో సాధించి, కావ్యనిర్మాణరీతింబట్టి సమర్థించి చెప్పకపోవుట చేతనో, పండితులును విమర్శకులును వీరి మార్గమును సిద్ధాంతమును అంగీకరింపక నన్నిచోడుని నన్నయకుముందు నెట్టుటకు సందేహించుచు, తిక్కనకు వెనుక నెట్టుటకు వెనుకాడుచు చదరంగములోని కాయలవలె మరల మరల మొదటికే వచ్చుచున్నారు.

శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు నన్నిచోడుఁడు ప్రతిపాదించిన కవితాసంప్రదాయముల నీ క్రిందిశీర్షికల విభజించి తమ యభిప్రాయమును తెలిపినారు. [వావిళ్ల వారిప్రతి, ద్వితీయముద్రణము.]

(1) ప్రబంధషక్కి—అష్టాదశవర్ణనలు

(2) కృత్యాది—షష్ట్యంతరచన

(3) దేశిమార్గకవితాపద్ధతులు—జానుతెనుఁగు.

'ప్రబంధషక్కి కితఁడే మార్గదర్శకుఁ డగుటవలన నీతనిపద్ధతులు తరువాతివా రనుసరించిరి,' అనియు 'దేశిమార్గపద్ధతులను దేశీయములుగా నొనర్చి, మహాకావ్యలక్షణములను దెలిపి, యాంధ్రవాఙ్మయమున ప్రత్యేకవిశిష్టతఁ బడసిన ప్రబంధవాఙ్మయమునకు శ్రీకారము చుట్టిన కవిరాజశిఖామణి నన్నెచోడకవి' అనియు స్పష్టీకరించినారు. అట్లుండియు తిక్కనకు ముందువాఁ డనియే కాలనిర్ణయ మొనరించినారు.

ఈవాదము సమంజసముగా నుండలేదు. నన్నెచోడుని కాలము తెలియనందున ఇతని నితరు లనుకరించిరని ఎట్లు చెప్పఁగలము? ఈతఁడు కవితచే ఎక్కడికి, ఏశతాబ్దమునకు సరిపడునో చూచుకొనిగదా తర్వాత అనుకరణాదులనుగూర్చి మాటలాడుట. అతని పేరైనను ఎవఁడును స్మరింపనందునను, ఒక్క అథర్వణుఁడు మాత్రము వేంకణాదిత్యుఁడని యనినందుచేతను, కవిత్రయమువారివలె ఈతనికి ప్రామాణికపదవి రానందునను, తర్వాతి లక్షణకారులుకూడ ఉదాహరింపనందునను, అనంతర ప్రబంధముల లక్షణములైన అష్టాదశవర్ణనాదు లుండుటచేతను కవిత్రయమునకు తర్వాతివాఁడా లేక 'కవిద్వయము'నకు తర్వాతివాఁడా యనుశంక కలుగకమానదు.

ఈచర్చలచే నొకటి స్పష్టము-కుమారసంభవము ప్రబంధశైలికి చెందినదనుట. కవియే యిట్లన్నాడు—

'వన జలకేళీ రవి శశి
తనయోదయ మంత్ర గతి రత క్షితిప రణాం
బునిధి మధు ఋతు పు రోద్వా
హ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున.'

అనియు, 'పరిపూర్ణంబై దశప్రాణంబుల సప్రాణంబై నవరసభావభరితంబై షట్త్రింశ దలంకారాలంకృతంబై రమణీయంబైన దివ్యకథారంభంబున కభిముఖుండనై' అనియు, 'సకలావయవంబులఁ బరిపూర్ణంబైన దివ్య కావ్యాంగనా సృష్టికర్తయైన.....' ఇట్లు తనది పరిపూర్ణ కావ్యమని పదేపదే పలుకుచు, సప్తసంతానములను పేర్కొనుచున్నాఁడు. అందును ఉత్కృష్టసంతానము కృతియట—

'పూని మహోగ్రహారపుర, పుత్రసమున్నతి దేవతాల యో
దాన్న తటాక సత్కృతి నిధానము లాశశితారకంబు సు
స్థానములై మహింబరఁగు జంగమమల్లయవేర సప్త సం
తానము లొప్పసల్పుదు ముదంబునఁ దత్ప్రభునాజ్ఞ పెంపునన్.
అందు నుత్కృష్ట సంతానంబు కృతియకా నిశ్చయించి'

ఇట్లు సప్తసంతానములను పేర్కొన్నవాఁడు ఇంతప్రాచీనుఁడుగా తలంపఁబడువాఁడు మఱియొకఁడు కానరాఁడు. కేయూరబాహుచరిత కావ్యకర్త సప్తసంతానములను పేర్కొనుచున్నాఁడుగాని ఆతఁడు తిక్కనకు తర్వాతివాఁడుగదా. ఈవిధముగా నష్టాదశవర్ణనలతోడి పరిపూర్ణ ప్రబంధముగా తన కావ్యమును పేర్కొని, సప్తసంతానములలో కావ్యమే ఉత్కృష్టమైనదని, షష్ట్యంతాది రచనలుగావించి, ఇష్టదేవతా స్తుతిలో బహుదేవతలనుస్తుతించి, పూర్వకవిస్తుతి, ఆధునిక కవిస్తుతు లొనరించి, కుకవినింద గావించి, కృతికన్యను ఇంత సుదీర్ఘ కృత్యాద్యవస్థా ప్రారంభాడంబరముతో అంకితమొసంగిన ప్రాచీనకవి యెవ్వఁడును కానరాఁడు. ఈతని కృతిసమర్పణవిధానమును—అనఁగా కృత్యాద్యవస్థను పరిశీలించుట యుక్తము.

3. ప్రకరణము

నన్నెచోడుని పీఠిక

శ్రీకారముతోను సర్గరావృత్తముతోను కృతి ప్రారంభమగును.

1. ఇష్టదేవతాస్తుతి—	శివుఁడు.	పద్యములు	3
	విష్ణువు	,,	1
	బ్రహ్మ	,,	1
	రవి	,,	1
	గణపతి	,,	1
	షణ్ముఖుఁడు	,,	1
	మన్మథుఁడు	,,	1
	పార్వతి	,,	1
	భారతి	,,	1
2. గురుస్తుతి—జంగమ మల్లికార్జునుఁడు		,,	3
3. పురాణకవిసంఘస్తుతి—	వాల్మీకి	,,	1
	వ్యాసుఁడు	,,	1
4. మార్గకవిస్తుతి—	కాళిదాసుఁడు	,,	1
	భారవి	,,	1
	ఉద్భటుఁడు	,,	1
	బాణుఁడు	,,	1

5. దేశికత్వపులస్తుతి—చాళుక్యరాజు మొదలగువారు1 ఇట్లు చేయుచు అక్కడికక్కడికి, మరల, చేసినవానిని సంగ్రహముగా నొక పద్యమున వచించినాఁడు. చూడుఁడు—

'సురవరులం గ్రమంబున వచోమణి సంహతిఁ బూజసేసి, మ
ద్గురు చరణారవిందములకుం దగ సమ్మతిఁ జేసికొల్చి, వి
స్తరమతులం బురాణకవి సంఘము నుత్తమమార్గ సత్కవీ
శ్వరులను దేశికత్వపుల సంస్తుతిఁజేసి మనోముదంబునన్.'

ఇంతవఱకు ఇరువదియొక్క పద్యములలో వర్ణించినదాని సంగ్రహపునఃకథన మిది. తర్వాత

6.	విబుధవర్ణమును తలఁచుట—	పద్యము	1
7.	కుకవి నిరసనము	,,	4
8.	కృతిప్రతిష్ఠాప్రారంభము	,,	1
9.	జానుతెనుఁగు, దేశి, మార్గములు; తన కవితావైదర్భము	,,	2
10.	కృతి 'రత్నపుత్రిక' వంటిది	,,	1
11.	కృతి అక్కజమై...యుండవలయును ('ప్రతిపద్యము చోద్యముగా'-వలె)—	,,	5
12.	అష్టాదశవర్ణనలు - ఒక వచనముకూడ	,,	1
13.	సప్తసంతానములు—	,,	1
14.	కవిసంకల్పము-గురుప్రసాదము-వస్తుకవిత	,,	2
15.	తన ప్రత్యేకభాగ్యము - గురువు+దైవము+పతి, మువ్వురును ఒక్కరే తనకు	,,	1
16.	కవివంశౌదికము	,,	4
17.	కృతిసమర్పణము - ఒకవచనముకూడ	,,	1
18.	షష్ట్యంతకందపద్యములు	,,	8
19.	కథాప్రారంభము - ఒక వచనమున.		

దీనిని చూడఁగా తిక్కనలో కానరానిపద్ధతి యిదియని స్పష్టమగుచున్నది. తిక్కన తన కవితాకన్యను తనరాజునకు అంకితమిచ్చెనుగదా, మఱి యాతని పీఠిక వేఱుతీరున నున్నదే యన్న, విమర్శకులు - అందుచేతనే నన్నిచోడుఁడు పూర్వుఁడు, తనకు తోలుత తెలియని షష్ట్యంతాదిరచనను ఆ కవిబ్రహ్మ -ఈ కవిరాజశిఖామణి గ్రంథమును చూచి గ్రహించి యుండును - అని యూహించినారు. అట్లు గ్రహించినవాఁడు నిర్వచనోత్తరరామాయణము నాటికి గ్రహింపక భారతము నాటికి గ్రహించెనా? ఇట్లు బాధపడుటకన్న ఆంధ్రవాఙ్మయమందు కృతిసమర్పణసంప్రదాయమును దాని చరిత్రమును మొదట గ్రహించుట యుక్తముగదా.

౪-ప్రకరణము.

అంకితమువేయు పద్ధతి—దానిచరిత్ర—షష్ట్యంతములు

నన్నయభట్టు మహాభారతమున అంకితమను మాటను వాడలేదు సరిగదా తనగ్రంథమును ఆమహారాజునకు, రాజరాజనరేంద్రునకు, అంకితముకూడ నీయలేదని పండితులు గ్రహించియేయున్నారు. రాజరాజనరేంద్రుడు తనపూర్వుల చరిత్రను, భారతకథను, వినిపింపుమని కోరెనేగాని అంకితమిమ్మని కోరలేదు. అట్లే కవియు వ్రాసి వినిపించినాడు. 'తన కులబ్రాహ్మణుడును అనురక్తుడును' నైనవాడు రాజుకోర్కె 'తు' 'చ'లు తప్పక చేయును. అంకితమిచ్చు నాచారము, షష్ట్యంతాది రచనయు, ప్రభువంశవర్ణనచేయు సంప్రదాయము నుండియుండిన ఇంతటి 'అనురక్తుడు' వదలియుండునా? కావున నాటి సంప్రదాయమునే యను సరించి నన్నయ తనప్రభువంశాదికములఁగూర్చి వ్రాయక, ప్రభువును శ్రోతగా, ప్రధానశ్రోతగా, గ్రహించి అట్లే సంబోధించి 'మహాభారత సంహితారచనబంధురుఁడయ్యె జగద్ధితంబుగాఁ.'

భాస్కరరామాయణము విషయమొకసమస్య. భారతమువలె ఆశ్వాసాంతసంబోధనలున్నను అంకితముగా కనఁబడదు. ప్రభువులు శ్రోతలుమాత్రమే. పైగా ఈభాస్కరుఁ డెవఁడో కుదురలేదు. గ్రంథమును ఆదిలో కవిపెట్టిన రూపమునలేదుగదా.

శివకవులైన మల్లికార్జునపండితారాధ్య పాలకుఱికి సోమనాథాదుల రచనల తీరువేఱు. శివకవులంగూర్చి చక్కని పరిశోధన కవకాశమున్నది. మల్లికార్జునపండితుఁడు ప్రాచీనుఁడు. క్రీ. శ. 1150-80 ల నడిమికి, బసవేశ్వరుని సమకాలికుఁడుగాన, ఈతనికాలము కుదురుచున్నది. ఇతనిది శివతత్త్వసారము, మతగ్రంథము; ఎవరికిని అంకితముగాదు.

పాల్కురికి సోమన్న చాలతర్వాతివాడు; ప్రతాపరుద్రచక్రవర్తికి సమకాలికుడు. క్రీ. శ. 1323-48 కి ఇతనికాలము కుదురుచున్నది. ఇతనియందొకవిశేషము. అంకితమున్నదిగాని అంకితమొకరికి శ్రోతత్వ మొకరికి. కారణము భక్తియే. బసవపురాణమందు అంకితమే లేదు. పండితారాధ్య చరిత్ర బసవేశ్వరున కంకితము. దీనికి ఇతని మఱదియైన పాల్కురికి సూరనామాత్యుడే శ్రోత. గ్రంథము చారిత్రకముగా తిక్కనకు చాలతర్వాతిది. ద్విపద. షష్ట్యంతాదులు లేవు.

"శివభక్తతతియాజ్ఞ శిరమునదాల్చి
శివకవుల్ హర్షింప జెప్పుదు కవిత"
"శ్రోతత్వమునకు పాత్రుండ వీవనియు
... ...
దీవించి నిన్ను సంభావించి శ్రోత
గావింతు సచివాగ్రగణ్య సూరార్య.
తత్కథా విషయవైదగ్ధ్య మెట్లనిన
బసవలింగము కృతిపతియఁట గృతియు
రసికత బండితారాధ్య చరిత్ర
యఁట పాల్కురికి సోమనార్యుడు సుకవి
యఁట కథాశ్రోత సూరామాత్యుడఁట
కృతిపతి కృతికవి కృతికథాశ్రోత
ఋతిజెప్ప నొప్పదేశివభక్తి సభల."

ప్రకరణముల చివర—

"పండితారాధ్య ప్రబంధశృంగార
... ...
సూర కవీంద్ర మందార శుభప్ర
కారవినుమి దీపూ ప్రకరణము.
ఇది ... పాలకురికి సోమనాథ
సుకవిప్రణీతభాసురతరధండ

నాయక బసవాంకనఖ్యాత గుణగ
ణాయతకీర్తి దిగంత త్రిలోక
గురుపండితారాధ్యచరితంబునందు"

ఇది ఆముక్తమాల్యదాశ్వాసాంతములవలె నున్నది.

మరల వెనుకకు పోవుదము—తిక్కనకాలమునకు కావ్యకన్యను తగిన వరునికిచ్చుట యను సంప్రదాయము వచ్చినట్లు కనఁబడుచున్నది. 'కవితావిలాసవిస్తరమహనీయుఁడైన' తిక్కనను 'సర్వగుణోత్తరమూర్తి మన్మభూవరుఁడు దగంగ రాఁబనిచి వారని మన్నన నాదరించుచు'

" 'పనిన్ను మామయనియెడు
దీనికిఁ దగనిమ్ము భారతీకన్యక, నా
కీనర్ఘ్యుఁడనగు' దనినను
భూనాయకుపల్కు చిత్తమున కింపగుఁడుక."

కవి 'మత్కృతీశ్వరుఁ డగుచున్న మనుమన్మపతి సుభగు గావించుటకు సముత్సుకుఁ' డాయెను. తర్వాత తన కవిత్వనియమాదుల నుగ్గడించి,

'ఈకృతికిఁ దొడవుగా మద
నాకృతియగు మనుమనరవరాగ్రేసరు స
త్కావ్యకృతి వంశము గాఢ
స్వీకృతి దగఁ గీర్తనంబు సేయుదునెలమిన్."

అని ప్రారంభించి, కృతిపతివంశాదికమును మనుమసిద్ధివఱకు వర్ణించి, కథా ప్రారంభము సేయుచోట,

'అమ్మనుమన్మపతి కభ్యుద
యమ్మ్మగ నేఁ జెప్పఁబూని నట్టి కథకు నా
దృష్యయి యయోధ్యయను నా
మమ్మ్మున నెగడిన పురోత్తమము వర్ణింతున్"

అని కథప్రారంభించినాఁడేగాని ఒక షష్ట్యంతపదమ్మైనను వ్రాయలేదు.

కాని భారతరచననాటికి షష్ట్యంతములు స్ఫురించినవి. హరిహర నాథుఁడు స్వప్నమున భారతమునకు 'కృతిపతిత్వమర్థించి' వచ్చెను.

మానవులకే కృతినభ్యర్థించు చాపలముండినదిగాని, మనయాంధ్రకృతుల మహిమ త్రిలోకప్రసిద్ధమై, దేవతలే, మనుమన్యపతివలె, తామే ప్రయత్న పూర్వకముగా కృతులందుకొన ప్రారంభించుకాలము తిక్కనకాలముగా కనఁబడుచున్నది. హరిహరనాథదేవునికి కలిగిన ఈచాపలము పూర్వము రాజరాజనరేంద్రునికి లేకపోయినదిగదా. కాలమహిమ! తిక్కనయు 'భారతమపారకృపాపరతంత్రవృత్తిమై బేర్చిన దేవదేవునకుఁ బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి' యని 'పూని' 'ఈదృశంబులగు పుణ్యప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధన విశేషంబగుటంజేసి' ఐదు షష్ట్యంతకందపద్యములతో ప్రారంభించి 'ఏను విన్నపంబు సేయు తెఱంగుగా నంతస్సన్నిధిం గలిగించుకొని యమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబుసేసెద' అని, తర్వాత మూఁడు కందపద్యములతో హరిహరనాథుని సంబోధించి కథారచన కుపక్రమించెను. మహాకావ్యమని పేరొక్కనినను మరల నీభారతమును ప్రబంధమండలి యని పేరొక్కనెను.

ఈయనకు సమకాలికుఁడైన కేతనయు షష్ట్యంతరచన గావించినాఁడు. సరిగానేయున్నది. సమకాలికు లొకరినిచూచి యొకరు నేర్చుకొందురుగదా. కేతన దశకుమారచరిత్రము తిక్కనకే యంకితము. ఈయన అంకిత షష్ట్యంతపద్యములు పదునొకండు వ్రాసినాఁడు. తిక్కన యైదుపద్యములు పదునొకండుగా పెరిగినవనుట సమంజసముగానే గన్పట్టునుగదా. కాని కేతనలో నొకవిశేషము. మొదటి ఎనిమిది షష్ట్యంతములు కందములు, తర్వాత నొకశార్దూలము, మరల నొక కందము, ఆవెనుక మాలినీవృత్తము. అంతటితో, అనఁగా పదునొకండు షష్ట్యంతములతో ప్రథమాశ్వాసము ముగియును. పండ్రెండవపదిగాను ద్వితీయాశ్వాసాదిగాను, ఒక షష్ట్యంతకందపద్యము కథాకథనమున కుపక్రమణమునకుముందు కలదు. తర్వాతకూడ గ్రంథమధ్యమున కొన్ని యాశ్వాసాంతములలోను కొన్నిట ప్రారంభమునను కందము షష్ట్యంతము, సంబోధనగాదు.

మంచన తన కేయూరబాహుచరిత్రమున ఒక్క కందమే వ్రాసి తృప్తినందెను. మారన, తిక్కనశిష్యుఁడు, మార్కండేయపురాణమున మూఁడు కందములు వ్రాసెను. కొంత తర్వాతివాఁడైన కావ్యాలంకార చూడామణికారుఁడుకూడ మూఁడే వ్రాసెను. ఎఱ్ఱనయో హరివంశమున షష్ట్యంతములేవ్రాయక నృసింహపురాణమున పదునొకటి, అన్నియు కందములే, వ్రాసెను.

ఇచ్చట కేతనవిషయము విచారణీయము. అందఱును తిక్కన భారతములో చూపిన పద్ధతిని షష్ట్యంతములు వ్రాసియుండఁగా కేతన మాత్రము భిన్నమార్గము త్రొక్కనేల? కేతనకు తర్వాతివారెవరును షష్ట్యంతములతో ప్రథమాశ్వాసమును ముగింపలేదు; ప్రథమాశ్వాసాంత ద్వితీయాశ్వాసాదిగా వచ్చునట్లు షష్ట్యంతములను పగులఁగొట్టి ఒక కందపద్యమును రెండవయాశ్వాసమునకు తెచ్చుకొని వ్రాయను లేదు; ఇంతేకాదు షష్ట్యంతకందములనడుమ నొకదూలమువంటి షష్ట్యంత శార్దూలమును వేయనులేదు. ఆనంతరకవులెల్లను తిక్కనమార్గమునే యవలంబించి ప్రథమాశ్వాసమధ్యముననే షష్ట్యంతరచనచేసి, అంకితాదికము లొనర్చి కథ ప్రారంభించి కొంత చెప్పిన తర్వాతనే ద్వితీయాశ్వాసమునకు పోయినారు. కేతన యేల తిక్కనమార్గము నతిక్రమించెను? తిక్కనకే కృతియిచ్చుచు ఆ మహానుభావుని యభిమాన మపేక్షించు యువకుఁడు పెద్దయైన తిక్కనమార్గమునకు భిన్నమార్గము త్రొక్కునా? అది యొకవిధముగా అధిక్షేపముకూడ కాదా? ఇందులకేదో గొప్ప కారణ ముండవలయును.

మఱి యీషష్ట్యంతరచన కేదైన మఱియొక సంప్రదాయము కలదా యని చూచిన కేతనమార్గము కేతనదే; అట్లు వ్రాసిన మఱియొక కవి కానరాఁడు. తిక్కనకు ముందు లేఁడాయనిన కావ్యరచనలో లేఁడనియే చెప్పవలెను. కావ్యేతర, ఆనఁగా, శాసన, రచనలలో కొంత కనఁబడు చున్నది. క్రీ. శ. 1139 నాటి యొక నాదెళ్ల శాసనములో షష్ట్యంత

మున్నది. [S. I. I. Vol. IV - 672; శా. ప. మంజరి 15.] ఈశాసనమును శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు గుర్తించియున్నారు.

"వరశకవత్సరంబు లుడువల్లభ తర్కనభేందు సంఖ్యగా ...
...నాదిండ్లు అందు ప్రసిద్ధిగ శూలపాణికిన్.
క. వ్యాలేభ చర్మధారికి
మూలస్థానంబు నాదిమూర్తి శ్రీకా
పాలికి మృడునకు హరునకు
నీలగ్రీవునకు నీశునకు సుమపతికిన్.
క. స్థిరమతి గడియమదేవులు
దిరమై యుండ (o) గ నఖండదీపము నిలిపెన్."

నాదెళ్లయండే మఱియొక శాసనమున (S. I. I. Vol. IV—675. శా. ప. మంజరి 16) క్రీ. శ. 1140 నాటిదాన—

క. మేలగు నాదిండ్లం ద
స్థూలస్థానమున పుణ్యమూర్తికి భాస్వ
ద్భాలాక్షి వహ్నిదగ్ధ
వ్యాలాంగభవాంగునకు మహాదేవునకున్.
శా. ఇంద్రారాధ్యున కాదిదేవునకు బాలేందు.....
చంద్రార్కంబుగ దీపికన్నిలిపె సుత్సాహంబుతో...

ఇట్టివి అచ్చటచ్చట నున్నవి. వీనింగూర్చి "దేవతాకృతిపతిస్తోత్రాదులందు సందర్భమునుబట్టి ప్రథమా ద్వితీయా తృతీయా షష్ఠివిభక్త్యంతము లుండును. ఇవి దేవతాస్తోత్రనామావళివంటివి" అని వ్రాసి శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు అధోజ్ఞాపికలో "ఇట్టి విశేషణములను నామావళి యనియే యొకశాసనమున వాడినారు" అని క్రీ. శ. 1161 నాటి శరణయ శాసనమునుండి ఈ వాక్యము నుదాహరించిరి. 'వ. ఇట్టి శ్రీ గొంకరాజుల కిష్టభృత్యుడైన శరణయ నామావళి యొట్టిదనిన' అని తర్వాత తృతీ యాంతములుగల 'శ్రీవిలసద్విలాస' యను పద్యము నుదాహరించినారు.

ఇది సరికాదు. స్తోత్రనామావళులకును వీనికిని ఎట్టి సంబంధముకలదో గాని ఈశాసనమునమాత్రము 'నామావళి' యని చెప్పి ఆతని పెద్దల వంశావళిని శాసనకవి వర్ణించినాఁడు. ఈవిశేషణములకు కాదు ఇచ్చట నామావళియని పేరు, శరణయపెద్దల వంశావళికి నామావళి యనిపేరు. ఇది శాసనము చదివిన తెలియును. పద్యము—

'శ్రీవిలసద్విలాసజి (త) జిష్ణునిచే నహిసీమకృష్ణుచే
దేవసమానుచేత నరదేవశిఖామణి చేత ధాన్య వా
టీవర వృత్తిశాసన పటీయసి నాందగి మేలునాయక
శ్రీవిభుఁ డొవ్వఁ బోతయ వశీకృత సజ్జన లోకుఁడై భువిన్'

ఇట్లు పోతయతో ప్రారంభించి శరణయ వఱకు వర్ణించినాఁడు శాసనకవి. ఈ పద్యము శరణయ నామావళి యెట్లగును? కానేరదు. కాఁబట్టి ఈ విభక్త్యంతములకును నామావళులకును ఎట్టి సంబంధమును కానరాదు.

శ్రీలక్ష్మీపతిశాస్త్రిగారు తిక్కన షష్ఠ్యంతములను పైయూహతో కలిపి అదియు నామావళియని, అందులకు సమర్థనముగా 'నిది యొక యారాధన విశేష మను కారణము చెప్పుటచే నీరీతి తిక్కనోపజ్ఞ మని స్పష్టమగుచున్నది. ..... దేవతారాధన విషయముననే కాని, కేవలము మనుజుని స్తుతించుచోట నుపయోగించుట తిక్కనకు సమ్మతము కాదని తోఁచెడిని.' అని యొక సిద్ధాంతము నుపపాదించినారు. ఈ వ్రాతయంతయు నిలువదు దేవతారాధనాది నామావళి కాదు గదా ఆవ్రాత, 'దేవతలకు మాత్రమె షష్ఠ్యంతములు మానవులకు పనికిరావు' అనుటయు సరికాదు. తిక్కన యభిప్రాయమిట్లుండిన కేతనదశకుమారచరిత్రమున షష్ఠ్యంతపద్యరచన, తనపై అట్లు విశేషముగా జరిగినదానిని, అతఁ డెట్లు ఒప్పుకొనినాఁడు. పరోపదేశపాండిత్యమేగాని ఆసూత్రము తనకు వర్తింపదా? ఇదేదియుకాదు, అట్టి నియమమును లేదు. తిక్కన దేనిని ఆరాధనవిశేషమనె ననఁగా 'ఈదృశంబులగు పుణ్యప్రబంధంబులు' అనఁగా మహాభారతమువంటివి 'దేవసన్నిధిం బ్రశంసిం

చుట.' అంతేగాని షష్ట్యంతములనుగాదు. శాసనములలోని విభక్త్యంత ములు కాదాచిత్కములు, కవుల కల్పనలు అంకితాది కృతిసమర్పణ కార్యము అందులేదు. ఇది 'ఉదాహరణ' కవిత్వమునుకాదు. ఏదో తోచినది, కవులు వ్రాసి ఆనందించిరి, కవితాకల్పన. అంతమాత్ర మే.

షష్ట్యంతములకు ప్రారంభ మెచ్చటినుండి అను ప్రశ్నకు తిక్కనయే యను లక్ష్మీపతిశాస్త్రిగారి యభిప్రాయముకూడ సమంజసముగా నుండ లేదు. వారొకరేగాదు, పూర్వము కొంతకాలము మనపండితు లెల్లరును అట్లేభావించుచుండి నన్నెచోడుని గ్రంథము కనఁబడఁగానే అది చాల ప్రాచీనమనిభావించి తమ పూర్వాభిప్రాయములను మార్చుకొనిరి. అతఁడు ప్రాచీనుఁడు కాఁబట్టి తర్వాతివారు చేసిన షష్ట్యంతాదిరచనలను ఆతఁ డూహించి ముందే చేసినాఁడు అని చెప్పసాగిరి. శాస్త్రిగారు మరల మొద టికి పోయిరి. మంచిదేకాని ఈయభిప్రాయము నిలువదు. ఏలయన షష్ట్యంతరచన మొదటచేసినకవి కేతనగాని తిక్కనగాఁడు. అందుచేతనే కేతనయొక్క షష్ట్యంతరచన అంత భిన్నమార్గమున పడినది. ఇది యెట్లనఁగా, కేతన దశకుమారచరితయొక్క రచనాకాలమును గుర్తించిన తెలియును.

తిక్కన నిర్వచనోత్తరరామాయణమును రచించి భారతమును రచించులోపల దేశమందు చాలమార్పులు జరిగినవి. భారతరచనాకాల మునకు మనుమసిద్ధిలేఁడు; ముత్తుకూరికడ క్రీ. శ. 1261 లో పాండ్యుల తోడి రణరంగమున నిహతుఁడాయెను. మధుర సుందరపాండ్యుఁడు 'గండగోపాలు'ని ముదుకూరికడ చంపి, కాకతీయగణపతిని జయించి, తెలుఁగువారిని వారికి సాయమువచ్చిన ఆర్యులను (ఆరెలు = మహా రాష్ట్రులు) కృష్ణవఱకు (పేరారు) తఱిమి, అట్లే సాయమువచ్చిన బాణ రాజును అడవిలోనికి తఱిమి, నెల్లూరిలో వీరాభిషేకము చేసికొని కాంచీ పురమును స్వాధీనముచేసికొనినట్లు తమిళశాసనములు గలవు. [A R E 1914, ii - 18] మనుమసిద్ధికి గండగోపాలుఁ డని బిరుదు. ముదుకూరు నెల్లూరికి తూర్పున సముద్రతీరమందలి ముత్తుకూరే. సుందరపాండ్యుఁడు

'పిరగండగోపాలవిపినదావదహానుఁ' డనియు, తమిళములో **'கண்ட கோபாலனை விண்ணுலகிற் போக்கி'** (గండగోపాలుని ఊర్ధ్వలోకమునకు పంపి) అనియు శాసనములలో ప్రస్తుతింపఁబడియున్నాఁడు. కాంచీ రాజ్యము మనుమసిద్ధి ఏలుబడిలోనుండెను. (N. D. I. - III, పు - 1432' - 3) అట్టిది పోయినది. కాకతీయులే తఱుమఁబడిరి. నెల్లూరు కంచిరాజ్యములను పాండ్య లాక్రమించిరి. ఇట్టి స్థితిలో తిక్కన చేయునది లేకపోయినది. పూర్వము అక్కన బయ్యనలను కాకతి గణపతిచే ఓడించి మనుమసిద్ధికి మరల రాజ్య మిప్పించినవాఁడు, ఇప్పుడు అట్లు చేయలేఁడు. గణపతియే పరాజితుఁడు. మనుమసిద్ధికొమారుఁడు రెండవ తిక్కరాజు క్రీ. శ. 1279 ప్రాంతమున మరల రాజ్యమును సంపాదించుకొనెనుగాని ఎక్కుడు కాలము పాలింపలేదు. తిక్కనభారతరచన క్రీ.శ. 1261-1279 ల నడుమ జరిగియుండవలెను. ఇట్టి పరిస్థితులలో కేతన దశకుమారచరిత్ర తిక్కన కెప్పుడంకితము? భారతరచనానంతరమా? షష్ట్యంతములకు తిక్కన తోలిరచయితయై కేతన అనుకర్తయైనయెడల తర్వాతివాఁడేయగును. కాని తిక్కనను ఆతఁడు ఎక్కుడను సోమయాజియని పేరొక్కనలేదు, భారతరచయితయనియు చెప్పలేదు. కవియనియు అమాత్యశేఖరుఁ డనియు మాత్రమే చెప్పి అయన గుణగణాదికములను వర్ణించెను. అనఁగా తిక్కన భారతాంధ్రీకరణమునకుముందే కేతన దశకుమారచరితమును రచించినాఁడనవలసియున్నది. అప్పుడు మనుమసిద్ధి జీవించియుండెను. కీ. శే. శ్రీవేదము వేంకటరాయశాస్త్రిగారు 'తిక్కనసోమయాజివిజయము' అను నుపన్యాసమున (1920) నిట్లు వ్రాసినారు.

"ఈయన (తిక్కన) పైఁ జెప్పినయట్లు 'వేదవేదాంతతత్త్వజ్ఞుఁడును' 'బలసూదన విభవుఁడును' నయినందులకు ఫలముగా నిరంతర శ్రౌతస్మార్త నిష్ఠుఁడైయుండి తుదకు సోమయాజియై విరాజిల్లెను. దశకుమారచరిత్రలో కేతన ఎచ్చటను తిక్కన సోమయాజి యని పేరొక్కనందునను, నిర్వచనోత్తరరామాయణములో తిక్కన 'తిక్కనసోమయాజి' యని వ్రాసికొనక 'బుధారాధనవిధేయ తిక్కయ నామధేయ' యని వ్రాసి

కొని యుండుటంబట్టియు, ఆ రెండుగ్రంథములనాటికి ఆతఁడు సోమ పానముంగావించి యుండలేదని తెలియనగుచున్నది." పుట 8.

భారతమునకుముందే దశకుమారచరిత్ర రచితమైనట్లు ఇందుచే గట్టిగా చెప్పనగును. కేతన తిక్కన శిష్యుఁడుగాఁడు. నెల్లూరివాఁడును కాఁడేమో. అతని యింటిపేరు మూలఘటికవారు. అతని పూర్వులది వేంగి. మూలఘటికవారిది గుంటూరులో నాదెండ్లప్రాంతముగా నుండును. నాదెండ్ల మూలస్థానేశ్వరుని యాలయము శాసనములలో నొకదానిలో (S. I. I. Vol.X-139) "శకవర్షంబులు 1078 అగు నేంటి యుత్తరాయణ సంక్రాంతి నిమిత్తమున మూలఘటికాన్వయ ద్విజకులతిలకుండై భార ద్వాజగోత్రుండైన వెలంటూరి దండనాయక వేమనాయక కొడుకు [బ] డెయ నాగరాజు మఱంది నారాయణుండు" అని కలదు. క్రీ. శ. 25-12-1156 ఆదివారమునాటిది ఈశాసనము. ఈ మూలఘటికవారు వెలనాటి చోడరాజుల యాస్థానమందుండియుందురు. కేతనయు వెల నాటినుండియో మఱి అటావలి వేఁగినాటినుండియో నెల్లూరికి తిక్కన దర్శనార్థియై వచ్చియుండును. ఏదోకార్యము నపేక్షించి తిక్కనామా త్యుని తన కనుకూలునిగా చేసికొనుటకు కృతిసమర్పించియుండును. నాదెండ్ల మొదలైన ప్రదేశములలోని శాసనములను కవితారీతులను ఎఱుఁగక యుండఁడుగదా. ఎటులైనను తిక్కనను 'ఉభయకవిమిత్రుని' అమాత్యశేఖరుని మెప్పింపఁ బూనినవాఁడు. 'కవితఁజెప్పి యుభయకవి మిత్ర మెప్పింప నరిది బ్రహ్మకైన' అని చెప్పియేయున్నాఁడుగదా. కావున నూతన రీతులను కల్పించుకొని పష్ఠ్యంతరచనచేసి, 'అతఁడు మెచ్చ, పరగ దశకుమారచరితంబు చెప్పి' 'ప్రౌఢ'యై నూతనశైలికి మార్గదర్శకుఁ డయ్యెను. ఈతఁడమాత్యుఁడు. అగ్రహారాది బహు మానముల నపేక్షించు కవిమాత్రుఁడుగాఁడు. అట్లుండిన రాజున కంకిత మీయక సాటి నియోగికేల యిచ్చును. తిక్కనయన్ననో అమాత్యశిఖా మణి; కాకతీయ గణపతిచక్రవర్తిని తనకు వశవర్తిగా చేసికొని తన రాజునకు మరల రాజ్యమును దాయాదులనుండి సంపాదించినవాఁడని

తెలియుచున్నది. కేతన దశకుమారచరితమున తిక్కనను 'సామాద్యుపాయవిదునకు' 'నీతిచాణక్యునకున్' 'ఇతరసచివదాత్రుండు' 'నీతి నిపుణమతి జితపురుహూతామాత్యునకు' 'రాజనయవిధాప్రయోజనవిశారద' 'అరిసచివమహోపాయాపహారుండు' 'నరపతినయవిద్యానైపుణప్రౌఢభావా' అని స్తుతించినందున నాటి రాజకీయములలో తిక్కన ఏదో గొప్ప రాచకార్యమును సాధించియుండెనని ధ్వనించుచున్నది. అదియొక వేళ మనుమసిద్ధిని పునఃప్రతిష్ఠితునిం జేయుటయేయై యుండవచ్చునా?

దీనింబట్టి కేతనదశకుమారచరిత్రరచనాకాలమును కొంత నిర్ణయింపవచ్చును. పై నుదాహరించిన 'తిక్కన సోమయాజి విజయము' అను నుపన్యాసమందే ఇట్లున్నది. పుట 6. "ఈతని నీతిపారగత్వము - వైరులచే మనుమసిద్ధి రాజ్యమును కోల్పోయినప్పుడు ఈయన ఓరుగంటి కాకతీయగణపతిరాజును దర్శించి ఆతనిచే ఆ వైరుల నణఁగద్రొక్కించి మనుమసిద్ధిని వెండి నిజసింహాసనాసీనుం గావించుటచే - మిక్కిలి రూఢికెక్కినది. ఈ వృత్తాంతము ఆంధ్రదశకుమార చరిత్రములో లేదు. వేఱాకరములచేఁ దెలియుచున్నది. ఇది ఆంధ్రదశకుమారచరిత్రమునకు తర్వాత జరిగియుండనోపు. అట్లు కానిచో తక్కువి కేతన ఆ గ్రంథములో మనుమసిద్ధి మహీవల్లభునకు ఈయన కరుణాపాత్రం బని వ్రాయుటకు మాఱుగా ఆమహీవల్లభుఁడే ఈయనకుం గరుణాపాత్రమని వ్రాసియుండును. 'మనుమసిద్ధిమహీవల్లభసామ్రాజ్య స్థాపనాచార్య' అను నిట్టి తీరున వర్ణించియుండును."

మనుమసిద్ధికి మరలరాజ్యము సంపాదించుటకుముందే ఏదో సంభవించియుండును. రాజులకు దాయాదులబాధ ఉండునదేగదా. ఇట్టిపనులు చేయుట తిక్కనవంశమున నుండినదే. ఈయన పెదతండ్రి సిద్ధనామాత్యుఁడు 'స్థాపిత సూర్యవంశవసుధాపతినా.....నుదాత్తనృపనీతి బృహస్పతినా' పొగడొందినవాఁడుగదా. కాకతీయుల చరిత్రయు అందు నెల్లూరి చోళుల చరిత్రయు ఇంకను చక్కఁగా పరిశోధితములు గాలేదు. ఆశ్చర్యకిది చోటుగాదు. ఇప్పుడు వాఙ్మయచరిత్రకు కావలసినది ఒకటి

స్పష్టము - కేతన గ్రంథము నిర్వచనో త్తర రామాయణ భారతముల నడిమి కాలమున మనుమసిద్ధి సజీవుడై యుండగా, అనగా 1261 ముందే రచి తము అని. నిర్వచనో త్తర రామాయణముకన్న, అంకితషష్ట్యంతాదుల చేతను చారిత్రకవిషయములచేతను, దశకుమారము తర్వాతిది. ఈ రెండును కాకతి గణపతి దండయాత్రకు ముందువి. గణపతిరాకకు కార ణము రాజకీయకల్లోలములే. గణపతి క్రీ. శ. 1246 ప్రాంతమున కంచి వఱకు వచ్చెనని చెప్పుటకు కొన్ని నిదర్శనములున్నవి. అందుచే నీరెండు గ్రంథములును అంతకుపూర్వమే రచితములై యుండవలెనుగదా. మనుమ సిద్ధి మరణానంతరము ఆంధ్రమహాభారత రచన ప్రారంభమైయుండును.

కేతనను మెచ్చుకొన్నాడు గావుననే తిక్కన తన భారతములో షష్ట్యంతపద్యరచన చేసినాడు. కాని మేధావియు నూతనమార్గప్రియుడును గావున తిక్కన, కేతనమార్గమును కొంతసంస్కరించి మెఱుగెక్కించినాడు. ఎట్లన షష్ట్యంతములతో ఆశ్వాసమును ముగింపక వానికి ప్రథమాశ్వాసమధ్యమునసే స్థానము కల్పించి, వెంటనే కథ ప్రారంభించి కొంతకథ నడచినతర్వాతనే ప్రథమాశ్వాసమును ముగించినాడు.షష్ట్యం తములను పూర్తిగా కందములుగానేవ్రాసి నడుమ వృత్తములను చేర్చ కయు, పైగా వానిసంఖ్యను తగ్గించి చక్కదిద్దినాడు. కేతన ఏప్రయో జనము కోరియో తిక్కన సదభిప్రాయమునకై ఆయనను స్తుతించు నావేశములో పదునొకండు షష్ట్యంతములు వ్రాసియుండునని తోచు చున్నది. తిక్కన చేసిన యీ సంస్కారము తర్వాతికవులకు మార్గదర్శక మైనది. కాని పైయిరువుర ప్రజ్ఞలేనివారు గావున అనంతరకవులు ఆచారముపాటించుటగా షష్ట్యంతములు వ్రాసి వదలిరి. ఆశ్వాసాంతముల లోను ప్రథమేతరాశ్వాసములలోను షష్ట్యంతములను వ్రాయక సంబో ధనలుగాను, షష్ట్యేతరవిభక్తులలో కొన్నిపద్యములను వారివారికి తోచినట్లు వ్రాసినను ఎక్కువగా సంబోధనలేవ్రాసిరి. జక్కనమాత్రము షష్ట్యంతములుగా ఐదుకందములు వ్రాసి ఆపైనుక ఒక యుత్పలమాలను వ్రాసినాడు - 'వెన్నెల కంటి సూర్యుడు 'అను పద్యము. ఇది షష్ట్యం

తము, ఆవరుపకు చేరినది; కాని కందము కాకపోవుటయే చిత్రము. శ్రీ చాగంటి శేషయ్యగారు ఈపద్యము ప్రక్షిప్తముగానుండునా యని శంకించినారు. దీనింగూర్చి చర్చించి తేల్చుట కిది తావుకాదు గాని దీనికి తర్వాత మరల నొకపద్యము కందముగా కేతనవలె నీతఁడు వ్రాయ నందున కందముల యందము చెడలేదు. షష్ట్యంతములేమో ప్రథమా శ్వాస మధ్యమునవే యున్నవి. ఈ యుత్పలమాల వచనమునకుముందు వచ్చుటతప్ప మిగిలినదంతయు తిక్కనమార్గమే. కవి యొకవేళ స్వతం త్రించెనేమో.

ఈవిధముగా క్రమపరిణామమందిన షష్ట్యంతరచనయే నన్నె చోడుని గ్రంథమున కనఁబడుచున్నది. ఎట్టి మార్పులునులేక చక్కఁగా కుదురుకొనిన సంప్రదాయము అది. తిక్కనకు తర్వాత కొంతకాలము నకు ఎఱ్ఱాప్రెగడ రచించిన నృసింహపురాణమున నెట్టిసంప్రదాయము కుదురుకొన్నదో అట్టిదిగా నున్నది.

'ఈ కృత్యాదివిధానమంతయు నన్నెచోడుఁడు కర్ణాటక కావ్య ములనుండి గ్రహించియుండును; అచ్చటి సంప్రదాయము ఈతనివలన ఆంధ్రులకు అబ్బినది. ఈతనినే తిక్కనాదులు అనుకరించినారు' అని కొందఱు తలంపవచ్చును. తిక్కనాదులను చూచితినిగదా, కన్నడ సాహిత్యముం జూతము. కన్నడగ్రంథములలోని పోకడలు కొన్ని ఈతని గ్రంథములలో కనఁబడుచుండుట సరియేగాని ఆసంప్రదాయము నకుమాత్రము ఈతఁడనుకర్తయనుటకు సాక్ష్యముచాలదు సరిగదా కాఁడనుటకు ప్రబలనిదర్శనము ఈ షష్ట్యంతాది కృతిసమర్పణరచన కన్నడమున లేకపోవుటయే. బొత్తిగాలేదు. పొన్న (940) పంప (950) రన్న (970-1003) కవుల గ్రంథములలో లేదు. తర్వాతివారి గ్రంథ ములలోను లేదు.

పొన్నమయ్య రాష్ట్రకూటచక్రవర్తి కృష్ణరాజుచే 'కవిచక్రవర్తి' బిరుదునందెను. తన శాంతిపురాణమును, పంచేండు ఆశ్వాసములకావ్య మును - వేంగీవిషయమునందలి కమ్మెనాటి పుంగనూరు వాస్తవ్యులను,

కౌండిన్యగోత్రోద్భవులును, యాజ్ఞవల్క్యసదృశుండైన నాగమయ్య యను జైనబ్రాహ్మణుని పుత్రపౌత్రులునైన మల్లప్ప పున్నమయ్యల ప్రార్థనచే, వారి గురువైన-జినచంద్రదేవుని 'పరోక్షవినయ' ప్రదర్శనార్థము, వారిపోషకత్వమున రచించెను. గ్రంథమందు తనపోషకుల వంశావతారమును వర్ణించెను. ఆశ్వాసములతుదలలో "ఇదు జినేంద్రచరణ సరసీరుహ శిలీముఖాయమాన శ్రీమదుభయకవి చక్రవర్తి నివర్తితముం అమ్మనభక్తాభిధాన విద్యానిధాన మల్లపార్య తదనుజాతాభిజాతసారస్వత పున్నమార్యకారితము మప్ప పురాణచూడామణియెళ్" అని వ్రాసికొనియున్నాడు. కాని షష్ట్యంతాదిరచనాపూర్వక కృతిసమర్పణము చేయలేదు. సంబోధనలు లేవు. కవి ఇష్టదేవతాస్తుత్యాదికము లొనరించి ఆయాదేవతలు కృతిపతికిని (జినచంద్రదేవునికి) పోషకులకును అభ్యుదయమిత్తురుగాక యను నాశీఃపూర్వకపద్యములే రచించెను. వేంగివారేయైనను పోషకులు కన్నడమున కావ్యము రచియింపించుట చిత్రము.

ఇతనికి ఇంచుమించు సమకాలమున పంపభారత మను నామాంతరముగల విక్రమార్జునవిజయకావ్యమును వేములవాడ చాళుక్యుల యాస్థానియందుండి రచించిన పంపమహాకవియు (950), తర్వాత చాముండరాయపురాణమును రచించిన చాముండరాయామాత్యుండును (978), ఛందోంబుధి రచించిన నాగవర్మయు (990), తర్వాత రన్నకవియు, ఇట్లే పలువురు కన్నడకవులును ఎన్నియో ప్రబంధములను, తెనుఁగులో అట్టి కావ్యరచనలేని కాలమునుండియు చేయుచుండిరి; కాని వీరిలో నెవరును కృతినిచ్చునప్పుడు షష్ట్యంతములు, తర్వాత, ఆశ్వాసములలో సంబోధనలు ఇట్టివి చేసినవారు కారు. కర్ణాటకులును ఆంధ్రులును ఒకరొకరి గ్రంథములను పఠించుచుండినట్లును ఆయాకవితారీతులను గ్రహించుచుండినట్లును నిదర్శనములున్నను తెనుఁగు సంప్రదాయములను తెనుఁగు మర్యాదలను వీడినవారు కాఁకాంధ్రులు. నిదర్శనములు ఎన్నియైనను గలవు.

ఆంధ్రులు పెంపొందించిన కృతిసమర్పణ సంప్రదాయము కన్నడ కావ్యములలో లేదు సరిగదా ప్రాకృత తమిళకావ్యములలోను లేదు. సంస్కృతములో లేనేలేదు. ప్రాకృతకావ్యములు దాదాపు పండ్రెండవ శతాబ్దము వఱకును రచితము లగుచునేవచ్చినవి. తద్రచయితలు చాల వఱకు జైనులే గనుకను కర్ణాటక కావ్యకర్తలును అధికసంఖ్యాకులు జైనులైనందునను ఇరువురి రచనలకును ఎక్కడను భేదము కానరాదు. కృతిని కన్యగాభావించుట కలదు, కృతియిచ్చుటయును కలదు. కాని మనపద్ధతికాదు. తమిళములో ఇట్టి కావ్యరచనయే లేదు. 'ఉళా' 'పరణి' మొదలైన రచనలున్నవి, పురాణములున్నవి, రాజులయు ప్రభువులయు ప్రశస్తులకొఱకు కావ్యములను రచించుటయు నున్నదికాని మనపద్ధతుల జాడలుకూడలేవు. షష్ట్యంత సంబోధనాదులు కానరావు. మన యుదాహరణవాజ్మయమువంటిది బొత్తిగాలేదు.

నన్నయకు తర్వాతి కన్నడకవులలోకూడ ఎట్టిమార్పును కానరాదు. కర్ణపార్యుడను జైనకవి నన్నయకు దాదాపు ఎనుబదియేండ్లతర్వాతివాడు నేమినాథపురాణమును (క్రీ. శ. 1130 - 1135) కావ్యమును రచించెను. కృతిపతి అమాత్యలక్ష్మీధరుడు లేక లక్ష్మణుడు. ఈతడు కరహాటశిలాహారజీమూతవాహనవంశస్థుడును కిళకిళ (కిళిగళ = చిలుకల అనుట సాధువు) దుర్గాధిపతియునైన విజయాదిత్యుని 'రాజ్యభారధౌరేయుడైన 'కరణికాగ్రణియూ మంత్రియూ'. కృతిపతికి 'భవ్యవనజవనమార్తండం' 'పరమజినమతక్షీరవారాశిచంద్రం' 'సమ్యక్త్వరత్నాకరం' 'భువనైకభూషణం' 'గాంభీర్యరత్నాకరం' 'బుధకావ్యవ్యాసంగం' అను బిరుదులు కవి పేర్కొని, ఆశ్వాసాది (కన్నడములో కూడ కావ్యవిభజన ఆశ్వాసములనియే) కందములలో 'భవ్యవనజవనమార్తండం' అనియు, ఆశ్వాసాంతస్రగ్ధరలలో 'పరమజినమతక్షీరవారాశిచంద్రం' అనియు కవి పైబిరుదులనే పేర్కొనెను. కాని ఒకచిత్ర మొనర్చెను; ఈబిరుదములు కృతిపతికిని కథాసందర్భములోని పాత్రలకును కలిసి యర్థధ్వని కలుగునట్లుగా వ్రాసికొనుచుపోయెను. ప్రత్యేకముగా

కృతిపతిని ఆశ్వాసాద్యంతములలో సంబోధింప షష్ఠ్యంతములుగాని ఇతర విభక్తులుగాని లేవు. జైన సంప్రదాయానుసారముగా జైనపూర్వాచార్యులను పొగడి, కృతిపతియొక్క రాజును రాజవంశమును స్తుతించి, కృతిపతియైన మంత్రిని 'ప్రథితయశం.....కథా పృథు గ్రథన సహాయనంతె' అనియు, ప్రోత్సహించినవారిని 'శ్రీ గోపణార్యప్రముఖ బుధజనం పేళెమెం దెందొడు' అనియు ప్రశంసించి కథ చెప్పనారంభించినాడు. 'కథాక్రమం బెట్టిదనిన' అనురీతి నుపక్రమించుటకుముందుకూడ షష్ఠ్యంతముగాని ఆశీర్వచనముగానిలేదు. గ్రంథాంతమున లక్ష్మణమంత్రియొక్క గొప్పతనమును వర్ణించినాడు గాని గ్రంథారంభమున కృత్యాదిలో కాదు.

క్రీ. శ. 1220-30 కాలపుకవి గుణవర్మ పుష్పదంతపురాణ మను జైనకావ్యమును రచించెను. ఇతఁడు జైనుఁడు, ప్రసిద్ధుఁడు. ఈతని పోషకుఁడు నాడ్ప్రిభు శాంతివర్మ, గురువు మునిచంద్రపండితుఁడు. తన ప్రఖ్యాతిని వైభవమును వజ్రదేవుఁడనురాజు నాస్థానమున విని శాంతివర్మ 'దీనానతవర్మఁ'డై తన్నాదరించి కృతికన్యను తనకిమ్మని యాచింపఁగా, కవి, మహావిష్ణువువంటి యల్లుఁడు దొరకెనుగదా యని ఆతనికి కృతి యిచ్చెనట. ఈయల్లుఁడు విష్ణువుతో నెట్లు సమానుఁడనుటను కవి యిట్లు చమత్కరించెను - మహావిష్ణువు తన్నే క్షీరసముద్రమునకు సమర్పించుకొని 'ఇల్లట పల్లుఁడై' మహాలక్ష్మిని కౌస్తుభమణిని గ్రహించినట్లు ఈప్రభువు శాంతివర్మ తన్నే కవికి సమర్పించుకొని కావ్యరత్నమును కీర్తిని గ్రహించెను - అని. అంతగొప్పగా ఆదరించెనట. ఆ. ౧ - ౭౨.

మా॥ప్ర॥'క్షీతియొళ్ మున్నబ్జనేత్రంమనెయళియనెనల్ క్షీరవారాశియం వి
శ్రుతలక్ష్మీదేవియం కౌస్తుభమణిసహితం కొండనెంతంతె తన్నం
సతతం కూర్తిత్తుకొండం గుణనిధిగుణవర్మంగె కీర్త్యన్వితం స
త్కృతిలక్ష్మీకాంతెయం రంజితవిబుధజనస్వాంతెయం శాంతివర్మం'

నన్నెచోడుని కవితకును ఈతని కవితకును ఫోలికలు గలవుగాని వాని చర్చ తర్వాత. ఇచ్చట ఎంతవఱకు ప్రస్తమనఁగా షష్ఠ్యంతసంబోధ

సలవఱకు; అవిలేవు. తిక్కనవలె ప్రథమాశ్వాసము పూర్తియగుటకు ముందే కృత్యాదికర్తవ్యములు పూర్తిచేసి కథ ప్రారంభించుటయు, నన్నెచోడునివలెను శివకవులవలెను మార్గదేశికవిత్వముల ప్రశంసించుటయు కనఁబడుచున్నవి.

వీనిచేత తేలిన దేమనఁగా ఆంధ్ర సంప్రదాయము పూర్తిగా ప్రత్యేకమార్గమును త్రొక్కి వర్ధిల్లినది గాని అన్యభాషాసంప్రదాయము లకు నకలు ఎంతమాత్రము 'నఖలు'. నన్నెచోడుఁడు ప్రాచీనుఁడైనను యొడల తానే ఊహించుకొని ఈచక్కనిపద్ధతిని కుదుర్చుకొని యుండవలయును లేదా తిక్కనాదులకు చాలతర్వాతివాఁడుఁగానైన నుండువలయును. ఇట్టి కవిత్వసంప్రదాయమే తిక్కనకుముం దుండియుండిన నశించి యుండదు, కవులు శ్రమపడి ఒకపద్ధతిని క్రొత్తగా నిర్మించుకొనవలసిన స్థితియు నేర్పడియుండదు. కావున శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు తలంచినది సాధువే; షష్ఠ్యంతరచన చక్కఁగా నెలకొన్న తర్వాతిరచనగాని ఇది అంతకుముందుది కాదు. ఇంతదూరము శ్రీశాస్త్రిగారు చర్చించి తేల్చినందున వారిభావమును విమర్శకులు గ్రహింపలేకపోయిరి. పైయభిప్రాయమును ద్రఢీకరించు గట్టినిదర్శనము సప్తసంతానముల ప్రశంస. ఇది శ్రీశాస్త్రిగారి దృక్పథమును దాఁటిపోవుట నాయదృష్టమే.

౫ - ప్ర క ర ణ ము

స ప్తసంతానములు — వానిచరిత్ర

సంస్కృత ప్రాకృత ద్రావిడ కర్ణాటక వాఙ్మయములలో నెచటను కానరాని నూతనభావ మొకటి ఆంధ్రులకు ఆంధ్రవాఙ్మయ ప్రారంభ కాలమునుండియు నేర్పడి క్రమముగా నభివృద్ధియైనది కలదు. అది కృతిసప్తసంతానములలో నొకటి యనుట. కవులు రాజాస్థానములలో పూజ్యులై ప్రభువులు గ్రంథములను పోషించు సంప్రదాయము కాళిదాసాదుల కాలమునుండియు వచ్చుచున్నను, 'అంకితము' చేయు పద్ధతి భిన్నము అని తేలినదిగదా. అట్లే ఆంధ్రదేశమందు అనఁగా శాత వాహనుల దక్షిణాపథమందు, ఆంధ్ర కర్ణాటకములు భిన్నములైపోయి వేంగీచాళుక్యులు ప్రవర్ధమానులగుచుండఁగా ఏడవశతాబ్ది మధ్య నుండి తెలుఁగుదేశమున తెలుఁగుశాసనము లభివృద్ధిగాంచినవి. పద్య కవిత్వపు గుర్తులు కనఁబడి క్రమముగానభివృద్ధియైన తెలుఁగు గోచ రించినది. నన్నయకు చాలపూర్వపు తెలుఁగు శాసనములలో తెలుఁగు పద్యములు కనఁబడినవి. ఆంధ్రదేశమందు, అనఁగా వేంగి, కమ్మ, పాక, పంట మొదలైనరాష్ట్రములలో దేవాలయములు, ఆరామతటాకములు, అగ్రహారములు ప్రతిష్ఠితము లగుచుండినవి. రాజరాజనరేంద్రుని కాల మునకు తెనుఁగువారికి కొండంత యుద్గ్రంథమొకటి బయలుదేరినది. బహుముఖములుగానుండిన కవితాస్రవంతికి ఏకాశ్రయము దొరకినది. ఒకనిలుకడ గలిగినది.

రాజరాజనరేంద్రునియనంతరము (1061) రాజకీయకల్లోలములచే తెనుఁగుకవిత వెనుకంజ వేసినది. నరేంద్రునికుమారుఁడు తమిళగ్రంథ మైన 'కళింగత్తుప్పరణి' యను ప్రశస్తికావ్యమును అంకితమందెను. కళిం గత్తు=కళింగమునుగుఱించిన, పరణి = పరణి యనఁబడు నొక కావ్యము.

నరేంద్రునికుమారుఁడు రాజేంద్రుఁడు, ఉభయకులోత్తుంగచోళుఁడని ప్రసిద్ధినందెను. ఉభయశబ్దమునువదలి మామూలుగా కులోత్తుంగచోళుఁడని వ్యవహారము కలిగినది. ఈతఁడు కళింగదేశమును జయించినకథను 'జయంగొండార్' అనఁబడుకవి తమిళములో 'పరణి' యనఁబడు కావ్యముగా రచించి సంకీర్తనమొనరించెను. మన ప్రతాపరుద్రీయ కావ్యాలంకారచూడామణులవలె అందు ప్రతిపద్యమునందును రాజుపేరుండును. ఇట్లు తండ్రిరాజ్యమునకును మాతామహరాజ్యమునకును అధిపతియై ఆతఁడు ఆంధ్రమహాభారతమును మఱిచెను. కాని తెనుఁగు శాసన భాషగా నభివృద్ధిగాంచి కన్నడమును వెనుకకునెట్టి తెలంగాణమున వ్యాపింప నారంభించినది; కడప కర్నూలు శ్రీశైలప్రాంతములనుండి క్రమముగా తెనుఁగు పరిస్ఫుటమై, పూర్వము కన్నడశాసనములకును పంపాదుల కన్నడకవితకును చోళాన వేములవాడ మొదలైనచోట్ల తానే కుదురుకొన్నది. కాకతీయులు పశ్చిమచాళుక్యుల సామంతులుగానుండి క్రమముగా స్వతంత్రులైరి. వీరిశాసనములలో మొదటమొదట కన్నడ ముండినను వీరి స్వాతంత్ర్యప్రకటనకాలమునకు దాదాఁపు సరిగా తెలుఁగు ప్రాధాన్యము గాంచినది. అసలు తెలుఁగనుమాటయే పదియవ శతాబ్దమునకు ముందటిశాసనములలో కానరాదుగదా. అట్లనుటచేత తెనుఁగుశబ్దము తత్పూర్వము లేదనుటకాదు. తప్పక ఉండియుండవలెను. భాషయుండఁగా పే రెట్లు లేకపోవును. కాని తొలుత పశ్చిమచాళుక్యుల యుచ్ఛ్రీయదశలో (క్రీ. శ. 973 నుండి) దేశమున కొంత మార్పు కలిగినది. వారి పతనముతోను (క్రీ. శ. 1180 ప్రాంతము) కాకతీయుల యభివృద్ధితోను, వీరశైవ వీరవైష్ణవమతముల యూర్ధ్వాటము తోను ఆంధ్రదేశమున నొక నూతనచైతన్యము కలిగినట్లైనది. నగరము లభివృద్ధియై తెనుఁగుభాషావాఙ్మయములలో ప్రతిఫలించెడి తెనుఁగు తనము శాసనములలో కనఁబడ నారంభించినది. తెనుఁగువారు చేసిన దానధర్మాదులకు లిఖితసాక్ష్యములు నెలకొనసాగినవి. ఇవి క్రమముగా సప్తసంతానములని వ్యవహృతములు కాసాగినవి. నన్నెచోడుఁడు సప్త

సంతానములను పేర్కొని అందు కావ్య ముత్కృష్టసంతానమని చెప్పి నందున వీనిచరిత్ర విచారణీయమైనది.

ఆంధ్రవాఙ్మయమున సప్తసంతానములను మొదట పేర్కొన్న కావ్యకర్తమంచన. కేయూరబాహుచరిత్రకృత్యాదిలో నిట్లుచెప్పినాడు.

'నందనుఁడు, వనమ్ము, నల్లిల్లు, నిధి, సుర -
గృహము, చెఱువు, మేలిక్రతి యనంగ
జగతివెలయు సప్తసంతానములు; వీనఁ
బుణ్యమును యశంబుఁ బొందవచ్చు'

మఱి నన్నయమొదలు మంచనవఱకును ఎవరును వీనిని స్మరింప లేదు. శబ్దరత్నాకరములోకూడ శ్రీసీతారామాచార్యులవారు సప్త సంతానముల కుదాహరణముగా అనంతరకవియై చాల అర్వాచీనుఁడైన మైరావణ చరిత్రకారుని పద్యము నుదాహరించినారు.

'సుతుఁడును, గుడి, నిధి, చెఱువును,
గృతియును, నల్లిండ్లు, వనము క్షితిలోపల సం
తతు, లిందు లోన నెన్నఁగఁ
గృతినలనం గలుగునంద్రు కీర్తియు గతియున్.'

వాఙ్మయమునందు కంటె శాసనములలో సప్తసంతానముల ప్రశంస చాల ముందుగా కనఁబడుచున్నది. క్రీ. శ. 1132 (శక 1054) లో గుంటూరి మండలములోని నిడుబ్రోలునందలి యొక శాసనమున ఈ పేరుచెప్పక పోయినను వీనిలో కొన్ని పేర్కొనఁబడియున్నవి. [S.I.I.Vol. VI·123]

శా. 'పెంచెం జుట్టలనెల్ల, (ం) బేర్మి వెలయన్బెట్టించె సత్రంబు, గ
ట్టించె న్భక్తిశివాలయంబు, లిల బ్రౌఢిందాల్చి యొప్పంగ గ్రొ
ప్పించెం బూర్ణతటాకముల్, జలధిగంభీరంబ్లుగాంచెన్నిధుల్
మించెన్గారయపండ (ం) డర్థిభవనానీకంబులం గీర్త్యుఁడై'

ఇందు ఐదు, లేదా, నాలుగు సంతానములే వచ్చినవి.

ఈకాలమందే (క్రీ. శ. 1132) వెలసిన మఱియొక శాసనమున - కృష్ణామండలములో గన్నవరముతాలూకా ఎనమలకుదురు గ్రామమందు

శ్రీకేశవస్వామిగుడి యెదుట నొక ఖాతిస్తంభముమీఁద - నీక్రింది పద్యము.

చ. 'అతులితపుణ్యమూర్త లభియాతినృపాలకభంగదుల్ జగ
ద్ధిత హితసచ్చరిత్రు లుదయించిరి, అందును దమ్ముభీమణ్ణా
ర్జితుఁడై సప్తసంతతులుంజేకొని నిల్చి ధరామరోత్తమ
ప్రతతికి నగ్రహారముల(పా)రము లిచ్చె దయానుభావుఁడ.'

ఈయన చేకొన్న కృతియేదో? అగ్రహారములను ప్రత్యేకించి ఏల చెప్పలేదనో? తెలియుటలేదు. సప్తసంతతులలో ఈకాలమున అగ్రహారములు చేరవా? ఈతఁడు చేసిన యితర దానములు—

శా. "ఆదింజెప్పఁగబడ్డ ధర్మవులు ధర్మారంభుఁడై చేసె వి
ద్యాదానంబు హిరణ్యదానమును భూదానంబు గోదాన క
న్యాదానంబులు నాంగ్లంబూని మహిలోనను బట్టపుంబట్ట ను
ద్వాదించె న్మతి తమ్ముభీమణ్ణొగి సత్రంబుల్ ప్రపల్ బెక్కులున్."

క్రీ. శ. 1146 నాటి బెజవాడ సోమనప్రెగ్గడ శాసనమున [S I. I. Vol. IV-749] నీ పద్యమున్నది.

"భీమాపురము డాకరేమి వాల్కొలను ద్రా
క్షారామపురి శ్రీమదమరడాలు
యను నంధ్రధరణి పం -చారామముల మహా
దేవరలకు బుద్ధ దేవరకు నుం
జేంబ్రోల నమ్మహాసేనునకును బి(ద)
పురము హుంకార శంకరికింగరము
రూఢి కెక్కిన బెజవాడ మల్లేశ్వర
దేవరకు నఖండదీపతతులు
వెట్టి, గొంట్టూరం జెఱువ్వులు బెక్కుగుడ్లు
నిల్పి సప్త సంతతు లసంఖ్యలుగం జేసె
దత్తైనామాత్యసోముండు ధర్మపరుండు
వారభానుజుం డాచంద్ర తారకముగ."

అఖండదీపములుకూడ సప్తసంతానములలో చేరునని యభిప్రాయమా లేక అఖండదీపములు పెట్టి చెఱువులు గుడులు మొదలైన సప్తసంతతులు చేసెనని యర్థము చెప్పుకొన వలయునా? మఱి యీతఁడందిన కృతి యేదో?

ఈకాలముదే యని తలఁపఁబడు మఱియొక శాసనమున పైదత్తైనామాత్యసోమునిఁగూర్చి యిట్లు కలదు. (S. I. I, Vol. IV-1180 బాఁకూరామ భీమేశ్వరాలయమున దొరకినది.)

"దానదధీచి సోము(ం)డవదాత యశఃప్రసారుణ్డు పుత్ర సంతాన సమృద్ధు(ం)డై చెఱువ్వు ధర్మవివాహము దేవగేహము ద్యానము సత్ప్రబంధము నిధాన మనంజనుచున్న సప్తసంతానములుం బ్రసిద్ధముగ ధారుణిపై నిలిపెం గ్రమంబునన్."

ఇందొక చిత్రము, ఈజాపితాలో అగ్రహారము చేరలేదు. ఇంతకుముం దుదాహృతమైన యొక శాసనమున అగ్రహార మేల ప్రత్యేకింపఁబడినదను సందేహము కలిగినది. అందులకు కారణ మిందు తెలిసినది. క్రీ. శ. 1146 నాటికి అగ్రహారమును మనవారు సప్త సంతతులలో చేర్పలేదు. ఈ పద్యములో చూడుఁడు—(1) పుత్రసంతానము, (2) చెఱువు, (3) ధర్మవివాహము, (4) దేవగేహము, (5) ఉద్యానము, (6) సత్ప్రబంధము, (7) నిధానము. ఇందు నల్లిల్లు అనుపదముగాని అగ్రహారము అనుమాటగాని లేదు. వానికి బదులు ధర్మవివాహము.

క్రీ. శ. 1158 నాటి నుదురుపాడు శాసనములో నీ సీసమాలిక (J. A. H. & C. Vol I No 2) కలదు.

"వరుసఁ దప్పేలిన గిరిపశ్చిమ భూ
మండలాధీశుల దండిమగల

... ...

... బుద్ధవరప్రతాపుల
చిత్తంబువడసి సంసిద్ధమైన
గుడి కృతి నిధి తోఁట కొడుకు తటాకంబు
బొల్పుతో నల్లింట్లు నిల్పి కీర్తి

ప్రస్తుతమైన మూలస్థాన దేవర
కనుర క్తి హవిర్బ ల్యర్చనలును
సానులు మానులుగా నోజులును బ్రహ్మ
పురులనుం బెట్టెను గరముపేడ్క"

ఈ జాపితాలోకూడ నల్లిండ్లనియే యున్నది. అదేమో అర్థమగుటలేదు. 'నల్లిండ్లను నిల్పి' అనియే ప్రయోగములు కనఁబడుచున్నవిగాని నల్లిండ్ల నిచ్చుటలేదు. అగ్రహారముల నిచ్చుట కలదు. మఱియొకవిశేషము 'ధర్మ వివాహము' లేదు. ఇందుచే నొక సంశయము కలుగుచున్నది - 'నల్లిల్లనఁగా ధర్మవివాహమా లేక అగ్రహారమా?' అని.

గుంటూరుమండలములో నరసారావుపేట తాలూకా తిమ్మాపుర గ్రామమున కుత్తరముగానున్న ఖాతిస్తంభముమీఁది యొక శాసనము, శరణయది -

సీ. అద్రి పశ్చిమ భూమియందు ప్రసిద్ధమై
జీవపోషణసేయు జేవరంబు
భండనభీ...బడిగొలార్జునుమ్రొల
బెక్కు గయ్యము ... వేరుకొనినఁ
బతిమెచ్చిశాసన.....యుఁడు
నందు గోకేశ్వర దేవరనిలిపి
వరకా...నిలమ్మ వల్లభు వల్లభి
గామిదేవులవేర గట్టి చెఱువు
రుద్రునకునిచ్చి ధర్మాభివృద్ధిగాంగ
దీపవర్తికి గానువు ద్రిఢముసేసి
భూసురోత్తమవరులకు భూమిదాన
మిచ్చి నల్లిండ్లు నిలిపి తా నిన్నవట్టు.

శాసనము చివర -

క. గుడియును జెఱువును వనమును
నడరిన నల్లిండ్లుం గృతియు నలపెన్నిధియుఁ

గొడుకులును సప్త సప్తతి
నొడగూడఁగ నిలిపి సరనం డొప్పెం గీర్తిక.

శా. ప. మంజరి I. 46.

సప్తసంతానములను గుఱించిన కందము మామూలు జాపితాగానున్నను పైసీసమున ఆతఁడు ప్రతిష్ఠించినవానిని చెప్పినాఁడు. 1 జీవపోషణసేయు జేవరము, 2 గోకేశ్వర దేవాలయము, 3 కామిదేవుల చెఱువు, 4 గానుపు, 5 భూమిదానము, 6 నల్లిండ్లు; 7 కృతియేదో తెలియదు. వనము నిధియు సీసమున కానరావు గాని మఱియొకపద్యమున తాను త్రవ్వించిన తటాకమును చెప్పినాఁడు. 'భూమిదానమిచ్చి నల్లిండ్లునిలిపి' అనుటచే రెండును వేఱుగా నుండవలెను లేదా భూదానముతో చేరినవే నల్లిండ్లనియైన చెప్పుకొనవలెను - భూదానపూర్వక కార్యము. అగ్రహారముతోడి ధర్మ వివాహమా? దీని తారీఖు క్రీ. శ. 1161.

వెల్లకి గంగాధరమంత్రి శాసనమున (క్రీ. శ. 1171) అతని దాన ధర్మములు ప్రస్తుతములై సప్తసంతానములు చెప్పఁబడినవి. (తెలంగాణ శాసనములు I - 6, లక్ష్మణరాయపరిశోధకమండలి, హైదరాబాదు.)

క. తనపెంచిన సంతానము
తనసంతానమ్ము గృతియుఁ దన నల్లిల్లుక్
వనమును జెఱువును గుడియును
జనవినుతములైన సప్తసంతానంబుల్;

ఇందు అగ్రహారము లేదు గాని నల్లిల్లుకలదు. తనపెంచిన సంతానము వేఱుగాను తనసంతానము వేఱుగాను చెప్పి 'నిధి'ని వదలినాఁడు కవి. దత్తెనసోముఁడు 'పుత్రసంతాన సమృద్ధుఁడై' అని మొత్తముగా ఒకతెగలో చేర్చి నిధానమును ఒకసంతానముగా చెప్పఁగా ఆతనికి ముప్పదియేండ్లతర్వాతివాఁడు నిధిని వదలుట చిత్రము. గుంటూరివారు అనఁగా కమ్మనాటివా రెవరును నిధానమునువదలక చెప్పుచుండఁగా తెలంగాణపు శాసనకవి దీనిని వదలినది పరిశీలింపఁదగినవిషయము. పైశాసనము ప్రకారము గంగాధరమంత్రి చేసిన ధర్మకార్యములు—

(1) దొండొండనఁగా (?) బరఁగిన మహాగ్రహారమునిచ్చి యజ్ఞ ములు చేయించెను.

(2) పై యగ్రహారమున త్రికూటనిర్మిత శివాలయమును, తటాక మును, పుష్పవాటికలును వసములును వెలయింపఁజేసెను.

(3) మఱి యనుమకొండలో, పురమధ్యమున, ప్రసన్న కేశవ దేవుని రుద్రేశ్వరదేవుని సమీపమున నిల్పెను. పున్నేశ్వరదేవాలయ సాన్నిధ్య మున పన్నగభూషణునకు గుడి నిల్పెను. త్రైపురుషులను ప్రతిష్ఠించెను.

(4) 'గంగాశయ' చెఱువుగట్టున కేశవదేవుని గుడియు బ్రాహ్మ ణులకు సంధ్యావందనమంటపమును 'జనాశ్రయ' నామకమును చేసెను.

(5) హిడింబ తీర్థమున భీమనాథదేవాలయమున విష్ణువును ప్రతి ష్ఠించెను.

(6) ఆపురమున పట్టశాలలో బుద్ధప్రతిష్ఠ చేసెను.

(7) సంవర్తకేశ్వరమున శివుని పూజించి తటాకమును గుడియు నిర్మించెను. శివుని ప్రతిష్ఠించెను.

(8) రుద్రేశ్వర దేవాగార సమీపమున గౌరివల్లభునకు సుధా గారము నిలిపెను. తత్సన్నిధానమున విష్ణువును ప్రతిష్ఠించి చెఱువు ఉత్సవముతోఁ బెట్టెను.

(9) మంత్రకూట పురమున శివునికి గుడివృత్తి నిల్పెను.

(10) నగునూర అచ్యుతుని చతుర్వింశతిమూర్తియుక్తముగ ప్రతిష్ఠచేసెను.

ఈతఁడు సప్తసంతానములను చేసితి ననెను గదా వానిని శాసనమునుబట్టి చూతము. (1) అగ్రహారము, (2) గుడులు, (3) తటాకము, (4) వన ములు, (5) సంధ్యావందనమంటపము, ఈర్వురే కనఁబడుచున్నవిగాని అంతకు హెచ్చులేదు. సంధ్యావందనమంటపము జాపితాసంతానము లలోఁ చేరదు. ఈతఁడు అందినకృతిగాని, నిలిపిన నల్లిల్లుగాని, ప్రతిష్ఠించిన నిధిగాని తెలుపఁబడలేదు. సత్సంతానవంతుఁడై యుండినందున పుత్రసంతా నమునకు ప్రత్యేక ప్రశంస అక్కఱలేదేమో. చూడఁగా ఈతని సప్త

సంతానముల జాపితాయే సరిగాలేదు. బహుశః ఈతఁడు సప్తసంతానములనుగూర్చి వినియుండి ఊరక ఆజాపితా చేర్చుకొనినాఁడే గాని వేఱు గాదని అనిపించుచున్నది. చివరి కందపద్యములో చెప్పినవన్నియు తాను చేసినట్లర్థము కాదుకాఁబోలు; సప్తసంతానము లనఁగా ఫలానివనియు అందు కొన్ని తాను చేసిన ట్లర్థము చేసికొనవలయునని తోఁచుచున్నది.

సప్తసంతానములనుగుఱించి గుంటూరివారికే అనఁగా కమ్మనాటి వారికే చక్కఁగా తెలియుననియు ఇతరులు అనుకర్తలనియు నిరూపించుటకు పైశాసనమొకటేగాక కాకతీయులనాటి నతవాటి బేతరాజు శాసనము, క్రీ. శ. 1207 నాటిది సాక్ష్యమిచ్చుచున్నది. పూర్తిగా సంస్కృతమున సప్తసంతానముల శ్లోకము - 'సప్రాప్తం సప్తసంతానా నుపయేమే యథావిధి.....నిధాయ దేవభద్రం తడాగవనసంతతి. .....ప్రతిష్ఠాప్య చ సప్తసంతానజం సోయం తయాసాక మనేకరూపా న్నిర్మాయ ధర్మానిహారుద్రదేవః, సుధాసమృధ్యా...కరమ్య హర్మ్యా విప్రాన్నమప్రీణయ దగ్రహారైః...'—అని కొంతకలదు. [తెలంగాణ శాసనములు. కాకతీ. 57 ఇనుగుర్తి] శాసనము అచ్చటచ్చటపోయినట్లున్నది. శ్రీరామారావు గారి సంపాదకీయపు చుక్కలే ఎక్కువ. ఈ శాసనకర్త ప్రతిష్ఠించిన సప్తసంతానము లేవో తెలిసికొనుట కవకాశము లేదు. 'సప్రాప్తం సప్తసంతానా నుపయేమే యథావిధి' అన్నచో, సప్తసంతానములను పొందుటకై యథావిధిగా వివాహము చేసికొన్నాఁడని యర్థము గదా, మఱి వివాహము సంతానముకొఱకా సప్తసంతానములకొఱకా? అవివాహితునికి అధికారము లేదా? 'తనపెంచిన సంతానము' కూడ సంతానమే యని యొక శాసనమున చూచితిమి గదా. వివాహమునకును సప్తసంతానములకును ఏమి సంబంధమో తెలియుటలేదు. ఏమో వ్రాసినాఁడు శాసనకవి. అతనికే అర్థమైనదో లేదో!

ఇఁక దొరకినంతవఱకు కట్టకడపటి శాసనము క్రీ. శ. 1224 నాటి ఓపిలిసిద్ధి కొణిదెన శాసనము. [S. I. I. Vol. VI-628] ఈ యోపిలిసిద్ధి కేంకణచక్రవర్తి బిరుదాంకుఁడు (కాకతీయ) గణపతిశు నాజ్ఞచే కమ్మ

నాడు జయించి ఆఱువేల దేశమును ఏలెను. ఈతని రాజధాని కొట్టియ దొన (కొణిదెన). ఈశాసనములో సప్తసంతానము లనుమాట మాత్రమే యున్నది—'ఇ ట్లిలి సప్తసంతానంబులు దేవబ్రాహ్మణదత్తులు సమస్తధర్మం బులుం బ్రతిపాలించి'

ఈయుదాహరణములచేత తేలిన దేమనఁగా సప్తసంతానము లను వాడుక ఆంధ్రదేశములో మొదట గుంటూరుసీమలో కనఁబడి అట నుండి కాకతీయ రాజ్యమునకు వ్యాపించినది. సప్తసంతానము లేవి అను టను గూర్చికూడ అభిప్రాయములు నియతములు కాలేదు. కాకతీయుల రచనలు చూచిన అదేదో తెచ్చుకోలు వ్రాతగా నున్నదిగాని అచ్చటి యాచారముగా కనఁబడదు. మఱి కమ్మనాటిలో చాలవఱకు తెలియు చున్నదిగాని 'నల్లిల్లు అగ్రహారమగునా, ధర్మవివాహ మెట్లు ఈజాపితాలో చేరినది, నిధాన మనగా నేమి' యనుటలే తెలియవలెను. నిధానమనఁగా నీకాలమున ధనాగారము కాదనుటకు కొంత యాధారమున్నది. కొమ్మమ వెలయవలి శాసనమున (క్రీ. శ. 1156)—

ఉ. మానవతీలలామ గుణమండనమండిత కొమ్మమాంబ యం
భోనిధికిఁ సమానమనఁ బొల్చు తటాకము నిల్పెధర్మ సం
తానము గాఁగ, దానికిని దక్షిణదిక్కున సత్ఫలావళిఁ
మానగుచున్న తోఁటయును మాధవదేవునికిచ్చె భక్తితోఁ.

నిధియనఁగా అంభోనిధికిఁ సమానమనఁ బొల్చు తటాకము అని చెప్ప వచ్చును. ఇది కుదురదని తోఁచిన మఱియొకశాసనము, నిడుబ్రోలుది—(1132) 'జలధిగంభీరంబుగాంచెన్నిధుల్.' చెఱువును తటాకమును రెండును జలాశయములేయైనను ప్రత్యేక సంతానస్థానముల నందినవి.

నల్లిల్లు అనుపేరు మొట్టమొదటి పర్యాయము క్రీ. శ. 1158 నాటి నుదురుపాటిశాసనములో కనఁబడుచున్నది. అగ్రహారముగాని ధర్మవివాహముగాని ఇందు పేర్కొనఁబడలేదు. వారువారుచేసిన ధర్మ ములలో అగ్రహారదానములు కనఁబడుచున్నవిగాని సప్తసంతానముల జాబితాలో ఆమాటకు బదులు నల్లిల్లనియే తర్వాతివారు వాడినారు.

పైగా నల్లిండ్లను నిలుపుటయేగాని ఇచ్చుటలేదుగదా. కవులలో సప్త సంతానములనుగూర్చి చెప్పుటకు మొదటివాఁడు మన మెఱిఁగినవఱకు మంచనయే. అతఁడు నల్లిల్లని యన్నాఁడేగాని వివరింపలేదు. కాని భీమయ గుండమంత్రిని గుఱించి చెప్పునప్పుడు

'పుణ్యనదీతీర భూమిఁ దా నిలిపిన
నల్లిండ్ల విప్రగణంబు చేత'

అని కొంత వ్రాసినాఁడు. నల్లిండ్లలో బ్రాహ్మణులను నిలుపుట యని తెలిసినది. 'భూసురవరులకు భూమిదానమిచ్చి నల్లిండ్లు నిలిపి' అన్న పూర్వోదాహృత శాసనవాక్యముచే భూదానముతో కూడినది నల్లిండ్లను నిలుపుట అని యర్థమైనది. మఱి అగ్రహారమే ఏలకారాదు? అగ్రహారము వట్టిభూమి, పన్నులులేనిది, బ్రాహ్మణదేయముగాదా, దానికి ఇండ్లతో ప్రసక్తి యేమి? శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులవారు శబ్దరత్నాకరములో - 'నల్ల + ఇండ్లు = అగ్రహారము' అని యర్థము వ్రాసి బ్రాకెట్టు (కుండలీకరణము)లో 'బ్రాహ్మణగ్రామముచే నల్లనివని యెఱుంగునది' అని వివరించినారు. ఇందులకు ప్రమాణ మేమో వ్రాయలేదు.

అష్టాదశవర్ణనలచే 'పరిపూర్ణంబైన' మహాకావ్యమును రచించిన నన్నెచోడుఁడు సందేహమునకు అవకాశములేని విధమున వ్రాసిన మహానుభావుఁడు.

"పూని, [1]మహాగ్రహారపుర,
[2]పుత్రసమున్నతి, [3]దేవతాల, [4]యో
ద్యాన, [5]తటాక, [6]సత్కృతి, [7]ని
ధానము - లాశశితారకంబు సు
స్థానములై మహింబరగ
జంగమమల్లయవేర సప్తసం
తానములొప్ప నిల్పుదు ము
దంబునఁ దత్ప్రభునాజ్ఞ పెంపునన్."

'మహాగ్రహారపురము' ఇండ్లవీథులతోడి భూదానము - అని స్పష్టము. అగ్రహారమువేఱు పురమువేఱు అని యందుమేని ఎనిమిది లెక్క యగును. కావున మిగిలిన సంతానములను లెక్కపెట్టఁగా అగ్రహార పురమే సరిగా కుదురుచున్నది. మఱి ప్రాచీనశాసనములలో ధర్మవివాహము నల్లిల్లుస్థానమున కలదేయనిన దాని వివరమిది - ఇది తొలుత ధర్మవివాహముతో ప్రారంభమైయుండును అని నాయూహ. వివాహితునికేగదా యిల్లు; గృహస్థుఁడేగదా ఆహితాగ్ని. గుండనామాత్యుఁడు -

'వడుగు బెండిలిఁజేయ వయస్సైన విప్రులఁ
బడవి సేయించు నీపుడమి యెల్ల'

(కేయూరబాహుచరిత్ర)

వివాహముమాత్రము చేయించి ఇల్లీయక భోజనాదివసతులు కల్పింపక 'యథేచ్ఛం విహర' యని వదలుట భావ్యముకాదని అగ్రహారపురములు నిర్మించి సమీపమున భూదానములు చేయుచుండిరి. 'వడుగుబెండిలి'కిని 'పుణ్యనదీతీరభూమిఁ దానిలిపిన నల్లిండ్ల విప్రగణము'నకును చాలదగ్గర సంబంధముండవలెను. కాఁబట్టి ధర్మవివాహముతో అగ్రహారపురమును చేరినది. క్రమముగా నల్లిల్లై శ్రీసీతారామాచార్యులవారి వర్ణనకు సరిపోయినది. అగ్రహార మనుమాటకు అర్థ మెట్లు అనఁగా, అగ్ర+హార, అగ్రవర్ణములవారికి, బ్రాహ్మణులకు, ఇచ్చునట్టి 'హారము' అనఁగా భూమి అని నాభావము. 'శాతవాహనీహార' 'గుప్తహార' అని ప్రాచీనశాసనముల వ్యవహారము ఆంధ్రదేశమున కలిగినదే.

నల్లిల్లు అన్నమాటకు 'నల్ల+ఇల్లు' అనియే యర్థమా లేక ఇందులకు వేఱైనా గతికలదా యని వెదకిన దొరకునట్లు యున్నది. ఎంత హోమధూమములచే నలుపెక్కినను సంవత్సరమున కొకమాఱైనను వెల్లవేయకుందురా? సుధాధవళితములు కాక నిరంతర ధూమదూషితములా ఆహితాగ్నుల యింట్లు? ఉండవు. తొలుత దత్తము లైనప్పుడైనను నల్లనివిగాక తెల్లనివై యుండియుండవలెనుగదా. నలుపెక్కించి దానముచేసియుండరుగదా! మఱి విషయమే మనఁగా—నల్ల

శబ్దమునకు వేదములనియు, 'నల్గార్' అనఁగా వేదవిదులనియు తమిళములో నర్థము. 'తమిళ్ లెక్సికన్' చూడుఁడు.

నల్లవర్—1 మంచివారు, పవిత్రమైనవారు, నల్లోర్, 2 స్నేహితులు, మిత్రులు (చూడామణి నిఘంటువు); 3 పండితులు (దివాకరనిఘంటువు); 4 స్త్రీలు.

నల్లార్—1 మంచివారు... 2 గొప్పవారు... 3 చదువుకొన్నవారు.

నల్లాఉడైయార్—నల్ల+ఆఉ+ఉడైయార్. మంచినడవడి కలవాఁడు, సదాచారసంపన్నుఁడు.

తిరువాయ్ మొళి(శ్రీ)లో 'నల్లార్ నవిల్ కురుకూర్ శడగోపన్ శొల్ ఆయిరత్తు ఇప్పత్తు' (நல்லார் நவில் குருகூர் சடகோபன் சொல் ஆயிரத்து இப்பத்து) కురుగూరు శఠగోపస్వాములవారి సూక్తులను 'నల్లారు' అనఁగా వేదవేత్తలు పఠింతురని దీని యర్థము.

ఇందుల కుపబృంహకముగా శాసనములలో, తెనుఁగులోను తమిళములోనుకూడ, బ్రాహ్మణులకు వారి పాండిత్యమునకు మెచ్చి వేదపారాయణాదుల కిచ్చిన యగ్రహారములకు 'నల్లూరు' అను వ్యవహారము కనఁబడుచున్నది. 'చోళనల్లూరు,' 'ఆదిత్యనల్లూరు' మొదలైనవి ఎన్నియో. కొన్నిచోట్ల 'నల్లూరు' 'అల్లూరు'గా కూడ వ్యవహృతమే. అల్లూళ్లు కూడ అగ్రహారములే. తమిళమున అల్లమునకు నల్లమనుట కలదు. వారికికూడ అల్లమున్నది. ఆర్ద్రశబ్దభవము. (అల్లము-నల్లము, అల్లూరు-నల్లూరు). హోమధూమధూపితము లగుటచే నలుపెక్కినను నల్లిళ్లు మొదట నల్లవారికి ఒసంగఁబడి అందుచే ఆ నామధేయమును పొంది తెల్లనివైయుండియు కాలక్రమమున నల్లనివై యుండును. 'నల్లవారి'కి ధర్మవివాహము చేయించి భూములిచ్చి ఇండ్లు కట్టించి యిచ్చి వారి యిండ్లను (కుటుంబములను) నిలుపుటచేతనే (పెండ్లిచేసి వారిని ఒకొక్కరిని ఒకయింటివాండ్రనుగా చేయుట చేతనే) 'నల్లిండ్లు నిల్పుట'. మొదట ధర్మవివాహముగానుండి తర్వాత నల్లిల్లు అగ్రహారము అను వ్యవహార మేర్పడుటకు కారణమిట్లుండునని నాకు తోఁచినది.

ఆంధ్రవాఙ్మయమునందు నన్నయ తిక్కన కేతన మారనాదులు ఈ సప్తసంతానములను పేరొక్కనలేదు. తిక్కన కాలమునకు కృతిని అంకిత మందు నుత్సాహ మెంతేనియుండియు, కవులు కృతులను కన్యలనుగా పేరొక్కనియు, సప్తసంతానములలో కృతియు నొకటి యని చెప్పక పోవుట విశేషము. తిక్కన నిర్వచనోత్తరరామాయణ కృతికన్యను ఆంధ్రాచారముప్రకారము 'అల్లుని'కే సమర్పించెను. తానే కేతనను వేంగిలోని వెంటిరాలనుండి "అత్యాదరంబున రావించి ..... 'నీవు సంస్కృతాదనేకభాషాకావ్యరచనావిశారదుండవగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్కకావ్యంబు రచియించి నన్నుఁ గృతిపతిం జేయవలయు' నని సగౌరవంబుగాఁ బ్రార్థించిన" కేతనయు తన 'కావ్యకన్యకకుం దగువరుండగుట నతని మనోరథంబు సఫలంబుఁ గావింపందలంచి' కావ్య రచన కుపక్రమించెను. అంతే. మంచనయొక్కఁడే మొదట సప్తసంతానములను చెప్పినవాఁడు. ఈతని స్వస్థానమేదో స్పష్టముగా తెలియదు గాని కమ్మనాఁడు వెలనాఁడు వేంగినాడుల సంప్రదాయములలోని ప్రథానవిషయమైన సప్తసంతానములను చెప్పుటచేత దేశాచారములను చక్కఁగా ఎఱిఁగివాఁడుగా నున్నాఁడు. తిక్కననాటి కవి యున్నవే, ఆయన యేల చెప్పలేదు అనిన షష్ట్యంతములే వ్రాయని తిక్కన సప్త సంతానముల నేలచెప్పను? మఱి కేతనయో. కేతన పెద్దలది వేంగీ దేశము. నూతన సంప్రదాయములను ప్రచారమొనర్చినవాఁడుగదా, వేంగినుండి నెల్లూరికి వచ్చినవాఁడు గావున ఈగుంటూరి సంప్రదా యము నెఱుంగఁడందుమా, అట్లనుట సాధ్యపడదు. ఏలయన కవియైన వాఁడు వేఁగినుండి నెల్లూరి కేఁగుచు మార్గమున వచ్చు నగరరాజ ములలో ఒకపూటయైనను నిలువక అచ్చటి కవిచారితులను గ్రహింపక కవిపండిత గోష్ఠులలో చేరక, ఆలయాంతర్గతశాసనాదికములను పఠింపక పోయియుండఁడు. బహుశ్రుతుఁడైనందుననే షష్ట్యంతరచనావిధాన మును తిక్కనకు చూపి ఆయనమెప్పును పొందగలిగినాఁడు. మార్కం డేయపురాణకర్తయు, తిక్కన శిష్యుఁడును, తిక్కనను సోమయాజి యని

పేర్కొనిన మారనకూడ, కాకతీయరాజ్యమునకు పోయియు 'ప్రతాప రుద్రదేవసాప్రాజ్యధుర్యవినీతికరణ కుశలుఁ'డైన నాగయగన్నవిభునికి, తర్వాత అచిరకాలములోనే దేశము తురకలచేతఁబడఁగా తురకలలోగలసి 'మల్లిక్ మక్బూల్' అనుపేరుతో ఢిల్లీసుల్తానుయొక్క సేనాధిపతియై నెగడినవానికి, తనగ్రంథమును అంకితమిచ్చు సందర్భమునకూడ కృతి సత్ప్రసంతతులలో నొకటని చెప్పలేదు. ఈతఁడు తిక్కనసంప్రదాయమును వీడక షష్ఠ్యంతరచన చేసినవాఁడే. నెల్లూరివాఁడుగదా గుంటూరి పద్ధతులను ఎఱుఁగఁడని యందుమాయన్న ఎవరినిగుఱిఁచియు అట్లు చెప్పుటకులేదు. నెల్లూరినుండి ఓరుగంటికి పోవువారు నడుమ నానారాజసందర్శనములు చేయుచుండినవారే. మఱి శాసనములలో కృతిసత్ప్రసంతానములలో నొకటియని క్రీ. శ. 1130 నుండియు కనఁబడుచుండఁగా వాఙ్మయమున దానిప్రశంస ఆతర్వాత రెండువందలసంవత్సరములకా వచ్చుట యని ఆశ్చర్యము కలుగక మానదు. దీనికి కారణము ఏమిగా నుండును?

కవులు తమగ్రంథముల నంకితమిచ్చు సందర్భములలో పద్ధతులను మార్చుచు క్రొత్తపోకడలు పోవుచుండిరి. శాసనములును కావ్యములే. జనుల వ్యవహారములలో ప్రథానమైన విషయములే కావ్యములకు అనఁగా కవుల గోష్ఠిప్రసంగముల కెక్కుచుండినవి. కృతుల నంకిత మందుటయు ఆయాకృతులను సత్ప్రసంతానములలో పేర్కొనుటయు నుండినదే యని శాసనప్రామాణ్యముచే తెలియుచున్నది గాని ఒక మండలములో విశేషవ్యాప్తి గలది మఱియొక మండలమునకు క్రొత్తగా నుండెడిదని షష్ఠ్యంతముల చరిత్రమే చెప్పుచున్నదిగదా. కృతుల నంకితమందు నుత్సాహము నానాటికి అధికమగుట కనఁబడుచున్నది. తమ కర్తృతయున్నను లేకున్నను కవులకు ధనమిచ్చి కృతుల నంకితమంది భాషోద్ధారకుల మనిపించుకొను నభిలాష 'వేలంవెట్టి'గా నుండినదని మంచనయే చెప్పుచున్నాఁడు.

'బాలరసాల పుష్ప నవపల్లవకోమల కావ్యకన్యకా
గూళల కిచ్చి యప్పుడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్

హాలికులైననేమి మఱియంతకు నాయతి లేనినాఁడు కా
ద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై.'

ఈ పద్యమునే కొలఁది మార్పులతో బమ్మెరపోతన తన కాదర్శముగా గ్రహించిన ట్లున్నాఁడు. కాని మంచననాఁటికి కృతిపోషకులలో కొందఱు 'కూళ' లనియు వారిచ్చు బహుమానము 'పడుపుఁగూ' డనియు చెప్పు నంతటి బజీతు పట్టినేది కావ్యరచన. ఆ రోతనే కవి—

'అని తగనివానిదెస నా
మన మెప్పుడు రోయుఁగాన మతిమజ్జన వ
ర్ణనలకు మిగిలిన సుగుణుని
నినుఁ బొంది మదీయకవిత నెగడుం బుడమిన్.'

అని 'సుకవిస్తుతి—కుకవినింద'లను ప్రారంభించినాఁడు. మడికి సింగన సకల నీతిసమ్మతమున 'తరమెఱుఁగక కృతినిచ్చు' కవులనుగూర్చి యిట్లు తన కోపావేశమునంతయు చూపినాఁడు.

సీ. "ఘనకళాఖ్యాత కర్కశకిణ చేటికా
స్తనముల నలఁదిన చందనంబు,
నిశిత కంటకశిలా నికట మర్కటకటిఁ
జెలువార గట్టిన జేలుచేల
ప్రకటి తాసవమత్తభల్లూక మేదల
బొలుపారఁజెరిపిన పుష్పమాల
సతతపల్వలపంకసంగి లులాయంబు
నఱుతఁ బెట్టిన తారహారపంక్తి
గి. కరణిగాకున్నె సాహిత్య సరణి యెఱుఁగ
కజ్ఞు సంగతిఁ బొదలు దురాత్మకులకుఁ
గవులు తరమెఱుఁగక యిచ్చుకావ్యకన్య,
క్లేశ సంసార భవనాశ కేశవేశ."

కృతులనందు నభిలాష మిక్కుటముగా నుండినందువలనను వన నిధి తటాకాదుల ప్రతిష్ఠకన్న సులువుగా నుండుటచేతను దీనికి ప్రా ము

ఖ్యము రాసాగినది. ఈభావమునే మంచనతో ఆతని కృతిపతి చెప్పి నాఁడట—

'వన నిధి తటాక దేవభ
వనములు పుణ్యదములైన వాని ననుష్ఠిం
చినచోన కాని యెఱుఁగరు,
చనుఁగాదే సరసకవిత సకలదిశలకున్'

అట్లు పలికి 'కావున నాకు నొక్కకృతి కైకొన నిష్టము' అని స్పష్టముగా అడిగినాఁడట. తాము మాటలాడుకొనినవానినే కవి వ్రాసియుండును అనుటకు సందేహము లేదు. తిక్కన కేతన మారనల కాలమున నీ మాటలు పుట్టినట్లు కానరాదు. వననిధి తటాక దేవాలయాదుల ప్రతిష్ఠలతోకూడ కృతుల నంకితమందు నాచారము నన్నయకాలమునుండియు క్రమాభివృద్ధి నందినదిగదా. 'తన కుల బ్రాహ్మణు'నిచే అంత గొప్పగ్రంథమును వ్రాయించుకొనియు రాజరాజు దానిని 'అంకిత' మందక, అందు తన పితృ పితామహ ప్రపితామహాదుల ప్రశంస చేయించుకొనక, తనకు వంశకర్తలని తలంచిన పాండవులచరిత్రకు వట్టిశ్రోత, కాని ప్రధాన శ్రోత, గా మాత్రమే నిలిచినాఁడు. ఆతనినాటికి వన నిధి తటాక దేవాలయాదుల ప్రతిష్ఠలు జరిగినవి. కృతులును వెలువడుచుండినవి. శాసన దృష్టాంతములచే మనకు గోచరించినరీతిని ఇవి క్రమముగా పెరిగి, అభివృద్ధినంది సప్తసంతానము లైనవి. అంకితమందుట తిక్కననాటికి ఒక ఆచారముగా కుదిరిపోయినది. 'కవిత' 'కన్యగా' మాఱిపోయినది. కావు ననే సంతానమైనది. కవులు పడసిన కవితాకన్యలను 'పరిణయ' మాడుట రాజులకు ప్రశస్తికి హేతువైనది. క్రీ. శ. 1132 నాటికే కృతిసప్తసంతానములలో నొకటైన దనఁగా నన్నయభారతరచనానంతరము ఒక శతాబ్దములోపలనే ఈభావ మేర్పడియుండవలెను. కృతుల రచియింపించుచుండిరిగాని కావ్యములలో వానిని సప్తసంతతులలో చేర్చి చెప్పుట తర్వాతనే కనఁబడుచున్నది. అంతేగాదు. వననిధితటాక దేవాలయాదులే గాని కృతులమీఁది యభిలాష మొదట తక్కువగానుండి తర్వాత క్రమముగా పెరిగిన ట్లున్నది. మంచనకాలమునకు జనులవాడుకలో ఈ

మాటలు పుట్టినవి. ఆతఁడు వ్రాసెను. కవులమీఁది యాదరము వృద్ధి యైనది. ఈవిషయము విన్నకోట పెద్దననాఁటికి (1402) స్పష్టము.

'వినుతయశంబునం గలుగు విశ్రుత నాకనివాస; మయ్యశో
జననము శ్రవ్యకావ్యముల సంగతి నొప్పగు; శ్రవ్యకావ్యముం
దనరుఁ గవిప్రభావమునఁ, తత్కవిసమ్మతి లేని రాజులే
పున విహరింప; రవ్విభులు పోయినజాడ లెఱుంగఁబోలునే'

ఆ. 3-ప. 80.

'కవిసంసిద్ధపదంబు భావరసవిఖ్యాతంబు లోకోచిత
వ్యవహారంబు సుదాత్తనాయకము శ్రవ్యంబుం జతుర్వర్గ సం
భవసద్మంబును నైనకావ్యమిల నాపద్భోద్భవస్థాయియై
కవిసంస్కార్తియు దాత్మకీర్తియుఁదగం గల్పించునెల్లప్పుడున్.'

ఆ ర-ప ర

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని జైమినిభారతమున—

'ఆదట సప్తసంతతులయందును నొక్కొక్కకాలమందు వి
చ్ఛేదము గల్గు నాటేటికిఁ, జెప్ప విపర్యయమేయుగంబునఁ
లేదుకవిత్వసంతతికి, నిక్కము; తత్కవితావిలాసముల్
జాదులు నిష్టదైవము ప్రసాదము నౌ హరికీర్తనంబునన్' ఆ౧-16

కావ్యము కన్యగా తలంపఁబడి ('కావ్యాలంకరణజ్ఞ మేవ కవితా కన్యా వృణీతే స్వయమ్') సంతాన మనుభావమున కెడ మీయఁగా మిగిలిన వనినిథ్యాదు లెట్లు సంతానములలో చేరును? అను సంశయము కలుగును. పైగా చరిత్రకారునికి 'దేశమున ఈభావము ఎప్పుడు కలిగి యుండును?' అనియు జిజ్ఞాస కలుగును. 'విశ్రుతనాకనివాసా'భిలాషులు సైంధవులు. అందులకు 'వినుతయశము' ఆవశ్యకము. అది సత్కృతివలన కలుగును.

'కృతినెవ్వనినామము స
త్కృతి నెన్నిదినంబులుండు దివినాపుణ్య
వ్రతుఁడంతకాలముండును,
ధృతి నింద్రద్యుమ్ననికిని దృష్టాంతముగా'.

ఇచ్చట 'సత్కృతి' యనఁగా సత్కార్యము. కావ్యముగాదు. ఈభావ ముచే అనాదిగా దేశమందు వననిధి తటాక దేవాలయాదుల నిర్మాణము సాగుచుండినది. వీనినెల్ల భారతదేశమందు ఇష్టాపూర్తములనిరి. వీనితో కావ్యములును నిర్మితము లగుచుండినవి. కాని ఆంధ్ర దేశమందు లెనుఁగు కవులుమాత్ర మే 'భావముపల్లవింప' కవిత కన్యయగు నేనియు ఆదియు కృతియగునేనియు ఆరామాది సత్ప్రతిష్ఠలును సత్కృతులేగాన తత్ప్రతి ష్ఠాతలకు సంతానము లేయని వీనినెల్ల సప్తసంతానములని పేరొక్కన్న ట్లున్నది. ఆరామాదికృతులను సంతానమన్నను కన్యలనుగా భావింపలేదు; వానిని 'అంకిత' మందుటయు లేదు; ప్రతిష్ఠించుట మాత్ర మే కలదు. ఆపని ప్రభువులే చేయుచుండిరి. కృతి, అనఁగా కావ్యకృతి, జంగమము; స్థావరము కాదు. 'వనుగాదే సరసకవిత సకలదిశలకున్.' ప్రతిష్ఠాతను వద లని పురుషసంతానమువంటిది కాదు గాన, 'కన్య' గావున, దాతకు 'కన్యాదానఫలము'ను గ్రహీతకు 'ఆదానఫలము'ను ఇచ్చునట్టిది గావు నను కావ్యము ఉత్కృష్టసంతానమైనది. ఇట్టిభావము ఆంధ్రేతరులలో ఎచ్చటను కానరాదు. పైగా మాతులకన్యాపరిణయము ఆంధ్రాచారము. (చూ. ఏనిన్ను మామయనియెడు) ఇది నన్నయకు తరువాతినుండియే క్రమరూప మందినది. తిక్కన మారనకు తర్వాతనే కావ్యముల కెక్కినది.

నన్నెచోడుఁడును సప్తసంతానములను పేరొక్కని కృతియే ఉత్తమసంతాన మనియెను. 'అందు నుత్కృష్టసంతానంబు సత్కృతియ కా నిశ్చయించి' కృతిపతి 'అనురక్తయైన భాషాంగనఁ దక్కనేలిన మహా త్వము లోకమునం బ్రసిద్ధిగా' ప్రబంధము విస్తరించెను. ఈవిధముగా సప్తసంతానములను పేరొక్కని షష్ట్యంతరచనాపూర్వక కృతిసమర్పణ మొనరించి, అష్టాదశవర్ణనలతోడి కావ్యరచన ఆంధ్రవాఙ్మయచరిత్ర ప్రారంభదశలో ఎంతమాత్రము కానరాదు. ఇది ప్రబంధయుగమునకు దారితీయుచున్నది. ప్రబంధములన్ననో అష్టాదశవర్ణనాత్మకములు.

ఉ - ప్ర క ర ణ ము

అష్టాదశవర్ణనలు — వానిచరిత్ర

నన్నెచోడకవి తన స్రీశ స్వ్యము నిట్లు చెప్పుకొన్నాఁడు.

'ఓలిన కడచన నఱువది
నాలుగు విద్యలను నేర్పు నైసర్గికమై
వాలిన సుకవులకుం గా
కేల తరమె కృతులు సెప్ప నెవ్వరికైన్న. ఆ ౧-౪౨

అని పలికి ఈ 'నేర్పు'నకు వివరణముగా 'అది యొట్లనిన' అని అష్టాదశ వర్ణనలను పేరొక్కనేను.

'[1]వన, [2]జలకేళీ, [3]రవి, [4]శశి,
[5]తనయోదయ, [6]మంత్ర, [7]గతి, [8]రత, [9]క్షితిప, [10]ర, [11]ణాం
బునిధి, [12]మధు, [13]ఋతు, [14]పు, [15]రోద్వా
హ, [16]నగ, [17]విరహ, [18]దూత్య, వర్ణనాష్టాదశము.'ఆగ-౪౪
న. 'పరిపూర్ణంబై దశప్రాణంబుల సప్రాణంబై నవరసభావభరితంబై పట్త్రింశదలంకారాలంకృతంబై రమణీయంబైన దివ్యకథారంభంబున కభిముఖుండనై' ఆ ౧ - ౪౫.

అష్టాదశవర్ణనలను మొట్టమొదట పేరొక్కన్న యాంధ్రకవి పాల్కురికి సోమనాథుఁడు. పండితారాధ్యచరిత్రలో

'సత్కృతి యన నూత్న సంగతి దనరఁ
దొమ్మిదిరసములు దొలుకాడు, దాని
యిమ్మడి వర్ణన లెసగంగ, ద్విగుణ
మగు నలంకారము లసలారు, దాని
ద్విగుణార్థ భావముల్ దీటుకొనంగ
తేట తెనుంగున ద్విపదరచింతు'

9 రసములు; 9×2=18 వర్ణనలు; 18×2=36 అలంకారములు; 36×2=72 అర్థభావములు. ఈతనికి ముందెవ్వరును ఇట్టి జాపితా నీయలేదు. ఈ సంఖ్యనుకూడ చెప్పలేదు. తెనుఁగులో తెలిసినంతవఱకు నన్నయది భారతము ఇతిహాసముగాన అందు వీనికి ప్రస్తి లేదు. శివకవులలో తొలివాఁడు పండితారాధ్యుఁడు; ఆయనది శివతత్వసారము, మతవిషయికము. శతకమని కొందఱు. (తర్వాత పెరిగినదా?) భాస్కరుని రామాయణము ఇతిహాసము. తిక్కన నిర్వచనోత్తరరామాయణమును అంతే. రంగనాథుఁడు తనది పురాణమార్గమని తానే చెప్పుకొన్నాఁడు. కేతన మారన మంచనలు ఆంధ్రీకర్తలు. అందులో మారనది పురాణము, కేతనది పూర్తి యనువాదము, మంచన కొంత స్వతంత్రించినను కథావాజ్మయమునకు చెందినవాఁడే. పాల్కురికి సోమనాథుఁడు ప్రతాపరుద్రచక్రవర్తికాలము వాఁడు. కాకతీయులలో ప్రతాపరుద్ర నామధారి యొక్కఁడే. అతఁడే చివరివాఁడు, తురకలచే రాజ్యమును కోల్పోయినవాఁడు. కొందఱు మొదటి ప్రతాపరుద్రుఁడు రెండవ ప్రతాపరుద్రుఁడు అని వ్రాయుట పొరపాటు. ప్రతాపరుద్రయశోభూషణకర్తయైన విద్యానాథుని కీతఁడు సమకాలికుఁడగుచున్నాఁడు. ఈతని తారీఖును శ్రీనేలటూరి వేంకట రమణయ్యగారు చర్చించి క్రీ.శ. 1280-1340 అని నిర్ణయించి యున్నారు. (చూ. పాలకురికి సోమనాథుఁ డెప్పటివాఁడు. వావిళ్ల 1955) విద్యానాథుఁడును సంస్కృత సంప్రదాయమైన యష్టాదశవర్ణనలను పేర్కొన్నాఁడు.

"నగరార్ణవశైలర్తు చంద్రార్కోదయ వర్ణనం
ఉద్యాన సలిలక్రీడా మధుపాన రతోత్సవాః
విప్రలంభో వివాహశ్చ కుమారోదయ వర్ణనం
మంత్ర దూత ప్రయాణాజి నాయకాభ్యుదయా అపి
ఏతాని యత్రవర్ణ్యంతే తన్మహాకావ్యముచ్యతే
ఏషామష్టాదశానాం యైః కైశ్చిదూన మపీష్యతే."

అష్టాదశవర్ణనలతోడిది కావ్యమనునది సంస్కృత కావ్యమార్గమున క్రొత్తదికాదు. దండి కావ్యాదర్శమందు దీనికి ముందే లక్షణము వ్రాసినాఁడు.

"నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయవర్ణనైः
ఉద్యానసలిలక్రీడా మధుపానరతోత్సవైः
విప్రలంభై ర్వివాహైశ్చ కుమారోదయవర్ణనైः
మంత్ర దూత ప్రయాణాజి నాయకాభ్యుదయైరపి"

విభక్తి మార్పులే తప్ప దండిశ్లోకమే విద్యానాథుఁడు గ్రహించె ననుట స్పష్టము. సంస్కృతములో నివి యున్నను కన్నడవాఙ్మయములోగాని ఆంధ్రవాఙ్మయములోగాని పొడచూపుట కొంత తర్వాతనే. విద్యానాథుఁడు ఆంధ్రీకరణమ్యును సంస్కృతకవి, ఆలంకారికుఁడు. ఆంధ్రులు తాము 'సాంస్కృతికుల' మనియేగదా భావించుచున్నారు. అంతవఱకు, అనఁగా పదియవశతాబ్దమువఱకు, సంస్కృతమందు వ్రాయుచుండినవారు దేశిరచన ప్రారంభించి సంస్కృతమర్యాదను ఆంధ్రమున ప్రవేశపెట్టుటలో కొంత నెమ్మదిగా పనిచేసిన ట్లున్నారు. మనకు సంస్కృతవాఙ్మయమే ఒరవడి. ఈవిషయమును విన్నకోట పెద్దన (క్రీ.శ. 1402) కావ్యాలంకార చూడామణియందు విశదీకరించినాఁడు. ఉల్లాసము 9-4.

'విలస ద్భావ రసా ద్యలంకృతులచే విస్ఫారి గీర్వాణభా
షల కబ్బంబుల కెన్ని మించితనము ల్సంధిల్లు నాచందమై
వలియుం బ్రాసము నంతకగ్గలములై వ ర్తిల్లు సత్కావ్యముం
దెలుఁగంచుం జెవిఁ బెట్టలేమి యుడుపం దేఁగల్గునే మం దిలన్.'

మొదటి తెనుఁగు కావ్యములు సంస్కృతకావ్యానుకరణము లనుట స్పష్టము.

విద్యానాథునికాలమునకే ఈ యష్టాదశవర్ణనల సంప్రదాయము మన తెనుఁగురచనలలోనికి తెచ్చుకొంటివి. అందులకు పాల్కురికి సోమనాథుఁడే సాక్షి. కన్నడకావ్యములలో నీ యష్టాదశవర్ణనలలో ననేకములు ఆధోరణిలో చాలవఱకు రచితములైనను కంతోక్తముగ - మార్గ

దేశిరచనలనుగూర్చి చెప్పినట్లు - అష్టాదశవర్ణనలుగల - ఇట్టి, ఇన్ని సంఖ్యల వర్ణనలతోడికావ్యము ప్రాయుచున్నారమని ఎవరును చెప్పుకొనలేదు. వా రందఱును మార్గ దేశి కవితలనుగూర్చియు నూతన కావ్యరచనా విధానములనుగుఱించియు హెచ్చుగా ముచ్చటించినారు గాని ప్రబంధ మర్యాదలను పేరొక్కన్న వారుగారు. మఱి యీషక్కికలు తమిళవాఙ్మయమునుండి నన్నెచోడుఁడు గ్రహించియుండరాదా యని కొందఱు వాదింతురేమో. తమిళములో ఈషక్కియే కుదురలేదు. తమిళవాఙ్మయమయొక్క పోకడయే వేఱు.

ఆంధ్రవాఙ్మయము అభివృద్ధిగాంచినవిధమును, తెనుఁగువారి భావములును రచనావిధానములతీరును చూచిన నొక క్రమపరిణామము కనఁబడుచున్న దేగాని ఎచ్చటను ఒడుదొడుకులు లేవు. సంస్కృతకావ్య మర్యాదలను అనుసరించినప్పుడును, అందలి ఇతిహాసముల ననువదించినప్పుడును తెనుఁగుసంప్రదాయములను వదలక వాని కొకప్రత్యేకతయు విశిష్టతయు నుండునట్లే రచించిరి. నన్నయ ఆదికవియనియు వాగనుశాసనుఁడనియు మార్గదర్శకుఁడనియు చెప్పినారు. అది మొదలు కవిత్రయ పరంపరను పేరొక్కనసాగిరి. ఎవరును వరుసతప్పినవారు కారు. కాని ఒకటిమాత్రము స్పష్టము. నన్నయ తిక్కన ఎఱ్ఱనల నడిమి కాలమును పరిణామదశయని పేరొక్కనవలెను. సంస్కృతమున అనేకాలంకార గ్రంథములుండియు ప్రతాపరుద్రీయ రచనాకాలమునకే మనవారికి కావ్యలక్షణాదులమీఁదికి దృష్టిపోయినదనఁగా, లేదా కాకతీయ సామ్రాజ్యముయొక్క తుదిదినములనాటికి తామెఱింగిన యలంకారశాస్త్ర జ్ఞానమునంతయు సంపుటీకరింపవలెనని ఆంధ్రులకుతోఁచి తత్ఫలితముగా సంస్కృతమునసే అలంకారశాస్త్రమును రచించిరనఁగా - అప్పటికి మన కవుల కవిత్వమనెడి కాపురములు కుదురుపడి కవిత్వసౌధములకు అలంకారములును వర్ణనాదికములును ఆవశ్యకములైనవి. నెల్లూరు గుంటూరు రాజమహేంద్రవరముల కవితకు ఓరుగంటివా రిరువురు అలంకారముల తోడి వర్ణనల సంప్రదాయమును ప్రసాదించిరి. ఇరువురును సమకాలికులే;

విద్యానాథ సోమనాథులు. ఒకరు మార్గకవి, ఒకరు దేశికవి. వీరి యష్టా దశవర్ణనలచేతనే ఆంధ్రకవితాప్రాసాదము నాథవంతమైనది.

మఱియొక ప్రధాన విషయము. కేతననాటికి ఆంధ్రమునకు వ్యాకరణగ్రంథము లేదు. 'ఎందును సూత్రసంపాదన లేమిచే' అనియు 'ఆమూఁడు పర్వములలో నామాన్యుఁడు నుడువు...లరసికొని కృతుల్ ...తొంటి సుకవుల్' అనియు నీరీతిని అప్పకవి చెప్పినది సంప్రదాయము. పూర్వకవుల కావ్యములను పఠించి వానిమార్గమున కవిత చెప్పినవారే గాని మనపూర్వులు ఆయాశాస్త్రములను చదివికాదు. కేతన, తన నాటికి తెనుఁగు రచయితల కొక మార్గోపదేశిక ఆవశ్యకమని తలంచి ఆంధ్ర భాషాభూషణమను వ్యాకరణమును రచించినాఁడు. అది నాటి రచయి తల కొక మార్గోపదేశికే గాక ఆంధ్రవాఙ్మయమునకు మొట్టమొదటి వ్యాకరణము—

'మున్ను తెనుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్ప రే జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయభట్టాది కవిజనంబుల కరుణ'
'సంస్కృతప్రాకృతాది లక్షణముఁ జెప్పి
తెనుఁగునకు లక్షణముఁ జెప్పకునికి యొల్లఁ
గవిజనంబుల నేరమిగాదు, నన్ను
ధన్యుఁగావింపఁదలఁచిన తలఁపుగాని.
'క్రొత్తగ నాంధ్రభాషకును గొండొకలక్షణ మిట్లు చెప్పె.'

ఈతని కాలమునకు కవిత్వసంప్రదాయములును కొంత భిన్నములుగా నుండినవి.

'కంచి నెల్లూరు మఱి యోరుగల్లయోధ్య
యనుపురంబులమీఁద గంగకరుగుమనిన
పగిది నొకక్రోవఁజూపెద; బహు పథంబు
లాంధ్రభాషకుఁ గలవని యరసికొనుఁడు.'

విన్నకోట పెద్దనకాలమువఱకును సమగ్రాలంకారశాస్త్రమును ఆంధ్రమున నెవరును వ్రాయలేదు. ఛందస్సును వేఱుగాను, వ్యాకరణమును వేఱుగాను, అలంకారములను వేఱుగాను రసభావాదులను ప్రత్యేకించియు గ్రంథములు వ్రాయుచుండిరి. ప్రాగా సంస్కృతగ్రంథములనే ఆశ్రయించుచుండిరి. తెనుఁగులో కేతన వ్యాకరణమును, ఛందస్సు రేచనదో లేక అన్యకృతమో ప్రాచీనములు ఉండినవి. - అంతే. అలంకారరసభావాదులకు గీర్వాణశాస్త్రగ్రంథములే పఠనీయములు. కాఁబట్టియే విన్నకోట పెద్దన ఇట్లు వ్రాసినాఁడు—ఉల్లాసము 9-172.

'లలిననోన్యముఖావలోకనము లీలం జేయఁగాలేని యా
విలసత్కావ్యకళాచతుష్టయము లుర్విం బర్వ నేకస్థలిం
గలిగించెం బదవాక్యవేదియు నలంకారజ్ఞుఁడుర్వీ భూవరో
జ్జ్వల విద్యావిభవోన్నతుండు నగు విశ్వేశ్వావిభుండిమ్ములన్'

ఈకావ్యకళాచతుష్టయము అనుమాటలచేతను వర్ణనచేతను దుష్టచతుష్టయము జ్ఞప్తికివచ్చుచున్నది. పెద్దన చేసినదేమనఁగా—

'అచ్చటచ్చట నున్న కావ్యాగమముల
నొక్కచోటనె యొడఁగూర్ప నుత్సహించి'

ఆపనియేచేసినాఁడు. అంతవఱకును ఒక గ్రంథమందుఁగాని అన్యోన్యముఖావలోకనముచేయని వ్యాకరణాలంకారఛందోరసాదులను 'ఏకస్థలిం గలిగించెఁ.'

కావ్యముంగూర్చి పెద్దన—ఉ. 3 - ప. 037.

'ఇటు లష్టాదశవర్ణనాకలితమై యేపారు కావ్యంబు నం
తటఁ బాటించి తదర్థ సంఘటనముం దర్కించి భావోదయ
స్ఫుట భేదంబు లెఱింగి తద్రసగతుల్ శోధించి యచ్చంపుమె
చ్చటకుం దావలమై చళుక్యపతి సంశోభిల్లు నెల్లప్పుడున్'

'ఇత్తెఱఁగున నష్టాదశ
వృత్తం బగు కావ్యమొప్ప విరచింపఁ దగున్
మొత్తమగు నఖిల బల సం
పత్తియుఁగల వేళ సుకవి ప్రతిభదలిర్పన్.'

ఇట్లు అష్టాదశవర్ణనలతోడి కావ్యరచనాపద్ధతి, షష్ట్యంతాది కృతి సమర్పణ విధానాదికములతో కూడినది, బొత్తిగా తమిళమునఁగాని ప్రాకృతమునఁగాని కన్నడమునఁగాని లేనిది, తెనుఁగున పరిపూర్ణమైన కావ్యమునందుఁగాని కానరానిది నన్నయకుపూర్వమో లేక తిక్కనకు పూర్వమో ఆంధ్రవాఙ్మయమునందు కుదురుకొని నన్నెచోడునిచే ఆచరింపఁబడినదనుట ఎంతమాత్రము విశ్వసనీయముగా కనఁబడుట లేదు. నన్నయను దయఁదలఁచి క్షమించినను తిక్కన కేతన మారన మంచనలలో ఒక్కఁడైనను నన్నెచోడుని ఎఱుఁగఁడా? లేక ఎఱిఁగి దాఁచె ననువారి వాదము నంగీకరించినను నన్నెచోడుని దాఁపనగునుగాని ఆతఁడు చూపిన కవితారీతిని, నూతనషక్కికలను దాఁపనగునా? అవి దాఁగునట్టివా? షష్ట్యంతములను రచించి సప్తసంతానములను పేర్కొన్నవారేల అష్టాదశవర్ణనలను చెప్పరు, చేయరు? పోనిండు, ఇట్లు తర్వాత రచించినవారైనను మార్గదర్శకునిగా నన్నెచోడు నేల పేర్కొనరైరి? ఒక్కటే కారణము—అతఁడు మార్గదర్శకుఁడుకాఁడు కాఁబట్టి. ఆతని కుమారసంభవము సప్తసంతానప్రశంసాపూర్వక, షష్ట్యంతరచనాయుత, వర్ణనాష్టాదశాత్మక, కుకవి కుపతి నిందా సుకవి సుపతి ప్రశంసాపూర్వక కావ్యరచనాసంప్రదాయము చక్కఁగా నెలకొన్నతర్వాత వెలువడిన ప్రబంధముగాని తత్పూర్వముది ఎంతమాత్రము కాదు. ఈవిషయము ఈతని 'కృతిప్రారంభకర్తవ్యంబుల' పరిశీలించిన ఇంకను స్ఫుటమగును.

---

౭ - ప్ర క ర ణ ము

కృతిప్రారంభకర్తవ్యములు

అంకితమిచ్చు అనఁగా కృతిసమర్పించు విధానములలోని ప్రధా
నాంశముల చర్చయైనదిగాని రచనావిధానమున కొన్ని సంప్రదాయ
ములు మనకు కుదిరియున్నవానిని చర్చింతము. ఏకృతికైనను ఇష్టదేవతా
ప్రార్థన ముండితీరవలెను. తర్వాత పూర్వకవి స్తుత్యాదులు. ఇష్టదేవతా
ప్రార్థన నన్నయలోనున్నదిగాని ఒక్క శ్లోకములోనే శ్రీవాణీగిరిజలను
పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరులను స్తుతించినాఁడు గాని పూర్వకవి
స్తుతిచేయలేదు. తిక్కనయు 'శ్రీరాస్తాం మనుమతీతీశ్వర భుజాస్తమ్భే'
అను శ్లోకములోనే మనుమసిద్ధిని ఆశీర్వదించి 'హరిహరపద్మగర్భులను
నాదికవీంద్రుల నూత్నసత్కవీశ్వరులను భక్తిఁగొల్చి తగవారికృపం
గవితావిలాస విస్తర మహనీయుఁడైన' తన్ను గుఱించి చెప్పుకొని,
వెంటనే అనంతరకార్యమైన కృతిరచనాకారణాదులను చెప్పఁ బ్రారం
భించినాఁడు. నన్నయపే రెత్తలేదు. ఈరచన భారతమునాఁటికి పెద్దపెరిగి,
'శ్రీయనగౌరినాఁ బరగు' పద్యముతోడి సకలబ్రహ్మ ప్రార్థనమై స్వప్న
వృత్తాంతమునకు దారితీసినది. భారతాంధ్రీకరణము గావునను నన్నయ
కృతికి పూరణము గావునను నన్నయప్రశంస అపరిహార్యమైనది. కాని
నూతనమార్గమున ఒక్కొక్కదైవమున కొకొక్కటిగా అనేక పద్య
ములు వ్రాసి దాదాఁపు ఎనిమిది తొమ్మిదిమంది దేవతలను స్తుతించిన
మొదటికవి కేతన. ఇతని మొదటిపద్యము విష్ణుస్తుతి, రెండవది శంకర
స్తుతి, మూఁడవది బ్రహ్మనుగూర్చినది, నాల్గవది సూర్యునిది, ఐదవది
వినాయకునిది, తర్వాత షణ్ముఖ మన్మథ భైరవులవి - మొత్తము ఎనిమిది.
ఈతఁడు నన్నయ పే రెత్తలేదుగాని 'ప్రాక్తన సుకవుల నియమాత్యక్తుల
వాల్మీకి కాళిదాసులఁ గొలిచి'నాఁడు. మారన మార్కండేయపురాణ
ములో కేతనవలెనే వరుసగా విష్ణు శివ బ్రహ్మ విష్వక్సేన సరస్వతీస్తోత్ర

ములుచేసి నన్నయ నొక పద్యమున తిక్కన నొకపద్యమున స్తుతించి నాఁడు. 'పూర్వ'కవులలో వ్యాసవాల్మీకులను నన్నయ స్తుతికి ముందు రెండు పద్యములలో స్తుతించినాఁడు. కాళిదాసును వదలినాఁడు. మఱి మంచన మితభాషి కాఁబోలు వీని నన్నింటిని కలిపి కృతిప్రారంభకర్తవ్యం బులని వేరొక్కని మూఁడు పద్యములలో, మొదటిదాన శ్రీని, రెండవ దాన

"కరిముఖుఁ డశ్వినుల్ శ్రుతులు కంజసముద్భవుమోము లంబికే
శ్వరు మొగములో తదాత్మజుని వక్త్రము లాదిమునీంద్రమండలం
బురగపతుల్ గ్రహంబులు పయోరుహనాభుఁడు తారకంబులుం
బొరిఁబొరి నెల్ల సంపదలు' పోలమగుండని కిచ్చుగావుతన్."

అని పెక్కుదేవతలను, మూఁడవపద్యమున

"శ్రవణానందనభారతీ చతురునిం బ్రాచేతసుం దివ్య స
త్కవతీ నందనుఁ గాళిదాసుఁ గృతికర్తగొల్చి వాక్పూర్ణ మే
రువులన్ నన్నయభట్టుఁ దిక్కకవిచంద్రుల్ భక్తితోఁగొల్చి యు
ద్ధవ చాణక్య యుగంధరాది నయవిద్యాకోవిదధ్యానినై."

అని నయవిద్యాకోవిదులను అధికముగా చేర్చుకొన్నాఁడు. ఇట్లు చూచుచురాఁగా పద్యముల పెరుగుదల కనఁబడుచున్నది. మంచనకాల మున కీసంప్రదాయములు రూపొంది అవశ్యాచరణీయము లైనందున నాతఁడు మొదటి మూఁడుపద్యములైన వెంటనే 'ఇట్లు కృతిప్రారంభ కర్తవ్యంబు లాచరించియున్న వాని' అని చెప్పినాఁడు.

ఒకవిశేషము. నన్నయ 'శ్రీవాణీగిరిజా' శ్లోకమువ్రాసి వెను వెంటనే రాజరాజనరేంద్రుని ప్రశంసించి తాను భారతరచన గావించు టకుగల కారణంబులనుచెప్పి తర్వాత 'హరిహరాజా'ది స్తుతులను వ్రాసి నాఁడు. కేతనాదులు ప్రత్యేకపద్యములలో స్తుతించినవారిని ఒకపం క్తి లోనే 'హరి హ రాజ గజాన నార్క షడాస్య మాతృ సరస్వతీ గిరి సుతాదిక దేవతాతతికిఁ నమస్కృతిసేసి' తర్వాత వాల్మీకి వ్యాసులను స్తుతించి, సామాన్యముగా సమకాలికులను గాఁబోలు కొనియాడినాఁడు.

'పరమవివేకసారభవిభాసిత సద్గుణపుంజవారిజో
త్కరరుచిరంబులై సకలగమ్య సుతీర్థములై మహామనో
హర సుచరిత్రపావనపయఃపరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ముదంబొనరంగొనియాడి వేడుక.'

ఈపద్యము ఎవరినుద్దేశించిదో తెలియుటలేదు. ఆంధ్రదేశమునుగుఱించిదో కాక సకలభారతదేశము నుద్దేశించిదో. కొంత స్పష్టముగా నుండిన చరిత్రకు చాల సహాయకారిగా నుండియుండెడిది. ఈపద్ధతిని తర్వాతివా రెవరును ఇట్టిక్రమమున వ్రాయలేదు.

పైస్తుత్యాదికములైన తర్వాత కృతిప్రస్తావమును కృతిపతి ప్రశంసయు అందులో నంతర్భూతముగా కవిప్రశంసయు, ఇందులోనే కృతిపతి ప్రశంసకుముందు కృతిప్రస్తావనానంతరమో ముందో సుకవిస్తుతి, కుకవినింద, కవితాఘణితులనుగూర్చిన సల్లాపమును క్రమముగా వెరిగినవి. కుకవినింద తిక్కనలో నున్నది, కేతనలో లేదు. మారన మంచనలు చేయలేదు గాని ఒకవిధముగా మంచన 'బాలరసాల' పద్యమున కుకవినింద కలసియున్నదనియే చెప్పవచ్చును. ఎఱ్ఱన నృసింహపురాణమున కుకవి నిరసనము కానరాదు. మరల తర్వాతికవులలో నున్నది.

కాని ఇదియొక నియతమైనదిగా కానరాదు. ఇందుల కొక క్రమము ఈపరిణామకాలమున నింకను కుదిరినట్లు లేదు. కేతన ఆంధ్రభాషాభూషణములో నిట్లు వ్రాసినాడు—

"గుణదోషంబులెఱిఁగి 'యిది
గుణ' 'మిదిదోష'మని పూజగొందురు సుకవుల్,
గుణదోషము లెఱుఁగక దు
ర్గుణములె గుణములని పూజగొందురు కుకవుల్"

కాని యిది కృత్యాది కుకవి నిందవంటిగాలేదు. తిక్కననే బరవడిగా గొనినవారుగాన తర్వాతి కవులు మొదటలేనివానిని సుకవిస్తుతి కుకవినిందలను నిర్వచనోత్తరరామాయణమునుండియు షష్ట్యంతాది కృత్యంకిత పద్ధతులను విరాటపర్వమునుండియు గ్రహించినట్లున్నారు.

ఈవిధముగా చూచిన నన్నెచోడుని కృత్యాది సకలావయవ సంపూర్ణమైయున్నది.

కన్నడకావ్యములలోను ప్రాకృతకావ్యములలోను ఇష్టదేవతా స్తుత్యాదికములనుండి కుకవినిందాదికముల వఱకును కలదుగాని వాని పద్ధతియు వరుసయు వేఱు. మన్మథస్తుతి ప్రాకృతకావ్యములలో నున్నది. క్రీ. శ. ఎనిమిదవ శతాబ్దియారంభమున వెలువడిన 'గౌడవహ' (గౌడ వధ) మను ప్రాకృతకావ్యమునందలి కృత్యాది చాలదీర్ఘమును బహు విషయములతో కూడినదియు. దీనికర్త భవభూతి శిష్యుఁడైన వాక్పతి రాజదేవుఁడు, క్షత్రియుఁడు. ఇష్టదేవతాస్తుతిలో అఱువదియొక్క శ్లోకములలో బ్రహ్మ, హరి, నరసింహ, మహావీర, వామన, కూర్మ, మోహినీ, కృష్ణ, బలభద్ర, బల+కృష్ణ (బలరామకృష్ణ)మధుమథన (మధుసూదన) శివ, గౌరీ, సరస్వతీ, చంద్ర, సూర్య, ఆహివరాహ, గణపతి, లక్ష్మి, కామ గంగాదిదేవతలను స్తుతించినాఁడు. తర్వాత ముప్పదియేడు శ్లోకములలో కవిప్రశంస యొనర్చినాఁడు—సుకవిపద్ధతి కుకవిపద్ధతులు కలవు.

"బహుఓ సామణ్ణ మఇత్తణేణ తాణం పరిగ్గహో లోఓ
కామం గయాపసిద్ధిం సామణ్ణ కయీ అఉచ్చేయ" 75
(బహుఃసామాన్యమతిత్వేన తేషాం సామాన్యకవీనాం పరిగ్రాహ్యలోకః
కామం గతాఃప్రసిద్ధిం సామాన్యకవయఃఅతఏవ)

"కిం అణ్ణమణ్ణ మణేహిం తావ సుక ఈహిం సిక్ఖియా వాయా
జాయం ణీసామణ్ణాణ తాణ మూయత్తణం జావ." 88
(కిం అన్యమనోభిఃతావత్ సుకవిభిఃశిక్షితావాక్
జాతం నిస్సామాన్యానాంతేషాం మూకత్వం యావత్.)

ఈవిధముగా నెన్ని యోవిషయములు అధ్యాయముల తరబడి గలవు. ఇట్లే కన్నడకావ్యములలోను సుకవిస్తుతి కుకవినిందాదులు. ప్రాకృత కన్నడకావ్యములలో కనఁబడు కొన్ని సామ్యములకు కారణ మేమనఁగా వా రుభయులు చాలవఱకు జైనులు. ఇవన్నియు జైనసంప్ర

దాయములు. ప్రాకృతగ్రంథములనే అప్పుడప్పుడు వారు కన్నడమున కనువదించుటయు నొక కారణము.

కాని తెనుఁగుప్రబంధములలోనికి ఇవి వచ్చినవిధమును తెనుఁగు కావ్యములు వర్ధిల్లినవిధమును చూడఁగా ఆంధ్రదేశీయమైన క్రమపరిణామము కనఁబడుచున్నది. కారణము నన్నయకాలమునకు జైనమతము ఆంధ్రదేశమును వీడిపోయినది. వైదిక, లేక, జైనేతరసంప్రదాయము ప్రారంభమైనది. విమలాదిత్యుఁడే కడపటి జైనప్రభువు (క్రీ. శ. 1019). రాజరాజనరేంద్రుఁడు మాతామహుని మతమైన శైవమును పూని నాఁడు. క్రీ. శ. 1033 నాటికి కన్నడదేశమునకూడ శైవము ప్రవేశించినది. క్రమముగా ఆంధ్రకర్ణాటకములలో మార్పు కనఁబడసాగినది. ఆంధ్రదేశమున జైనకావ్యములు అసలులేనట్లే. మతము తుఱిఁంచుటతో తత్పూర్వము జనులు తాము చూచుచుండిన ఆకొద్ది జైనగ్రంథములనుకూడ చూచుటమానిరి. కవితారీతులు నూతనమార్గములఁ ద్రొక్కినవి. ఇట్లు ఏర్పడిన పూర్తి తెలుఁగుసంప్రదాయము నన్నెచోడుని కృత్యాదియందు కనఁబడుచున్నది. అంతయు తెలుఁగుకవుల మార్గమే. కేతనవలెనే ఈతఁడును మన్మథస్తుతి చేసినాఁడు. కేతనది వట్టియూచారము జరుపుట; ఈతని గ్రంథమందన్నచో మన్మథుఁ డొక కథాపాత్రము. కారణమేదైనను ఇరువురును చేసినారు. 'జానుతెనుఁగు', 'మార్గ-దేశి' కవిత మొదలగు విషయములనుగుఱించి తెలంగాణప్రాంతకవులే వ్రాసిరి. తీరాంధ్రకావ్యకర్తలు వ్రాయలేదు. పైగా గుంటూరుమండలమునకును కాకతీయరాజ్యమునకును సంబంధము సన్నిహితతరము. అందుచేతనే సప్తసంతానాదిభావములు గుంటూరు తెలంగాణా ప్రాంతములలోనే కనఁబడుచున్నవి. నన్నెచోడుని అడుగుజాడలు ఈమధ్యదేశమందు కనఁబడుచున్నవి. తెలంగాణసమీప రాయలసీమయందును కలవు. పాకనాటియందును గలవు. కృత్యాదినిర్ణయము విషయమునను కావ్యనిర్ణయము విషయమునను అష్టాదశవర్ణనలతోడి ప్రబంధనిర్మాణమునను కన్నడకావ్యములతో అక్కడక్కడ కొద్ది సామ్యము కుదిరినను ఈ ప్రత్యేకమగు

కుదిరిక (Setting) తెలుఁగువారిదే యనక తప్పదు. అన్నిటినిమించి సానఁ దీర్చిన రత్నమువలె ఈతని కృతాశ్వాదిసర్వాంగసుందరము.

ఈకవి తనమహిమను వర్ణించుకొనుటలోకూడ తర్వాతికవులవలె తనగొప్ప చెప్పుకొనినాఁడు. ఇది నాటకములలోని సూత్రధారులు చేయు ఆత్మోత్కర్షలవంటిదగునో కాదోగాని ఈతనిలో కొంత బొడ్డితన్యము కనఁబడుచున్నది. కేతన తన తప్పులు సైరింపుఁడని ప్రార్థించినాఁడు. ఎఱ్ఱనకూడ వినయము చూపినాఁడు. 'కతిపయాక్షరపరిచయ సహజన్నైజ చాపలంబున', 'క్రొంచము నావలకూయుభంగి' ఇత్యాది. అట్టి దేదియు నితనియందు కానరాదు. ఇతరులవలెనే ఈతఁడు ఇష్టదేవతా ప్రార్థన మొనరించి, గురుస్తుత్యనంతరము పురాణకవిసంఘమును స్తుతించి మార్గకవులను స్తుతించితినని చెప్పుటలో పైవారిపేర్లు నిచ్చినాఁడు గాని దేశిసత్కవులపేళ్లు నీయలేదు. ఎవరాకవులు? తెలిసికొనుట కవకాశములు లేవు. కేతన దశకుమారచరిత్రలో నన్నయను పేరొక్కనలేదుగాని ఆంధ్రభాషాభూషణములో పేరొక్కన్నాఁడు. కాఁబట్టి ఎఱ్ఱిగియు ఏలకో వదలినాఁడు. తిక్కనకు సమకాలికుఁడును తిక్కన భారతమునకుముందే దశకుమారచరిత్ర వ్రాసినవాఁడునుగాన కేతన, నన్నయ తిక్కనాదుల పూర్వకవులనుగా స్తుతించు సంప్రదాయమునకు చాల ముందువాఁడు. సమకాలి కాశ్రితుఁడుగా గదా తిక్కన నీతఁడు స్తుతించినాఁడు. ఒకవేళ నన్నయను తిక్కన పేరొక్కన్న తర్వాతనే యీతఁడును పేరొక్కనియుండునా? ఏమో! అప్పటికి ఆంధ్రభాషాభూషణము తిక్కన భారతాంధ్రీకరణమునకు తర్వాతిదా? తెలియదు. దశకుమారమునకు స్పష్టముగా తర్వాతిది. తిక్కనకు తర్వాత 'కవిదర్వయ' స్తుతియుండినది. మారన మంచనలు చేసినారుగదా. వీ రెవ్వరును కేతనను, ప్రామాణికుఁడు కాఁడని కాఁబోలు, తిక్కన మెచ్చిన కవియైనను, స్మరింపలేదు. భారత రచయిత కాఁడనియా? స్వయము ప్రామాణికుఁడైనందుననో భారతశేషపూరకుఁడైనందుచేతనో, ఎఱ్ఱన, కవిత్రయములోచేరి ప్రమాణపదవి నందినాఁడు. ఆతనితర్వాత కవిదర్వయప్రశస్తి కవిత్రయప్రశస్తిగా మారినది. నన్నయ

తిక్కన ఎఱ్ఱనలకు నడుమ కవులుండిరను ఏకవిగాని పూర్వకవిస్తుతిలో వీరి నడుమ నెవరినిగాని పేర్కొనక తర్వాతనే ఎవరినైన పేర్కొనుచుండెను. నన్నెచోడుఁడు ఒక్క తెనుఁగుకవినిగాని పేర్కొనకపోవుటచే నీతఁడు చాల ప్రాచీనుఁడని పండితులు తలంచిరి. ఈచర్చవలన, శ్రీవీరేశలింగము పంతులవారు ఒకానొకసందర్భమున నూహించినట్లు గ్రంథపాత మేదైన కలిగి నన్నయ తిక్కనాదులంగూర్చిన పద్యములు పోయినవా యను శంకకు అవకాశము కలదని తోఁచుచున్నది.

మఱి ఇంతవఱకు చేసిన చర్చచే నన్నెచోడమహాకవి ఆంధ్రవాఙ్మయములో పురాణకవితాకాలమువాఁడు కాఁడనియు తర్వాతివాఁడనియు తిక్కన కేతన మారన మంచనల కనంతరుఁడుగా కనఁబడుచున్నాఁడనియు తేలినది. కవితావిమర్శకు కాలనిర్ణయము సహాయకారియై విమర్శకుని శ్రమను తగ్గించుచు కార్యమును సుకరముచేయును గాన నీతనికాలమును ఇంకను దృఢముగా నిర్ణయించుట కవకాశముకలదా యని యాలోచించిన నీతనిలో నొకవిశేషము కనఁబడుచున్నది. అది చిత్రబంధకవిత్వము. ఈబంధములంగూర్చి చర్చచేసి నన్నెచోడుఁడు నన్నయకు సమకాలికుఁడగునని శ్రీదేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు ఒకగ్రంథమును ప్రకటించియున్నారు. కాని అంకిత సంప్రదాయమును షష్ఠ్యంత సప్తసంతానాదికముల చరిత్రమును కృత్యాద్యవతారికల రచన లభివృద్ధియైన తీరును పరికించినట్లు చిత్రబంధకవిత్వము లాంధ్రవాఙ్మయమున నెప్పుడు ప్రారంభమై వర్ధిల్లినవో తెలిసికొనిన ఈతఁడు తప్పక తిక్కనకు అనంతరము రావలసినవాఁడే; చూతము.

ఠ - ప్ర క ర ణ ము.

తెనుఁగులో చిత్రబంధకవిత్వములు

'పరఁగ సువర్ణబంధ మృదుభావముగల్గియు లోసుచూడఁగా
బొరపగు చిత్రరూపమును బోలె నసత్కవికావ్య మిమ్మహిఁ
బరఁగు సువర్ణబంధమృదుభావ విశేషములొప్పు దెల్విలఁ
సరియగు రత్నపుత్రికయు సత్కవికావ్యము నొక్కరూపమై'

అని నన్నెచోడుఁడు తన కావ్యమునే ప్రశంసించుకొన్నాఁడు. 'అసత్కవికావ్యము చక్కని వర్ణముల కూర్పుచే నమరిన మృదుభావము గలదయ్యును తఱచి లోఁతు చూడఁగా వేఱువిధముగా కనఁబడు చిత్రరూపమువలె నుండును. పైకి మంచిరంగుల కూర్పుండినను పగులఁగొట్టి చూచిన మట్టిచే చేయఁబడినదై నిరుపయోగమగును. సత్కవికావ్యము చక్కని పదములకూర్పుచే నమరిన మృదుభావవిశేషములవలని సుగుణములచే బంగారముతో కూర్పఁబడి చక్కఁగా నిర్మితమైన రత్నపాంచాలికవలె మనోహరముగా నుండును.' అని కవియొక్క భావము. ఇందు చిత్రబంధకవిత్వముల కేమాత్రము ధ్వనికలదో తెలియదుగాని గ్రంథారంభమున పండ్రెండవ యాశ్వాసమున నీతఁడు చక్రబంధము, చతుర్విధ కందము, కందగర్భవృత్తము, నాగబంధము, గోమూత్రికాబంధము మొదలైన బంధకవిత్వవిశేషములను చేసియున్నాఁడు. ఆంధ్రవాఙ్మయములో కావ్యములలోగాని శాసనములలోగాని ఇట్టిరచన ప్రాచీనులెవరును చేయలేదు. పండితులే ఒప్పుకొనియున్నారు. శ్రీనిడుదవోలు వేంకటరావుగారు వావిళ్ల వారి కుమారసంభవ ద్వితీయముద్రణమునకు పీఠికప్రాయుచు అందు 'వాఙ్మయమునఁ దొలుత బంధకవితను, గర్భకవితను, చిత్రకవితను, ప్రవేశపెట్టినవాఁడు నన్నెచోడుఁడు' అనియు, 'కావ్యాలంకారచూడామణి, కావ్యాలంకారసంగ్రహము, అప్పకవీయము మొదలగు నాలంకారిక లక్షణగ్రంథములయం దీబంధకవిత

ప్రస్తావ మున్నది. తరువాతి ప్రబంధకవులు దీని నభివృద్ధిచేసిరి' అనియు, శ్రీవంగూరివారి యాంధ్రవాఙ్మయచరిత్ర ద్వితీయముద్రణానుబంధము లలో 'చిత్రబంధ కవిత్వము నన్నెచోడునినాటినుండియు వెలసినది. భారతకవులు - శ్రీనాథయుగమునాటి కవులు - దీనిని చేపట్టలేదు. క్రీ.శ. 16 వ శతాబ్దినుండియు ఈకవిత విస్తరిల్లినది.' అనియు, వ్రాసియున్నారు. ఆంధ్రవాఙ్మయమున చాల తర్వాత వెలసినది ఈకవితాపద్ధతి యనుట నిశ్చితమే యైనను నన్నెచోడుఁడు ప్రాచీనుఁడనుభ్రమచే ఆతఁడవలం బించిన కవితాపద్ధతిని మధ్యకవులు చేపట్టలేదని యభిప్రాయపడుచున్నారు. కాని నన్నెచోడుని గ్రంథమే ప్రస్తుత విమర్శలోనిది గావున దాని నటుంచి, ఆతనికాలము నిశ్చితమైనదని తలంపక - న్యాయస్థానములోని నిందితునివలె, సకలవిషయ సమాకలనపూర్వకముగా నొకయభిప్రాయ మును కుదుర్చుకొనుటకొఱకు ఆతని విషయమును కొంతసేపు స్మరింపక, - ఆంధ్రవాఙ్మయములో చిత్రబంధాదికవిత్వముల పుట్టుపూర్వోత్తరముల నరయుదము.

నన్నయ తిక్కయ కేతయ మారయ మంచయలలో ఈరీతులు కానరావు. శివకవులకు - అనఁగా పండితారాధ్య పాల్కురికి సోమనాథు లకు - అట్టి రచనకు అవకాశమే లేదు. మఱి క్రీ. శ. 1402 లో వెలసిన కావ్యాలంకారచూడామణిలో బంధాది కవిత్వములకు లక్షణమున్నది. కాని అంతకుముం దేకవియు రచించినట్లు గ్రంథసాక్ష్యము దొరకలేదు. పోనిండు. తత్పూర్వపు ఛందోగ్రంథములలో నుండునా యన్న కవిజనా శ్రయ మొక్కటేగదా యున్నది. జయదేవ గోకర్ణాదుల గ్రంథములు కనఁబడవు. కవిజనాశ్రయమున బంధచిత్రకవిత్వములు లేవు. వట్టి 'సాఫీ' కవిత్వమునకుమాత్ర మే లక్షణమున్నది. కావ్యాలంకారచూడామణి కాముఁడు లక్షణము లొసంగినందున ఆతనికాలమున కిది వాడుకకు వచ్చి నదిగాని వాఙ్మయమున కవులు ఈకవిత్వమున కింకను తగిన సదవకాశ ములను కల్పించుకొనలేదని తోఁచుచున్నది. ఒకానొకసందర్భమున శ్రీ జయంతి రామయ్యపంతులుగా రిట్లు వ్రాసినారు. "లక్ష్యములనుబట్టి

లక్షణమేర్పడుట శాస్త్రసంప్రదాయమనుట నిర్వివాదాంశమే. కాని యాలక్షణమున కాధారములయిన లక్ష్యము లేవియైయుండు ననునది మిక్కిలి జాగరూకతతోఁ బరిశీలింపవలసిన విషయము. ఏదియో యొక్క పద్యమునుబట్టి లక్షణకర్తలు లక్షణ మేర్పఱచియుందురనుట సాహసము. సుప్రతిష్ఠితమైన లక్ష్యసంప్రదాయ మేర్పడియుండినగాని యది లక్షణమున కాధారము కానేరదు." [కవిజనాశ్రయము పీఠిక. ద్వి. ముద్రణ.] దీనింబట్టి ఏదియో చక్కనిరచనయే తత్పూర్వ ముండియుండ వలయునని తలంచుట సమంజసమేగదా. మఱి నన్నెచోడు డందుమా యన్న ఆతనిమాట విమర్శచివర.

మన తెలుఁగుప్రబంధములలో వెదకిన మొట్టమొదట ఇట్టి విచిత్ర రచన చేసినవాఁడుగా ప్రసిద్ధుఁడు జక్కనతాత పెద్దయ. ఈతని రచన లేవియు కానరావు గాని ఈతనింగూర్చి జక్కనయే తన విక్రమార్క చరిత్రమున నిట్లు వ్రాసినాఁడు. సీసమాలిక—

"సంస్కృతప్రాకృత శౌరసేన్యాదుల
ఘటికలో నొక శతకంబుఁ జెప్పఁ
బ్రహసన ప్రకరణ భాణాది బహువిధ
రూపకంబులయందు రూఢి మెఱయఁ
జక్ర చతుర్భద్ర చతురుత్తరాధిక
క్షుద్ర కావ్యములు పెక్కులు రచింప
నాంధ్ర కవిత్వంబునందుఁ బ్రబంధంబు
మేలునా దజ్జులు మెచ్చుఁజెప్ప
నిమ్ముల నేరీతి నేథాతువుల నేమి
రసమునన్నైన వర్ణనము నేయ
సరి యేకసంధా, ద్విసంధా త్రిసంధల
దొడరినఁ బొరిఁబొరిఁ గడవఁ జదువ
నెవ్వఁ డేయవధాన మెఱుఁగు నయ్యవధాన
మున వాని కించుక ముల్లుసూప

వృత్తకందముఁ గంద వృత్తంబునుం జతు
ష్కందంబు మొదలుగాఁ గలుగు గర్భ
కావ్యవర్ణముఁ జెప్పఁగాఁ బ్రబంధంబులు
గ్రొత్తలు పుట్టించుకొని లిఖింపఁ
గా, నక్షరచ్యుతకంబు మాత్రాచ్యుత
కంబు బంధచ్యుతకంబు నామ
గోప్యంబులుం గ్రియాగోప్యంబులును భావ
గోప్యంబులుం జెప్ప గోష్ఠియందుఁ
బద్యంబు గీతికార్భటి నొగిఁ జదువంగ,
నెల్లవిద్యల సంచు లెఱుఁగనేర్తు
ననుచు నెల్లూరి తిరుకాళమనుజవిభుని
సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెరసి
మహిమగాంచిన పెద్దయామాత్య సుకవి
మనుమఁడవునీవు నీవంశమ యొప్పు."

తమ రెడ్డిరాజులచరిత్రమున (History of the Reddy Kingdoms, Andhra University) శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఈ పెద్దయకాలమును చక్కఁగా నిర్ణయించియున్నారు. పెద్దయామాత్యుఁడు నెల్లూరి తిరుకాళమనుజవిభుని సమ్ముఖమ్మున నుండినవాఁడు. తిరుకాళరాజులు ఇరువు రుండిరి. మొదటివాఁడు తిక్కనకు ప్రభువైన రెండవ మనుమసిద్ధికి తండ్రి చోడతిక్కరాజు. రెండవవాఁడు ఈ రెండవ మనుమసిద్ధి కొమారుఁడు, మొదటి చోడతిక్కరాజునకు మనుమఁడు. ఈతఁడు పదుమూఁడవ శతాబ్ది చివరికాలమువాఁడు. జక్కన తాతయైన పెద్దయామాత్యుఁడు ఈరెండవ తిక్కరాజుకాలమువాఁడని శ్రీశర్మగారి యభిప్రాయము. ఎట్లనఁగా—జక్కన పోషకుఁడైన సిద్ధనతాత, సిద్ధన, సూరన సోమయాజికి పౌత్రుఁడట. పైగా నీతఁడు 'నన్నయగంధవారణు'నికి ప్రథానియట. ఈనన్నయ గంధవారణుఁ డెవఁడో తెలిసిన తాత సిద్ధనకాలము తెలియును. అప్పుడు పెద్దయకాలమును అదే యగును.

కేతన దశకుమారచరిత్రమున తిక్కన సోమయాజి వెదతండ్రియైన సిద్ధన కుమారుఁడు బాచన నన్ననగంధవారణుఁ డని యున్నది.

"ఉరవడి నుగ్రసేవణపడోనిధి బాడబవహ్ని చాడ్పునఁ
దరికొని, కుంభజన్మక్రియఁ ద్రాఁగి, రఘుకీర్తినాథుమాడ్కి న
చ్చెరువుగ నింకఁజేసెనని చెప్పు జనప్రకరంబు విక్రమా
భరణుని సిద్ధనార్యసుతు బాచని నన్ననగంధవారణున్"

ఇందలి నన్నయ చోడతిక్కరాజు మంత్రియైన త్రిపురాంతకుని తండ్రియై యుండునని తోఁచుచున్నది. మఱి యీతఁడు పై తాతసిద్ధన ప్రధానికి సంబంధించినవాఁడు కాఁడు. ఆతనికాలము అంత వెనుకకుపోవుటకు లేదు. నెల్లూరి చోడవంశమువాఁడుగా నుండునేమో, ఒక నానెదేవ మహారాజు శక 1197 వ వత్సర శాసనమున నొకదాన కనఁబడు చున్నాఁడు. ఈనానెదేవ లేక నన్నెదేవమహారాజే సిద్ధనామాత్యుని ప్రభువైన నన్నయగంధవారణుని నన్నయ. రెండవ తిక్కరాజు కాలము సుమారు 1285 మొదలు తరమునకు ముప్పదియేండ్లు లెక్కించుచు వచ్చిన 1375 క్రీ. శ.గా వచ్చును. ఇది జక్కనయొక్కయు ఆతని పోషకునియొక్కయు కాలముగా గ్రహింపవచ్చును - అని.

శ్రీశర్మగారు జక్కన తాతకాలమును తర్కించుచు మరెచ్చటను ఇంతవఱకును విసరాని యొక క్రొత్త నన్నెదేవుని నామధేయమును మన చెవిలో వేసినారు. ఈ నన్నెదేవునిగుఱించి వా రింకనేమియు వ్రాయ లేదు. కుమారసంభవ కావ్యకర్తయు వేంకణాదిత్య బిరుదాంకితుఁడును పాకనాటియందిరువదియొక్క వేయిటి కధీశుఁడునునైన మన నన్నెచోడు డీతఁడే యగునాయని ఇంత దూరము తర్కించినందున తోఁచుచున్నది. మున్ముందు చూతముగాక.—

ముందు చిత్రకవిత్వము ననుసరింతము. దాదాఁపు పదమూఁడవ శతాబ్ది చివరికాలమున, గ్రంథస్థములు కాకపోయినను, కవితాగోష్ఠు లలో బంధకవిత్వ చిత్రకవిత్వాదు లుండినవని నిశ్చయింపనగును. మఱి పెద్దయ తెనుఁగునందా లేక సంస్కృతమందా తన కవితాశక్తిని చూపి

నది అనుశంకకు అవకాశమే లేకుండునట్లు జక్కనయే 'ఆంధ్రకవిత్వంబు నందు' అని చెప్పినాఁడు. అప్పటి కింకను తిక్కన గతించి చాలకాల మైయుండదు. కవిత్రయమునంతలి కవిద్వయమే వెలసియుండిరి. అరణ్య పర్వశేషమును ఎఱ్ఱన యింకను పూరింపలేదు. అది ఇంకను పురాణకవిత్వ ములకాలమే. అట్టికాలమున జక్కనతాత పెద్దయ 'ఆంధ్రకవిత్వంబు నందుఁ బ్రబంధంబు, మేలునాఁ దజ్జులు మెచ్చుఁజెప్ప.....గర్భకావ్య వర్ణముఁ జెప్పఁగాఁ బ్రబంధంబులు గ్రొత్తలు పుట్టించుకొని లిఖింపఁగా... మహిమగాంచి' యుండెనుగదా. సమకాలిక రాజాస్థానముల కవితా గోష్ఠులలో ప్రసిద్ధములగు నూతనకవితారీతులు దేశమందు పర్వుటకు ఒకొక్కప్పుడు చాలకాలము పట్టదు. ఆంధ్రకవిత క్రొత్తపోకడలు పోవుకాలము అది. తిక్కనవంటివాఁడే కేతన సాహచర్యముచే షష్ఠ్యం తములను గ్రహించి వానికొక నూతనస్థాన మేర్పఱచిపోయినాఁడు. అంకితముల పద్ధతియు మారినదిగదా. అప్పుడే కాకతీయరాజధానియందు కవులును ఆలంకారికులును సంస్కృతమర్యాదల ననుసరించి అష్టాదశవర్ణ నలను వేరొక్కనిరి. నానారాజసందర్శనములు చేయు నమాత్యులకు కవిత్వ మొక వినోదకరణము.

'అని మీ తండ్రి మహత్త్వము
జనవినుత రసప్రసంగసంగత కవితా
ఘనతేజులు కవిరాజులు
గొనియాడుదు రఖిలరాజకుంజరసభలన్'

అని జక్కన తండ్రినే పొగడువారు తాతను పొగడకుందురా? ఈకాల మున కవులందఱును అమాత్యులే, నియోగులే; ఆఱువేలదేశమునకు సంబంధించినవారే. అట్టి అమాత్యశేఖరునకు, పైగా క్రొత్తప్రబంధ రీతులు పుట్టించుకొని కవిత్వమల్లువానికి, నూతనమార్గములను గ్రహిం చుట కెంతకాలము పట్టును. తెనుఁగున ఈప్రబంధపద్ధతి కీతఁడే జనకుఁ డేమో. నాటి కాకతీయరాజ్యమందలి శాసనవాఙ్మయ మీవిషయమును ఊర్జితము చేయుచున్నది.

సమకాలిక కాకతీయ సామ్రాజ్యమందలి శాసనకవులలో క్రీ. శ. 1277 నాటికి ఈశ్వరభట్టోపాధ్యాయుఁడు లేక ఈశ్వరసూరి యను నాతఁడు చిత్రబంధాదికవి కనఁబడుచున్నాఁడు. ఈయనరచించిన శాసనములు మూఁడు, క్రీ. శ. 1259, 1272, 1279 నాటివి మల్యాలవంశస్థులవి బూదనూరు (మహబూబునగరు) లో దొరకినవి. [Hyderabad Archaeological Series No. 13 - Inscriptions No. 52, 51 and 50]

'.....మల్యాల గుండ దండాధీశ్వరుండు మంత్రిపురోహితసేనాపతి దౌవారిక మహాప్రధానానంతసుభట విట విదూషక పాఠక పీఠమర్ద నట నర్తక రసిక రంజక కవి గమకి వాది వాగ్మి వంది వైతాళిక హూవక భావక గాయకాద్యనేక విద్వజ్జనంబులుం గొలువ సుఖోపవిష్టుండై యిష్టకథావినోదంబులనుండి పాణినీయ వ్యాకరణ విచిత్రకవిత్వ తత్త్వజ్ఞుండును పదక్రమయుత యజుర్వేద పారగుండును నాత్రేయగోత్ర పవిత్రుండును మయూరార్యపుత్రుండును నైన ఈశ్వరసూరిం గారుణ్యదృష్టిం జూచి...'

శాసనమేమో తెనుఁగే. శ్లోకములుమాత్రము సంస్కృతము చిత్రకవిత. ఈశ్లోకములకు ముందు ఇట్లు నిర్దేశించుచు వచ్చినాఁడు.

'నిర్దంత్యము - ఆరాళ్యగర్భము - క్రియాపదభ్రమకము - పునరుక్తాభాస-అవ్యయాభాస - పాదాదియమకము - క్రియాపదత్రయగోపకము - ఇందు విభాషపదాలు ఆఱు - స్తబకావళి - మిథునావళి - నిరోష్ఠ్యము - అక్షరముష్టిక - నిర్మూర్ధన్యము - అపశబ్దాభాస - అనావృతాక్షరము - ఈపద్మబంధమునందు శ్రీగుండయ అనేది నామమున్నది—ఈశ్లోకము రెండు గోమూత్రికలు - ఈ రెండుంగూడ జాలబంధము - ఈపద్మవృత్తమునందు వ్రాసినది గూఢచతుర్థమైన పద్మవృత్తము. ఇది చదివేక్రమము ప్ర మొదలుగాను రేకుల తుదలు అక్షరాలు మొదలిపాదము. ద్వి మొదలైన మొదలి అక్షరాలు రెండవపాదము. లి మొదలైన రెండవ అక్షరాలు

మూండవపాదము. నాలవపాదము ఈమూండు పాదాలందు నున్నది. ఈపాదము లలితకాతుకరసప్రభతోషితవాచకమ్... చక్రబంధము'

ఒక చిత్ర మేమనఁగా పెద్దయామాత్యుఁడును ఈశ్వరభట్టోపాధ్యాయులును సమకాలికు లగుచున్నారు. ఏకకాలమున దేశమందు ఈ చిత్రబంధకవితాద్యుల స్ఫురణమును విచిత్ర మే. ఇట్లు తిక్కన చేయని, ఆయన శిష్యులును చేయని, యీ చిత్రకవిత్వమును తిక్కనకు తర్వాత అచిరకాలములోనే తెనుఁగున కొందఱును, సంస్కృతమున నరే ఎట్లును పూర్వమార్గము ననుసరించిన కొందఱును చేయుచుండిరనఁగా నిది దేశమందు కలిగినదే. సామర్థ్యముపై నాధారపడినందున అంతవ్యాప్తికి రాలేదని తెలియుచున్నది.

జక్కనకాలమును శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు సుమారు 1375 క్రీ. శ.గా నిర్ణయించినారుగదా. నాటికవితారీతులను జక్కనయే ఇట్లు చెప్పినాఁడు. ముందుగా సప్తసంతానములను వేరొక్కన్నాఁడు.

"వనము నిధియును నల్లిల్లు వరసుతులును
జెఱువు గుడియును ధర బ్రతిష్ఠితములయ్యెఁ
గృతియుఁ గైకొన్న సప్తసంతతులవలనఁ
గీర్తి సుకృతంబులకును నే గర్త నగుదు"

"ప్రతిభాగుణధురీణ పౌరాణిక ప్రౌఢ
సకలపురాణశాస్త్రములయందు
బరమార్థ చరితార్థ భారతరామాయ
ణాది ప్రబంధకావ్యములయందుఁ
గల్పాంతరస్థాయి గద్యపద్యప్రాయ
కమనీయ చిత్ర కావ్యములయందు,
రసిక జనానంద రససుధానిష్యంద
విలసిత నాటకావలులయందు,

సకలదేశభాషావిశేషములయందు
వరుసఁ బ్రఖ్యాతమనఁగ నుత్పాద్యమనఁగ
మిశ్రమన నొప్పు సత్కథామేళనంబు
లెన్నియన్నియు విన్నాఁడ బిన్ననాఁడ."

అని తనపోషకుఁడు సిద్ధామాత్యుఁడు చెప్పినట్లు వ్రాసినాఁడు. ఇదంతయు అప్పుడు వారికాలమున పుట్టినవిగా నుండవుగదా. కాఁబట్టి క్రీ.శ. 1300 పూర్వమే ఇట్టి వాఙ్మయము దేశమునందుండి అభివృద్ధియగుచు వచ్చినది. తిక్కన గతించిన కొద్దికాలమునకే కథామేళనము తెనుఁగున 'ప్రఖ్యాతము' 'ఉత్పాద్యము' 'మిశ్రము'అని మూఁడు తెగలుగా విభక్తమైనది.

క్రీ. శ. 1300 నాటికే ఆంధ్రవాఙ్మయమున చిత్రకవిత యేర్పడియుండఁగా శ్రీనాథ పోతనాదులుకూడ దీనిని చేపట్టక తర్వాతి కవులే ఎక్కువగా చిత్రకవిత్వమందు విజృంభించినది గుర్తింపఁదగినది.

జక్కనకు కొంతముందు, ఇంచుమించు క్రీ. శ. 1330–40 లో నుండినవాఁడును ప్రబంధపరమేశ్వర బిరుదాంకితుఁడునైన ఎఱ్ఱాప్రగడం గూర్చి జక్కన 'ఈత్రయిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై' యను పద్యమున 'ఆచిత్రకవిత్వ వాగ్వైభవ జృంభితుఁగొల్చెద'నని వ్రాసియున్నాఁడు. ఇది 'బంధచిత్రకవిత్వ' రచనం గూర్చినదిగా కనఁబడదు. బంధకవిత్వ మీతని రచనలలో కానరాదు. తన నృసింహపురాణమును ప్రబంధమని చెప్పుకొన్నాఁడుగాని అష్టాదశవర్ణనాత్మకమైన యనంతర ప్రబంధముల వంటిది గాదు. మఱి చిత్రకవిత్వము ఏమనఁగా రచనాధోరణి. అర్థాలంకారశబ్దాలంకారములను పూర్వులకన్న నెక్కువగా వాడినాఁడనియే, బంధగర్భ కవిత్వాదులను చేసినాఁడనికాదు.

మడికి సింగన సకలనీతిసమ్మతమున నీతితారావళినుండి ఈక్రింది పద్యము నుదాహరించినాఁడు.

'పలుకుల తీపును సరసము
చెలువము నడబెడఁగు బంధచిత్రము సొబగున్
గలకలనఁ జూపవలదే
కలకంఠియుఁ బోలెఁ గవిత కందనమంత్రీ.'

ఈనీతితారావళి సింగనదే. మఱి తానేమి 'బంధచిత్రము' వ్రాసినాఁడో తెలియదు.

నన్నయకాలమందుండియు, 'మృదుమధురచిత్రవిస్తర నవరసభావ భాసుర కవితారచనావిశారదులైన మహాకవు' లుండిరి. శ్రీనాథుఁడు గూడ 'మృదుమధుర చిత్రవిస్తర కవితావిలాస వాగీశ్వరులగు కవీశ్వరులను' అని చెప్పినాఁడు. మఱి 'చతుర్విధ కవితామతల్లికాల్లసాని చొక్కయామాత్యపుత్ర పెద్దనార్య'ని కాలమునాటికి ఈచిత్రకవిత రాయల వారి యాస్థానమున ఒకపొంగు పొంగినది. నన్నయకాలమునుండి ఎఱిఁగియుండియు ఎవరును ఈకృషికి పూనుకొనలేదు.

మనకు మూలాధారమైన సంస్కృతకవితయం దన్నదో శిశుపాలవధాది కావ్యములయందు కనఁబడుచుండుటచేత మాఘునికాలమునకే, అనఁగా క్రీ. శ. 700 ప్రాంతముగాన, ఎనిమిదవశతాబ్దికే చిత్రబంధరచన ప్రాముఖ్యమునకు వచ్చినది. ఇందులో సంప్రదాయభేదములు కవుల ప్రతిభచేతనో లేక దేశకాలవ్యత్యాసములచేతనో కనఁబడుచున్నవి. చక్రబంధములు ఆంధ్రదేశమున ఒక్క తీఱుగా చాలవఱకున్నవి. ఇటీవలకొంతమార్పు కనఁబడుచున్నది. మామూలుగా మూఁడవవలయమున కవిపేరును, ఆఱవవలయమున కృతిపతిపేరును కనఁబడుచుండును. పారిజాతాపహరణకవిరాజమనోరంజన నరసభూపాలీయాద్యనేక గ్రంథముల యం దట్లే యున్నది. ఇటీవలివారైన వావిలాల వాసుదేవశాస్త్రిగారు రచించిన యాంధ్రరఘువంశమునందు కృతిపతిపేరు మూఁడవ వలయమునకు బదులు నాల్గవవలయమునందును కవిపేరు ఆఱవవలయమునందు అప్రదక్షిణముగ 'వాసుదేవకృతి' యనియు కలదు. ఇది వారేలక్షణము ననుసరించి వ్రాసిరో 'చింత్యము' అని శ్రీపూండ్ల రామకృష్ణయ్యగారు ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాస పీఠికలో వ్రాసినారు.

అందరినిమించి, మనకింకను చిక్కులుపెట్టుటకు, నన్నిచోడఁడు తన చక్రబంధమున కృతిపతి కృతికర్తనామములు వచ్చునట్లు వ్రాయలేదు. వలయమునందు మూఁడవ యక్షరములను చేర్చిన 'ముకలం

నైషైక' అనియు ఆఅవయఖరములనుచేర్చి చదివిన 'నాదమంద్రై దేవ' అనియు నగుచున్నది. అర్థమేమో తెలియుటలేదు. 'ఇది నన్నెచోడుని ప్రాచీనత కొకకారణము, చోళుని చక్రబంధమునఁ గృతికర్త కృతి పతినామములు గుప్తములుగా లేవు. ఈవిధముగానే కవిరాజమార్గ మను ప్రాచీనతమకావ్యములో నీనియతి కానరాదు. ఈమార్గద యిటీవలఁ బుట్టనని తోఁచుచున్నది.' అని శ్రీమానవల్లి రామకృష్ణకవి గారు 1914 లో వ్రాసినారు (కు. సం. ద్వి. భాగ. పీఠిక) ఒకవిధముగా ప్రాచీనతను సూచించుట వాస్తవమేగాని ఏకాలమును? ఈశ్వరభట్టో పాధ్యాయుని చక్రబంధమున కవియొక్కయు కృతిపతియొక్కయు నామ ములు గలవు. కాని శ్లోకమది. సంస్కృతము. శాసనమయొక్క తారీఖు క్రీ. శ. 1259. దీనింబట్టి నన్నెచోడుఁ డీసంప్రదాయము నెలుఁగఁడని చెప్పవలయును. అట్లైన క్రీ. శ. 1259 కి ముందువాఁ డగును. ఇది కుదు రదు. 1259 నాటికి తిక్కనయున్నాఁడు. షష్ట్యంత సప్తసంతాన కృతిప్రారం భాద్యనేక విషయములచే నీతఁడు అప్పటికి చాల అనంతరుఁడు కావల యును;గాని పూర్వుఁడగుట యసంగతము. కాఁబట్టి ఈతఁడు భిన్నసంప్ర దాయమైనను అనుసరించియుండవలెను, లేదా ఈశ్వరభట్టుని సంప్రదాయ మాంధ్రకవిత్వమున కింకను ప్రవేశింపలేదనియైనను చెప్పుకొనవలెను. కావ్యాలంకారచూడామణిలో ఈశ్వరసూరి పద్ధతియేయున్నది. విద్యా నాథుని లక్షణలక్ష్యములలో ఈశ్వరసూరిపద్ధతి వచ్చినతర్వాతనే ఆంధ్ర కవు లీమార్గమును గ్రహించిరేమో? ఇందువలన నొకవిషయము తెలియు చున్నది—గీర్వాణాలంకారికులపద్ధతులు ఆంధ్రదేశమున ఒకవాహినిగా ఒక్కుమ్మడిగా ప్రవేశింపలేవని. నన్నెచోడుఁ డిందుచేత ఈశ్వరసూరి విద్యానాథుల నడిమివాఁ డగునా?

మఱి యిప్పుడు నన్నెచోడునికాలము కుదురునేమో చూతము.

౯-ప్రకరణము

నన్నెచోడుని కాలనిర్ణయము

ఇంతవఱకును చేసిన చర్చచేత తేలిన సారాంశము—నన్నెచోడుఁడు

(1) శాసనాధారములచేత దొరకఁడు. శాసనములనే విధిలేక గ్రహించినను నన్నయకు పూర్వుఁడుకాఁడు. అనంతరుఁడు;

(2) షష్ట్యంతరచనచేత తిక్కన కేతనల కనంతరుఁడు;

(3) సప్తసంతానములను వేరొక్కనుటచేత మంచన కనంతరుఁడు;

(4) అష్టాదశవర్ణనలను చెప్పుటచేత పాల్కురికి సోమనాథ విద్యానాథ కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తులకు సమీపవర్తియో అనంతరుఁడో;

(5) కృతిప్రారంభకర్తవ్యములు ఈతనియందు సంపూర్ణరూపమును పొందినందునగూడ పాల్కురికి సోమనాథునికిని ఎట్టాప్రెగ్గడకును నడిమివాఁడు;

(6) చిత్రకవిత్వమును ప్రబంధమున ప్రవేశపెట్టినందుచేతఁగూడ ఈకాలమునకు ముందుపోఁడు, తర్వాతివాఁడే యగును.

నన్నెచోడునికాలమును ఇంతకుతర్వాత కొనిపోఁదగునా రాదా యనుప్రశ్నకు సమాధానము కుదురకున్నది. క్రీ. శ. 1340 లేక 1323 లేక 1300 ఈమధ్యకుదురునా లేక 1350 తర్వాతికి కుదురునా యతని కాలము అనుప్రశ్నకు ఈవలిహద్దును ఒకవిధముగా కుదుర్చుకొనవచ్చును. తిక్కన సోమయాజి కుమారుని దౌహిత్రుఁడైన మడికి సింగన తన సకలనీతిసమ్మతమున నన్నెచోడుని కుమారసంభవమునుండి పద్యములనుదాహరించియున్నాఁడు. సకలనీతిసమ్మత రచనాకాలమును నిర్ణయింతుమేని అంతకు కొంతపూర్వమనుట తేలును. మానవల్లి రామకృష్ణ

కవిగారు సకలనీతి సమ్మతముయొక్క పీఠికలో నిట్లు వ్రాసినారు (ఆంధ్ర పత్రిక ముద్రణము 1923).

"మడికి సింగన యుండినకాలము పద్మపురాణరచనాకాలము తెలిసి నందునఁ జిక్కులేక విస్పష్టమగుచున్నది.

'ఆ కర యు గానల మృగాంక శకవత్సరము
లై పరగు శార్వరిని బుణ్య
ప్రాకటిత మార్గశిర పంచమిని బొల్చు సుమ
పాలసుతవాసరమునందున
శ్రీకరముగా మణికి (మడికి) సింగన దెనుంగున ర
చించెఁ దగఁ బద్మపురాణం
బాకమలమిత్ర శశిరాంశుపుగఁ గంద సచి
వాగ్రణికి మంగళమహాశ్రీ.'

అనఁగా శాలివాహనవర్షములు 1342 లకు సరియైన క్రీ. శ. 1420 సంవత్సరమునఁ బద్మపురాణము రచింపఁబడియె." కొన్నివ్రాత ప్రతులలో నీ పద్యము లేనందున నిది అనంతర లేఖక రచితమని కొందఱు తలంచుచున్నారు. ఒక్క కాగితపుప్రతిలోతప్ప మఱెందును కానరాదు. మడికి సింగన తొయ్యేటి అనపోతభూపాలునికి ఆప్తుఁడు. అనపోతభూపాలుఁడు కాపయనాయకుని పినతండ్రి కుమారుఁడు. ఇతనిది క్రీ. శ. 1347 నాటిది దాక్షారామమున శాసనము కలదు (S. I. I., IV - 1294). కావున మడికిసింగనయు అప్పటివాఁడు కావలయును. నన్నెచోడుఁడు తత్పూర్వుఁడు. సకలనీతిసమ్మతమున పద్మపురాణమునుండికూడ పద్యములు గ్రహింపఁబడినందున నది పద్మపురాణానంతరమే రచితమైయుండును- ఇందుదాహృతగ్రంథములనేకములు; కాని, వానితో నన్నెచోడునికి సమీపకాలమువాఁడని యనఁదగు బద్దెభూపాలుని నీతిశాస్త్రము నుదాహరించియుండుట యొక విశేషము. నన్నెచోడుని కాలమెట్లు వివాదగ్రస్తమైయున్నదో అట్లే యున్నది బద్దెనకాలమును. మఱి నన్నెచోడ బద్దెచోడ నరేంద్రులు మడికి సింగనకు పూర్వులు. అందు

నన్నెచోడుఁడు బద్దెనకన్నను పూర్వుఁడని చెప్పవలసియున్నది. ఎట్లనఁగా—

బద్దెన నీతిశాస్త్రముక్తావళిలో తన్ను తానే పద్యాంతములలో సంబోధించుకొనుటలో 'బద్దెనృపా' 'నన్ననగంధవారణా' 'కొమరుర భీమా' 'కావ్యచతుర్ముఖ' 'కీర్తినారాయణ' 'ఉదారవైరోచన' 'దశదిశా భరణాంకా' ఇత్యాదులతో 'నన్నెచోడనరేంద్రా'యని చెప్పుకొన్నాఁడు. వెంటనే నన్నెచోడుఁడు నీతఁడును ఒకరే యగుదురేమో యను సంశ యము కలుగక మానదు. ఆ సందేహమే శ్రీమానవల్లి కవిగారికి కలిగి నివర్తియైనది. "కొన్నియెడల సంబుద్ధివాచకములలో నన్నెచోడనరేంద్రా యనియుఁ గొమరురభీమా యనియు నున్నది. ఇతని బిరుదమగు 'నన్ననగంధవారణ' యను దానిలో నన్ననశబ్దమును నన్నెచోడనరేంద్ర యనుటలోని నన్నశబ్దముఁ జూడఁగా నితని మొదటిపేరు పెద్దలపేరుగా నన్నఁడనితోచుచున్నది. ఆహవమల్లుఁడను చాళుక్యచక్రవర్తికి నమ్మన గంధవారణుఁడనియుఁ గన్నచోళునకు మల్లనగంధవారణుఁడనియు బిరుదములు గలుగుట చూడఁగా నివియే జన్మనామములో లేక తల్లి దండ్రులు గారాముగాఁ బెట్టిన నామములో తెలియరాదు. కుమార సంభవమును రచించినవాఁడు నన్నెచోళుఁడు. అతఁడు శివభక్తుఁడు. భద్రభూపతి 'లక్ష్మీవల్లభపాదపద్మారాధకుఁడు.' కావున నిద్దఱి నొక్కరే యనుటకు వీలుపడదు. బద్దెన నన్నెచోళునివంశ్యుఁడో యేమో."

నన్నెచోడుఁడు ప్రాచీనుఁడను నమ్మకమే 'బద్దెన నన్నెచోళుని వంశ్యు'ఁడని వ్రాయుటకు కవిగారిని ప్రేరించినట్లున్నది. నన్నెచోడులు పలువురుండుటచే బద్దెనవారిలో నొకఁడుగా నుండరాదా? బద్దెన తన్ను నన్నెచోడనరేంద్రా యని సంబోధించుకొనుటచే ఈతనికే ఆపే రుండ వలయునని గట్టిగా తోఁచును. కాని పేరు బద్దెనయని స్పష్టము కావున నిది బిరుదమైయుండును. మఱి ఆపేరిలో నేదో విశేషము లేకుండిన నది బిరుద మెట్లగును? బద్దెనకుపూర్వుఁడొక ప్రసిద్ధ నన్నెచోడుఁడుండి, అతఁడును తనవలె కవియైయుండినందున బద్దెన ఆనామధేయమును బిరు

దముగా గ్రహించెనేమో. ఈతఁడు 'కావ్యకమలాసనుఁడు' గదా. కాని ఎచ్చటను కేంకణాదిత్యుఁడనుబిరుదము లేనందున ఆతఁడుగాఁడు. మఱి 'నన్ననగంధవారణా' యను బిరుదమున్నదే దానికేమర్థమన్న నన్నన యనువానికి గంధవారణము వంటివాఁడు, గొప్పసంరక్షకుఁడని యర్థము. ఇది కన్నడబిరుదము. కవిగారు 'అమ్మనగంధవారణం' 'మల్లన గంధవారణం' అను బిరుదములను పేరొక్కని అవేవో 'తెలియరాదు' అని వ్రాసినారు. కన్నడరాజ్యములో ఈబిరుదు సర్వసామాన్యము; రన్న పంప పొన్నకవుల గ్రంథములలో కనఁబడును. ఇంకను 'అయ్యన గంధవారణం' అనికూడ కలదు. చక్రవర్తుల కొమార్ల్లకు వారి తండ్రుల తోడి ప్రియబాంధవ స్నేహాతిశయములను తెలుపు సందర్భమున కవులు ఈబిరుదును, వారికి జీవితములో వాస్తవముగా కలదానినే, తమకవి తలో వ్రాసియున్నారు. రెండవ తైలపచక్రవర్తి కుమారునికి సత్యాశ్రయనామకునికి (క్రీ. శ. 997-1008 నడుమకల్యాణకటకమును పాలించిన పశ్చిమచాళుక్యచక్రవర్తికి) 'అమ్మనగంధవారణ' మను బిరుదుండెను. '...సత్యాశ్రయకుల తిలకనుం...చాళుక్యనారాయణనుం...అకలంక చరితనుం అమ్మనగంధవారణనుం...' (రన్నకవి గదాయుద్ధములో). ఈ సత్యాశ్రయుఁడు తండ్రివలెనే మహాయోధుఁడు; లెక్కలేని యుద్ధములలో విజయముగాంచి కల్యాణీచాళుక్యుల సామ్రాజ్యమును విస్తరింపఁజేసినవాఁడు. 'అమ్మనగంధవారణ' మనుటకు తండ్రికి ఏనుఁగువంటివాఁడు అని యర్థము. ఈ అమ్మకు 'అయ్య' యని యర్థము. కృష్ణమనాయఁడు ఇత్యాదులలోని అమ్మవంటిది, మర్యాదవాచకము. మానవునికి సహాయముగా వెంట నొక ఏనుఁగుండిన నెట్లుండునో అట్లు సహాయుఁడుగా అనుట. పశ్చిమచాళుక్యుల శాసనములలోనుండి లెక్కలేని యుదాహరణముల నీయవచ్చును.

ఇందువలన నాకు తోఁచునదేమనఁగా బద్దెన నన్నెచోడుని ఎఱిఁగి ఆతనిపై భక్తిగలిగి తానును కవితలో అట్టివాఁడ నని తన్ను ఆ పేరిట సంబోధించుకొని, ఆతనికి సామంతుఁడో కుమారునితో సమానుఁడైన

భృత్యుఁడో, లేక సాక్షాత్తు కుమారుఁడో, లేక ఎట్లో సన్నిహితుఁడై యుండి అందుచే నన్ననగంధవారణుఁ డని కూడ సంబోధించు కొన్నాఁడు. ఇందుచే నన్నెచోడ బద్దెచోడు లిరువురును ఒకరివెను వెంట నొకరు రాజ్యమేలియో జీవించియో యుండవలెను.

ఈయూహను బలపఱచునాధారము కాకపోయినను మఱింత యనుకూలపఱచు విషయ మేమనఁగా బద్దెనది నీతిశాస్త్రము. నన్నెచోడుఁడు ప్రబంధములో కథావశమున రాజనీత్యుపదేశమును ప్రవేశ పెట్టియున్నాఁడు. తిక్కనాదులలో రాజనీతి లేదా యనవచ్చును. ఉన్నది. కాని ఇచ్చటి యూహలను బలపఱచు సన్నిహిత సన్నివేశము వంటి దీ నిదర్శనము. పడిపోయినమంటపముయొక్క కాళ్లు చెదరిపోయి నను సమీపప్రదేశమున ఒకటొకటిగా దొరకుట వంటిది. రాజనీతిం గూర్చి రచనలు పెరిగినకాలము అది. మఱియొకవిశేష మేమనఁగా బద్దెన సుమతిశతకకర్త. తన శతకమున కితఁడు 'సుమతీ' యను సంబోధనా మకుటమును గ్రహించుటకు కారణమేమో చెప్పలేముగాని పైరెండు బిరుదములవలనను, నీతిశాస్త్రముమీఁది యభిలాష ఇరువురికిని సమానముగా నుండుటవలననుతోఁచు భావములకు ఇంకను తోడుగా 'సుమతి' నామ మిరువురకును ప్రియమైనదిగా కనఁబడుచున్నది. బద్దెన శతకమున సంబోధన మాత్రమే; నన్నెచోడుఁ డన్ననో 'సుమతి'ని కుమారసంభవ మున ఒక చక్కని పాత్రగా ప్రవేశపెట్టినాఁడు. బద్దెనకాలము ఇంకను నిస్సందేహముగా నిర్ణీతము కాలేదు. ఇతనికవిత చక్కని ధారాశుద్ధి గలది, ఒడుదొడుకులులేని ప్రవాహము, ద్రాక్షాపాకము, సుగమము, పదాడంబర మేకోశమందును లేనిది; ఇతనికి యతి ప్రాసలు తమంతట దొరలును. మారుమూల పదము లీతనికడ కానరావు. కవితనుబట్టి అనంతరకవుల శైలియని చెప్పవలసియున్నది. తాను సుమతిశతక కర్తనని నీతిశాస్త్రముక్తావళిలో చెప్పుకొన్నాఁడు.

'శ్రీవిభుఁ డ, గర్వితారి
క్ష్మావరదళనోపలబ్ధజయలక్ష్మీ సం

భావితుఁడ, సుమతి శతకము

గావించిన ప్రోడఁ గావ్యకమలాసనుఁడఁ' ప. 1.

మఱియు చోడుఁడు 'దారిద్ర్యవిద్రావణ' దశకకర్త. ఈక్రింది పద్యములు సుమతిశతకపుశైలికి మార్గదర్శకములై యుండును.

'వెలయఁగ సుజనుల మనమును
వెలయూండుర జవ్వనంబు వెన్నెలతెలుపుల్
జలిగాలి తనుపు నిర్ఝర
జలముల తెలివెల్ల సర్వసామాన్యంబుల్'

'వరసతి సురతకళాగమ
పరిణతుఁ డగు విటునిఁ గూడి పాయదు మఱి డె
ప్పరమునఁ బాసియునెన్నడు
నొరుగవయదు జున్నుదిన్న లొట్టియవోలెఁ'

సుమతిశతకమునుండి మడికి సింగన సకలనీతి సమ్మతమున ఏపద్యమును గాని ఉదాహరింపలేదుగాని బద్దెననీతినుండి యుదాహరించినదే 'పదివేలు'. కాని సుమతిశతకకర్త భీమన (వేములవాడ) యనియు, రెండు సుమతి శతకము లుండెడివేమో యనియు నొకయభిప్రాయ మున్నది. (చూ. ఆంధ్రకవితరంగిణి 3 సం. పు 16-17). ఈతని కాలముంగూర్చి ఏమియు శాసననిబర్నము కుదురదు. పశ్చిమచాళుక్యుల సామంతులైన తెనుఁగు చోళులలో కొందఱు బద్దెనరేంద్రులు కనఁబడుచున్నారు. జయంతి రామయ్యపంతులుగారు (ఆం. సా. ప. పత్రిక రాశిస 273 పుట) ప్రకటించిన శాసనమున ఇరువురు బద్దెన లున్నారు, తాత మనుమలు. రెండవ బద్దెన తండ్రి, మొదటి బద్దెన కొడుకు పేరు దోరయ. తారీఖు శకము 1183 క్రీ. శ. 1261. ఈశాసనము దొరకినచోటు కృష్ణామండలమున గన్నవరముతాలూకా కొండనాయనివరమున బ్రహ్మేశ్వరస్వామివారి దేవాలయమున నొకతాతిమ్మఁద. ఈతఁడు తిక్కనకు సమకాలికుఁడగు చున్నాఁడు. ఇతనికి ముందువాఁ డగునని తలఁచిన నన్నెచోడుఁడు, ఇట్లు చూచిన తిక్కనకు ముందువాఁ డగును. అది వాజ్మయపరిణామా

దికములచే కుదురదు. కాఁబట్టి ఈ బద్దెన పనికిరాఁదు. అనంతరుని వెదుక వలసియున్నది. పైగా శాసనోక్త బద్దెనయే కవియనుటకు ప్రమాణమేమి ?

టేంకణాదిత్యనిబట్టి నన్నన లేక నన్నెచోడుఁడు ఈకాలమునకు సరిపోవువాఁడు దొరకునా చూతము. అథర్వణాచార్యుఁడొక టేంకణాదిత్యని పేరొక్కాన్నాఁడు.

'మగణమ్ముఁ గదియ రగణము
వగవక కృతిమొదట నిలుపువానికి మరణం
బగు నిక్కమంద్రు, మడియఁడె
యగుననియిడి తొల్లి టేంకణాదిత్యుఁ డనిన.'

[అథర్వణ ఛందస్సు] ఈ టేంకణాదిత్యుఁడు నన్నెచోడుఁ డనియే విమర్శకులు తలంచినారు. దీనింగూర్చి శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు ఇట్లు వ్రాసినారు. "ఈతఁ డీగ్రంథమున స్రగ్ధరావృత్తములను విశేషముగా వాడినాఁడు. గ్రంథాదినే స్రగ్ధరను గ్రహించినాఁడు. 'మ్రభ్నైఃయ' అనునీ వృత్తలక్షణమునుబట్టి గ్రంథాదిని 'మగణమ్ము గదియ రగణము'ను వాడియుండుటచేతనే యీతఁడు రణనిహతుఁ డయ్యెనను వదంతి కలిగినట్లు అథర్వణుని ఛందమున నుదాహరింపఁబడినట్లు చెప్పఁబడినది. కాని అథర్వణఛందము పూర్తిగ దొరకకపోవుటచే దీని యాకరము తెలియుటలేదు. కాళిదాసుకూడ గ్రంథాదిని రెండుపర్యాయములు 'యాసృష్టిస్స్రష్టురాద్యా' అని 'ఏకైశ్వర్యే స్థితోపి' యని స్రగ్ధరలె వాడినాఁడు కాని ఆతనివిషయమునం దిట్టివదంతి కలుగలేదు." టేంకణాదిత్యులు పలువురైనను కవియైనవాఁడును స్రగ్ధరాచయితయు నీతఁడొక్కఁడేయని యనుకొనినను అథర్వణునికాలము వివాదగ్రస్తమేయుండుటచే ప్రస్తుతముపయోగపడ దాతని సాక్ష్యము. కుమారసంభవ రచనానంతరము నన్నెచోడుఁడు రణనిహతుఁడై ఆతర్వాత కవులలో నీభావమేర్పడి అథర్వణుఁడు రచించియుండవచ్చును. పిచ్చినమ్మకములు ఆయాదేశముల కొక్కొకతీరుగదా. కన్నడకవులుగూడ స్రగ్ధరలతో

ప్రారంభించియున్నారు. ఈనమ్మకము వారికి కలదో లేదో తెలియదు. ఉన్న క్లెచ్చటను కానరాలేదు.

నన్నెచోడుని పద్యమువంటి పద్యము ఇంకొకటి కొద్దిమార్పులతో కవిజనాశ్రయమున నున్నది.

'శ్రీశ్రితవక్షుఁడు ముక్తి
శ్రీశ్రిత సహజావదాత చిత్తుఁడు వాణీ
శ్రీశ్రిత సుముఖుఁడు కీర్తి
శ్రీశ్రిత దిఙ్ముఖుఁడు వేముపీనిధిపేర్మి.' కుమార.

'శ్రీశ్రితవక్షుఁడు విద్యా
శ్రీశ్రితముఖుఁ డఖిలజన విశేషితకీర్తి
శ్రీశ్రితభువనుఁడు సుకవిజ
నాశ్రయుఁ డెజ్జేగించుకృతుల నగుదోషంబుల్.' కవిజనా.

ఈగ్రంథరచయిత వేములవాడ భీమకవిగాఁ దలంచి శ్రీజయంతి రామయ్య పంతుల వారీతనికాలమును 'నన్నయభట్టు తరువాతి వాఁడును విన్నకోట పెద్దనకు పూర్వుఁడు నైనట్లు తేలుచున్నది' అని నిర్ణయించినారు. రేచనయని యొక యభిప్రాయమున్నది. ఏది యెట్లున్నను క్రీ. శ. 1400 లకు (విన్నకోట పెద్దనకు) చాల ముందువాఁడు. ఈతని పద్యమునే నన్నెచోడుఁడు గ్రహించెనో చోడుని పద్యమునే యీతఁడు గ్రహించెనో ప్రస్తుతము చెప్పలేము కాని ఇతని గ్రంథములో కనఁబడు 'మునుకొని దేశకాలబల' మనుపద్యమును ప్రాచీనుఁడు మడికి సింగనయే ముద్రామాత్స్యములోనిదని యుదాహరించెను. (ఇది అనంతరలేఖకప్రమాదముగా నేల యుండరాదు?) ముద్రామాత్స్యము ఎప్పటిదో తెలియదుగాని నన్నెచోడుని గ్రంథము నెఱింగిన మడికి సింగనకు అప్పటి కుమారసంభవప్రతిలో నీపద్యము లేక ముద్రామాత్స్యమునందే కనఁబడినందున తర్వాత నెప్పుడో ఈపద్యము కుమారసంభవములోని కెక్కియుండునని తలంపవలసియున్నది. కాని ఇది ఇప్పటిలో నన్నెచోడు నన్వేషించుటకు ఉపయోగపడదు.

'నన్ననగంధవారణు'నే ఆశ్రయింతము. అంతయుపోగా పదు మూడవశతాబ్దమున తిక్కనకు తర్వాతివాడుగా కాదగినవాడు నన్నెచోడనామధారి, జక్కనకాల నిర్ణయసందర్భమున శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు చూపిన నానెదేవుడే. ఈతని విషయము నరయు దము. నెల్లూరుజిల్లా ఆత్మకూరుతాలూకా కామిరెడ్డిపాడు గ్రామములో దుర్గమ్మగుడిదగ్గరి శాసనము [N. D. I—I. A-29]

"స్వస్తి శ్రీమన్మహామండలేశ్వర నానెదేవమహారాజులు నెల్లూరను సకలసాంమ్రాజ్యం జేస్తుండి సుఖసంకథావినోదంబుల రాజ్యంబు చేయుచుండంగాను రాజునకు నిజబ్రిత్యుండైన హదపము నులుంక్కరాజు సుఖానుంను శ్రీజయాభ్యుదయ శకవర్షంబులు ౧౧౯౭ నేంటి యివ సంవత్సరమున ఆశ్వయుజ శుద్ధ 10 లు ఆదివారమున మహాలక్ష్మీదేవి పండువ నందనకుం పుణ్యముగా దుర్గాపరమేశ్వరికి నవేద్యమునకు తం...ని కిరువది ... ... తమ... ... వాలు ... ... పూర్వకమున స్వామికిం అను యూరి ప్రభువులు దుగ్గమందు దీనియి తమరెడిమార తో యథారాపూర్వకము సేసిరి ఇదమ్మపు ఆచంద్రార్కస్థాయిగాం జెల్లించువారు యిధమ్మపునకు ఎవ్వరు విఘ్నము దలంచినాను గంగకుతంగవిలపధియించినపాపానం బోవువారు."

క్రీ. శ. 1275 కు సరిపోవుచున్నది దీని తారీఖు.

ఈశాసనమందు పేరుమాత్ర మున్నదేగాని ఈతఁడు వీవంశము వాఁడో తెలుపువివరములు లేవు. నెల్లూరిని అంతకు కొంతముందు పరి పాలించిన ప్రసిద్ధప్రభువు మనమసిద్ధియేగదా. ఈయన రాజ్యకాలము క్రీ. శ. 1261 నాటికిముందే ముగిసినట్లున్నది. మనుమసిద్ధి మరణానంతరమే తిక్కన భారతచనగదా. తిక్కన ఎంతకాలము జీవించెనో తెలియదుగాని మనుమసిద్ధికుమారులలో పెద్దవాఁడైన తిక్కరాజు (రెండవ తిరుకాళదేవ రాజు) వెంటనే రాజ్యమునకురాలేదు. ఈవిషయమంతయు ర వ ప్రకరణ మున 28 పుటలో చర్చింపఁబడియేయున్నది. అప్పుడు కాకతీయగణపతి

పరాజితుఁ డగుటయేగాక అతనికి అవసానకాలము సంప్రాప్తమైనది. తర్వాత రుద్రమదేవి రాజ్యమునకు వచ్చుటయు సామంతులు కొందఱు తిరుగఁబడుటయు జరిగినది. మఱియొకవైపు కాకతీయులకు యాదవుల బాధయుండెను. ఈమధ్యకాలమున 1261 నుండి నెల్లూరిని పాండ్యులాక్రమించిరి. క్రీ. శ. 1278 వఱకు ఎవరెవరివో శాసనములు నెల్లూర సున్నవేగాని మనుమసిద్ధికుమారుఁడైన తిక్కరాజు శాసనము కానరాదు. 1279 లో (N. D. I. I-p. 417) ఈతని రెండవ సంవత్సరపు శాసనము దొరకుటచే నీతఁడు అంతకు కొంతముందే తండ్రిరాజ్యమును గ్రహించియుండును. ఇది నెల్లూరికి తూర్పున కృష్ణాపట్టమున దొరకినది, భాష తమిళము. పై 1275 శాసనోక్త నానెదేవునికిముందు నెల్లూరు పరిసరప్రాంతముల నొక నాగదేవరాజు 'మహామండలేశ్వర నాగార్జున విభవజిత నాగేశ్వరవిక్రముఁడు' పాలించినట్లు తమిళశాసన మొకటి (N. D. I. - II 21 p. 782) శక 1193 గతసంవత్సరముది కలదు. ఈ నాగదేవునిదే యనునట్టివి కావలిలో క్రీ. శ. 1273 - 74 లోను (N. D. I. KV. 48) 1273 - 74, 1274 - 75 లో ఆత్మకూరులోను (N. D. I. A. 51) కలవు. ఈ యాత్మకూరశాసనము నాగదేవమహారాజునకు ధర్మవుగా 'శాతనిశంకలు (?) డామిఱపు రామినాయిండు మల్లినాయిండును మనదవదానముగా' నిచ్చిన దానముంగూర్చినది. ఇందుచే నీరాజు గతించెనా యను సందేహము కలుగును. కాని మరల ఒంగోలు (N. D. I. - 0.75) లో దొరకిన యొక శాసనమున క్రీ. శ. 1280-81 తారీఖున్నది. దాత నాగదేవమహారాజే. ఇందుచేత వీనికి నడిమి కాలముదిగా దొరకిన నానెదేవరాజు శాసనముకూడ ఈ నాగదేవ రాజుదేయగునా యని సందేహమునకు చోటిచ్చుచున్నది. ఈరాజుపేరు శాసనమున సరిగా కనఁబడనందున శాసనసంపాదకులు రాజుపేరులోని 'నానె'ను కుండలీకరించినారు. ముందువెనుకల నాగదేవరా జుండఁగా నడుమ నానెదేవరాజు (నన్నెదేవరాజు) ఎట్లుండఁగలఁడు. కాఁబట్టి 'నానె' 'నాగ' యనుటకు పొరపాటు. తెలుఁగుచోళబిరుదావళివేదు. ఇట్లు

సందేహాస్పదమై యున్నందున 'నన్నన గంధవారణుఁ' డితఁడు (1275 వాఁడు) కాఁడు.

ఒకటి తేలినది. తిక్కన కేతనాదులకు తర్వాత (ఇంచుమించు మంచనకు సమకాలికుఁడుగ) నొక నన్ననయు ఆతని కొకరో లేక పలువురో గంధవారణులును ఉండిరి. వారిలో ఒకరికి జక్కనకృతిపతి సిద్ధనతాత సిద్ధన ప్రధానుఁడు. '...అధికుండగు నన్నయ గంధవారణంబునకుఁ బ్రధానుఁడై నుతులఁ బొందెను సిద్ధనమంత్రి యిద్ధరన్.' జక్కనతాత నెల్లూరి తిరుకాళమనుజవిభుని (1280) యాస్థానివాఁడు, సిద్ధనకాఁడు. తాత లిరువురును సమకాలికులే యైనను వయసున భిన్నులై యుండవచ్చునుగదా, కాఁబట్టి క్రీ. శ. 1300 ల ప్రాంతమున పాల్కురికి సోమనాథాదులకు సమకాలికుఁడుగ, మారన మార్కండేయపురాణ రచనాకాలమునకు తర్వాత, ప్రతాపరుద్రచక్రవర్తి పతనమునకు (క్రీ.శ.1323) ముందు ఒక నన్నయయు, అతనికొక గంధవారణుఁడును ఉండియుండవలయును. నాటికి కుదిరిన వాఙ్మయపరిణామాదులును నన్నెచోడునిలో నుండుటయు, ఈతనికొక గంధవారణుఁ డుండుటయు, వారికాలమును ఇక్కడికేవచ్చి కేంద్రీకరించుచుండుటయు పరస్పరము అనుకూలములుగా నున్నవి. చూతము ఇంకను.

మఱి ఆవలిహద్దుగా సకలనీతిసమ్మతము కనఁబడుచున్నది గదా. మడికిసింగననాటికి తెనుఁగు కవిత్వమున 'సురత్రాణ' పదము 'సుల్తాన్' అనునది ప్రయుక్తమైనది. సుల్తాను నాజ్ఞకు అడ్డులే దనునర్థమున నిట్లు వ్రాయుచున్నాఁడు.

'సురతాణి ముద్రఁబోలెను
ధరనెల్లెడఁ జెల్లి పెక్కు తార్కాణలతో
సరివచ్చి సర్వసమ్మ
త్యరహముగావలయుఁ దజ్ఞుఁడాడినమాటల్'

ఇది సింగనదే, 'మదీయము' అన్నాఁడు. నన్నెచోడుఁడు తురుష్కుల, అనఁగా అల్లాయుదీను, మాలిక్ కాఫర్ మొదలైనవారి దండయాత్రల

కనంతరుఁడా ముందువాఁడా యనుప్రశ్నకు అనంతరుఁడేమో యని ఆతఁడు ప్రయోగించిన కొన్నిపదములచే తోఁచుచున్నది. అవి—(1) బాఁకు, (2) కైపు, (3) తరవారి.

(1) బాఁకు.

ఏకాదశాశ్వాసమున, తారకునితోడి యుద్ధమునకు సన్నద్ధులై 'అనంతశయన సురాధీశ్వర దిగధీశ్వరాది భువన భవనాధీశ్వరులు.....' 'పేరోలగంబుండి' నప్పుడు వీరపురుషుల వీరాలాపములలో నొకటి—

'పోర బాఁకుఁదాల్చి, నీరుగొన్నటు ప్రతి
బలమునెల్లఁ బాయవడఁగఁ దోలి,
గొడుగుక్రిందిరూపుఁ బొడిచి జయంబు నీ
కిత్తునధిప నన్ను నింతనమ్ము.' ప. 36.

శబ్దరత్నాకరములో "బాఁకు, దే. వి. 'కుందనపుఁ జాయల గేదఁగి తేకు బాఁకునఁ మానినిఁజేరి చీఁకి' భాను 3. ఆ." అనియున్నది. భానుఅనఁగా భానుమతీపరిణయము, రెంటూరి రంగరాజను నర్వాచీనకవి కృతము. ఇందులకు కవిత్రయప్రయోగము శబ్దరత్నాకర మాయలేదు. బ్రౌనుదొరగారు దీనిని తెనుఁగుపదములలో పఠింపక మిశ్రభాషానిఘంటువులో Bank, a dagger అని వ్రాసి ప్రక్కన అరబ్బీ అక్షరములలో కూడ వ్రాసినారు. బాగుదారు అనుమాటకును ఇదే అర్థమును అనుబంధమున నిచ్చినారు 'బాగుదారు n. s. (H) a kind of small sword. అల్పాసి ABA ఒకతరహా చిన్నకత్తి.' ఈబాఁకు శబ్ద మెట్టిదేశ్యమోగాని కవిత్రయమువారుగాని శివకవులుగాని ప్రయోగించినట్లు కానరాదు. పరిశోధింపవలెను. కాని యిది బాఁకుశబ్దమే కాదు, ఇచ్చట పాఠాంతరమున్నది అని కొంద అభిప్రాయపడుటకు అవకాశమున్నది. 'పాకు (దాల్చియు) 6 - 85=నీటిమీఁది పాకుఁడు.' అని మఱియొక పద్యప్రయోగమునుగూర్చి వ్రాసినారు మదరాసు విశ్వవిద్యాలయము వారు. ఈపద్యమును ముద్రించునెడ బాఁకునకుముందు అర్ధబిందువును ముద్రించినారు గాన 'బాఁకు' శబ్దముకాదని వారియభిప్రాయము. అట్లు

నచో 'పోర' తర్వాత పాఁకుదాల్చి నీరుగొనుట యేమి? 'పాఁకుదల్చి' అనఁగా పాఁకునుత్రోసి అని శ్రీప్రభాకరశాస్త్రిగారి సవరణయని వింటిని. అప్పుడు 'పోర'కు దూరాన్వయమగును. గొడుగుక్రింది రూపును బాఁకుతో పొడుచుట యనిన సంగతమగును. కాని 'నీరుగొన్నటు' అనుచో ఉపమకు 'ప్రాకుదల్చి' అని యన్ననే వాక్యసంపూర్తి. పోనిండు దీనిని వదలివేయుదము. అసలు బాఁకుశబ్దమే తెనుఁగనువారు లేక పోలేదు. ఏది యెట్లున్నను ఇది పదునాల్గవశతాబ్ది యనంతరమే ఆంధ్ర వాఙ్మయములో కనఁబడుచున్నది.

(2) కైఁపు—

'అరిబల మంటఁ దాకిన ... ... జ
ర్జరితముగాఁ బడంబొడిచి చంపక చిత్తము కైఁపువోవునే'
కుమా. 11 - 48.

'అంత నొండొంటింగని సూర్యుండు సూర్యకాంతాచలంబులుం
బోలె సురాసురవీరు లొండొరులంగని కైఁపు మిగిలి మహాఘోరయు
ద్ధంబు సేయం దొడంగిన' వచ. 11-114

'జెట్టిగవీరులై దురముసేసిరి కైపున దీఁడికా రనిఁ.' 11-147

'శరహతి బాహుమూలములు చక్కనఁ ద్రెవ్విన మానకాదిసూ
కరముల పోలెఁ గోల్మసఁగి కైపున గొన్నిమదాంధగంధసిం
ధురముల దీర్ప్రదంతములు దూఱి రయంబున నొత్తియొత్తి జ
ర్జరితముగా వడింబొడిచి చంపె మహాజిభయంకరాకృతిఁ' 11-153

'...సంగర మొనరింపఁబూని కడుఁగైపునమూర్ఖుని...' 12-42

'కైఁపునదాఁకి యేకాదశరుద్రులు
తల్లభీకరాఖ్యల గెలిచిరెదిరి' 12-60

'ఘనతరదీర్ఘదంతములు గైపుననూఁతియు' 12-71

'సురశత్రు వృత్ర ప్రయ్యలువడఁ దాఁకుకైపున' 12-73

'కరిశిరమాడషణ్ముఖుఁడు గైఁపునవ్రేయుఁడు' 12-182

కైపు శబ్దమును వావిళ్ల వారు అర్థబిందువుతో ముద్రించినారు. శబ్దరత్నాకరమున నిర్బిందుకము; 'లాహిరి' 'అందము' 'విజృంభణము' 'విధము' అను నర్థములలో పఠితము. దీనికే కైవురూపాంతరముగా ఉన్మాదార్థమున కలదు. ఈయర్థమునకు ఉదాహరణము ఉత్తరహరివం శమునుండి ప్రదర్శితము. 'కైవెక్కినవాని మేను గరమున నిమిరెఁ.' బ్రౌణ్యమున కైపనఁగా మత్తు, పైకము అనియున్నది. 'విజృంభణము' 'ఉన్మాదము' అని వానిలో మొదటి యర్థమునే చెప్పుకొనినను యుద్ధ రంగమున ఒడలు తెలియని వీరావేశమున ఉన్మాదావస్థకువచ్చుటయు సహజమే. యుద్ధవీరులు ప్రాగుటయు కలదు.

మఱి యిది పూర్తిగా ఆంధ్రదేశీయమా లేక తురుష్కుల యనంతరము మనభాషలోనికి వచ్చినదా యనునదేప్రశ్న. నాచన సోమునికి ముందెవ్వరును ఈపదమును వాడినట్లు కానరాదు. అప్పటికి మహమ్మదీయ సంపర్కము మనకు కలిగినదే. కైపు అనగా విధము అను నర్థమున దీనికి కైవు రూపాంతరముగా కుదిరిన నిది కైవడి (=విధము) శబ్దమునకు రూపాంతరమో వికృతియో కావలయును. కొన్ని దేశ్యములకు సదృశములు పారసీభాషలో కనఁబడుట వింత. (ఉదా. బావి - బావులీ. డిగ్గియ దీర్ఘిక యని యర్థము) ఈపదము కాకపోయినచో మఱి మూఁడవ పదము—

(3) తరవారి

క. ముంచిరి శరవర్షంబులఁ
జించిరి దృఢకవచసమితిఁ జేడ్వడి రిపులం
ద్రుంచిరి నిజతరవారుల
నించిరి తమకీర్తి దిశల నెఱయుఁగ సుభటుల్. ఆ. 11 - 115.

శబ్దరత్నాకరమున 'సం. వి. ఇ. పుం. కత్తి, పట్టాకత్తి (అనికొందఱు)'అని యున్నది. తరవరి యనుపదమునుండి 'వై. వి. పట్టాకత్తి' అని యర్థమును ఉత్తరహరివంశమునుండి ఈక్రింది యుదాహరణమును కలవు. 'తరవరుల వెరవరులకిచ్చి మెచ్చియు.' 'రూ. తరవలి, వ. తరవలి కత్తులం

దుత్తమురుగా మొత్తి' ఉ. హారి. అనియు కలదు. శ్రీనాథుని ప్రయోగము 'గౌతమీవారి తరవారి గడిగినాఁడు.'

ఈపదము సంస్కృతమేని అమరకోశమున లేదు. త్రికాండశేషమున క్షత్రియవర్గలో (ద్వి. కాండ.)

"ఋషిః ఖడ్గః తరవారిః శస్త్రో భద్రాత్మజశ్చసః
ధారావిషో విషసనో..."
"తరవారిః కృపాణకః" హారావళి.

నానార్థకోశములైన విశ్వ మేదినీ కోశములలో లేదు. ఉండుట కవకాశములేదు. ఏలన దీనికి నానార్థములు లేవుగాన. సంస్కృతపదము లన్నియు అమరకోశమునం దున్నవా, లేనివి లేవా? అని కొందఱు ప్రశ్నింపవచ్చును. ప్రసిద్ధమైనట్టియుండిన అమరుఁ డేల వదలును. తరవారి నుపయోగించుటయున్న ఆపేరుండదా?

ఈపదముల చరిత్ర నన్వేషించుట యుక్తము. సంస్కృతములో కూడ అన్యదేశ్యములు ప్రవేశించినవనుటను మఱువరాదు. అఫీనం లేక అహిఫేనాదులు గలవు. త్రికాండశేషాది నిఘంటువులు చాల నర్వాచీనములు; పదునాల్గు పదునైదుశతాబ్దముల కవతలివి. ఈపదములు 'కవిత్రయ' లేక 'కవిద్వయా'నంతరమే మనభాషలో కనఁబడుచున్నవి. వీనిని త్రోసిపుచ్చినను తరవారిశబ్దమును ప్రయోగించిన యొకపద్యము అల్లావు దీను చక్రవర్తినిగూర్చిన శ్లోకమును స్మరింపఁజేయుట చిత్రము. ఆ పద్యము—

క. ఇలఁ జిత్రము తారకు కర
తల సంగతమైన ఘోరతవారి సొర
న్నిలుపగుఁ దనుఁజొర కడరిన
దలమునుకయగు న్వీరోధితతి కబ్జభవా. ఆ. 4 - 14.

ఇందలి భావమునకు ఇంచుమించు సరిపడునది సాహిత్యదర్పణమునందలి ఈక్రింది శ్లోకము—

'సన్ధౌ సర్వస్వహరణం, విగ్రహే ప్రాణనిగ్రహః
అల్లావదీనన్నృపతౌ నసన్ధి ర్నచ విగ్రహః' పరి 4—కారి 26.

'సంధియందు సర్వస్వహరణమగును, విగ్రహమందు ప్రాణ నిగ్రహ మగును. అల్లావదీన నృపతితో సంధియులేదు విగ్రహంబునులేదు' (ఆంధ్రసాహిత్యదర్పణము, పు. 127)

నన్నెచోడుని పద్యములో 'ఘోరతర+వారి' యనియు 'ఘోర+తరవారి' యనియు చమత్కారపు చేమకూరవిఱుపు. ఈతరవారి (పట్టాకత్తిని (శరణు) చొచ్చిన, నిలుపు=అడ్డగించుట, నిరోధము అగును. లేదా శత్రువును (వచ్చిన విజిగీషువును) అక్కడికి ఆపుదలచేయుటయగును. లేదా తమకే 'నిలుపు' అభివృద్ధిమార్గము లేకపోవును. తను చొర కడరిన=తన్ను (తారకుని) శరణు చొరక ఎదిరించినచో, తలమునుకయగుట=తల (మునిఁగి) పోవుటయగును, సర్వనాశమగును. ఎటులైనను చిక్కే. ఇది చిత్రము ఇయ్యల. చిత్ర మేమనఁగా 'ఘోరతర+వారిని' చొచ్చిన నిలుపును 'వారిని చొరకడరిన' 'తలమునుక' యగుటయు. నీటిని చొచ్చిన మునుఁగుటయు చొరకయుండిన నిలుచుటయు సహజమైన ఇచట తద్విపరీతముగా నుండుట చిత్రముగాదా. పైశ్లోకమందలి భావమే గాక ఈ 'చిత్రము' తెనుఁగున కెక్కువ.

మఱి యీపద్యభావము అల్లాయుద్దీను దండయాత్ర వచ్చిన దేశమందే యుండుట చూడఁగా నీతఁడు పైశ్లోకమున కనంతరకవియా కాక ఆశ్లోకమునకు ఈతని పద్యమే మూలప్రాయమాయెనా - అను సంశయము కలుగకమానదు. క్రీ. శ. 1316 కు అల్లాయుదీను గతించెను. సాహిత్యదర్పణము క్రీ.శ. 1330 కి ముందుదని పండితుల యభిప్రాయము. శ్లోకము దర్పణకారునిచే ఉదాహృతమే గాని ఆతని రచనగాదు. చాటువు. ఇది 1300 నాటికి ఏర్పడియుండునని తలంచుటకు విద్యానాథుఁడు అల్లాయుద్దీను పేరెత్తలేదు. ఏది యెట్లున్నను, కాకతీయుల పతనకాలమునకో అంతకు కొంతముందో, లేక అల్లాయుదీను సజీవుఁడై యుండఁగానో ఇది పుట్టియుండును. ఆతఁడు సజీవుఁడైయుండిన గదా అందలి చమత్కార వ్యంగ్యార్థని ఆనందమొసంగును. 'శరణుచొచ్చినను కష్టమే ఎదిరించినను కష్టమే' యనుభావమేగాక విపరీతార్థ చిత్రము శ్లేషచే సాధింపఁబడినది

ఎక్కువగా నున్నది. శ్లోకభావమున కీపద్యము మెఱుంగై అందుచేత తర్వాతిది కావచ్చును. లేక కేవలము ఘుణాక్షరన్యాయమున అల్లాయు దీను నెఱుంగకయే కవికి ఆభావము స్ఫురించియు నుండవచ్చును. దాదాపు సమకాలీనములుగా నీశ్లోకమును పద్యమును కుదురుటచేత పద్యమే ముందై శ్లోకమే తర్వాతిదైనను రెండును ఇరువుర కాలముల ననుసరించి 1316 కు ముందును 1300 కు తరువాతను పుట్టియుండవల యును గదా.

ఈవిధముగా నింతవఱకును తర్కించుచు వచ్చినందుల ఫలితము పైపదములు అన్యదేశ్యములైనను కాకపోయినను,నన్నెచోడునికాలము తారీఖులతో కుదురకపోయినను, కాకతీయసామ్రాజ్యపతనమునకు మాత్రము చాలముందేయని తోఁచుచున్నది. బద్దెన నీతిశాస్త్రమును ప్రతాపరుద్రనరపాలుని నీతిసారమును కలిపి, బద్దెనను మొదటివానిని గాను ప్రతాపరుద్రుని రెండవవానినిగాను, ఆకవి యెవఁడో 'పరువడి నాంధ్రభాషగల బద్దెననీతియు, సంస్కృతంబులోఁ బరగఁ బ్రతాపరుద్ర నరపాలునిచే విరచింపఁబడ్డ యానరవరు నీతిసారము' అని వ్రాసి యుండుటచేతను, బద్దెన నన్నలకు సన్నిహితసంబంధము కనఁబడు చుండుటచేతను, నన్నన గంధవారణు లీకాలమునకు సరిపడువారు కొందఱు కనఁబడుచుండుటచేతను - అంతయు క్రీ. శ. 1300 కొంచెము తర్వాతికి కుదురునట్లున్నది. ఈతనికావ్యమును చక్కఁగా విమర్శించి గ్రహించినయెడల ఈయభిప్రాయము సరియైనదని తోఁచును.
